ఆదివారం
4•8•2019
కరీంనగర్
• వెల. రూ.8
• సంపుటి 9 • సంచిక 40
• పేజీలు: 16 + 16 + 32 పేజీల ఆదివారం అనుబంధం

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD




# గ్రామవికాస విప్లవం

## టార్గెట్ అరవై రోజులు • గుణాత్మక మార్పే లక్ష్యంగా అన్ని గ్రామాల్లో పక్కా కార్యాచరణ

- పచ్చదనం, పరిశుభ్రతే ప్రధాన లక్ష్యం
- గ్రామాభివృద్ధిలో పంచాయతీరాజ్‌ది ప్రధానపాత్ర
- సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లదే కీలకభూమిక
- గ్రామకార్యదర్శులకు ముఖ్య బాధ్యతలు
- విధుల్లో నిర్లక్ష్యంపై కఠినచర్యలు
- కార్యాచరణ పర్యవేక్షణకు 100 ఫ్లయింగ్ స్క్వాడ్లు
- పుట్టగానే కుల, జనన ధ్రువీకరణ పత్రాలు
- ఆర్నెళ్లలో విధిగా శ్మశానవాటికల ఏర్పాటు
- కరంట్ సమస్యల పరిష్కారానికి 'పవర్ వీక్'
- ప్రగతిభవన్‌లో ఉన్నతస్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి కేసీఆర్
- పాల్గొన్న మంత్రి దయాకర్‌రావు, అధికారులు, సర్పంచ్‌ల సంఘం ప్రతినిధులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత వెల్లివిరిసేందుకు అవసరమైన చర్యలు చేపట్టడం కోసం త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా '60 రోజుల కార్యాచరణ ప్రణాళిక'ను అమలుచేయనున్నట్లు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. ఇందుకోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. 60 రోజుల కార్యాచరణ అమలులో భాగంగానే పవర్ వీక్, హరితహారం నిర్వహించాలని తెలిపారు. గ్రామవికాస కార్యాచరణలో పంచాయతీరాజ్ శాఖది క్రియాశీలక పాత్ర కాబట్టి, ఈ శాఖను ప్రభుత్వం సంస్థాగతంగా బలోపేతం చేస్తుందని చెప్పారు. పంచాయతీరాజ్, మండల, జిల్లా పరిషత్‌లలో పోస్టులను భర్తీచేస్తామని సీఎం ప్రకటించారు. గ్రామాల అభివృద్ధిలో పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లు ఏమేమి పనులు చేయాలో స్పష్టంగా నిర్వచించుకొని ఎవరి విధులు వారు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల వికాసం కోసం ప్రభుత్వం ఒక సమగ్ర విధానాన్ని తీసుకొస్తుందని సీఎం కేసీఆర్ వెల్లడించారు. గ్రామపంచాయతీల్లో ఎవరికి ఎలాంటి అధికారాలు, విధులుంటాయో, ఏ విధంగా నిధులు సమకూరుతాయో స్పష్టంగా పేర్కొంటూ పంచాయతీరాజ్ చట్టం రూపొందించామని, కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు తమ విధులు నిర్వర్తించి గ్రామాభివృద్ధికి పాటుపడటానికి ఇది చక్కని అవకాశమని సీఎం అన్నారు. గ్రామపంచాయతీల్లో అమలుచేయాల్సిన 60 రోజుల కార్యాచరణపై ముఖ్యమంత్రి కేసీఆర్ శనివారం ప్రగతిభవన్‌లో అధికారులు, సర్పంచ్‌ల సంఘం ప్రతినిధులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

**గుణాత్మక మార్పు రావడమే లక్ష్యం**

'స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేండ్లయినా గ్రామాల పరిస్థితి ఇంకా మారలేదు. వివిధ రూపాల్లో ఎన్నో వేల కోట్లు ఖర్చు పెట్టినప్పటికీ ఫలితం కానరావడం లేదు. గ్రామాల్లో ఎక్కడ సమస్యలు అక్కడే తిష్టవేసి ఉన్నాయి. ఎవరికి వారు బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలను బాగుచేసుకొనే పద్ధతి రావడం లేదు. ఈ పరిస్థితిలో గుణాత్మక మార్పు రావాలి. అందుకోసమే కొత్త పంచాయతీరాజ్ చట్టం తెచ్చాం. అధికారులు, ప్రజాప్రతినిధులపై ఖచ్చితమైన బాధ్యతలు పెట్టాం. ఎవరేం పని చేయాలో నిర్దేశించాం. అవసరమైన అధికారాలిచ్చాం. కావాల్సిన నిధులను బడ్జెట్లోనే కేటాయించాం. విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించేవారిపై కఠినచర్యలు

మిగతా 2వ పేజీలో



శనివారం ప్రగతిభవన్‌లో ఐటీసీ చైర్మన్ సంజీవ్‌పురికి జ్ఞాపికను అందజేస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

## ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు కలిసిరండి

2

వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర.. ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించడమే లక్ష్యం

పర్యాటకరంగ అభివృద్ధిలోనూ భాగస్థులు కండి.. ఐటీసీ చైర్మన్ సంజీవ్‌పురితో సీఎం కేసీఆర్



శనివారం శ్రీనగర్ నుంచి ప్రత్యేక బస్సులో జమ్ముకు వస్తున్న తెలుగు విద్యార్థులు

## కశ్మీర్ నుంచి తిరుగుముఖం

వెనుకకు వస్తున్న అమర్‌నాథ్ యాత్రికులు, పర్యాటకులు

- ప్రత్యేక ఏర్పాట్లుచేసిన పర్యాటకశాఖ
- రంగంలోకి దిగిన వాయుసేన విమానాలు
- కిక్కిరిసిన బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, ఎయిర్‌పోర్టులు
- తగినన్ని వాహనాలు లేక ప్రయాణికుల అవస్థలు

7

## జమ్ము చేరిన శ్రీనగర్ నిట్ తెలుగు విద్యార్థులు

సాయంకోసం చేసిన ట్వీట్‌కు స్పందించిన కేటీఆర్

సీఎస్‌తోపాటు ఢిల్లీలోని అధికారులతో చర్చలు

ప్రత్యేక బస్సుల్లో ఢిల్లీకి వస్తున్న 130 మంది విద్యార్థులు

2

## టీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గుత్తా



ప్రకటించిన పార్టీ అధ్యక్షుడు కేసీఆర్

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన సుఖేందర్‌రెడ్డి

2

# చెరువు మురిసింది



శనివారం వరంగల్ జిల్లా అనంతసాగర్ చెరువు అలుగు పారుతున్న దృశ్యం

- గోదావరి బేసిన్‌లో 6,159, కృష్ణా బేసిన్‌లో 1,077 చెరువుల్లో జలకళ
- సత్ఫలితాలిస్తున్న మిషన్ కాకతీయ
- గొలుసుకట్టుతో భారీగా పెరిగిన నదీజలాల వినియోగం

11

**చెరువు** మురిసింది. స్థానికంగా కురిసిన వర్షాలతో పాటు, గోదావరి, కృష్ణా నీటితో అనేక చెరువులు నిండుకుండల్లా మారాయి. కడలి వైపు పరుగులు పెడుతున్న నదీజలాలు గొలుసుకట్టు చెరువుల ద్వారా పొలాల్లోకి తరులుతున్నాయి. ఒకప్పుడు చిన్నపాటి వర్షానికే కట్టలు తెగే చెరువులు మిషన్ కాకతీయతో రిజర్వాయర్లను తలపిస్తున్నాయి. గొలుసుకట్టు చెరువులతో రాష్ట్రంలో నదీజలాల వినియోగం భారీగా పెరుగనున్నది. చెరువుల పునరుద్ధరణకు సర్కారు చేపట్టిన మిషన్ కాకతీయ విజయం ఇప్పుడు గ్రామాల్లో చెరువులన్నింటా కనిపిస్తున్నది.

## మూడుకోర్టులు తీర్పు ఇచ్చినా.. ముప్పతిప్పలు




బాధితుడు ముత్యంరావు

5

- 27 ఏండ్లుగా తాసిల్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు
- కోర్టు తీర్పు ఇచ్చిన పద్నాలుగేండ్ల తర్వాత పాస్‌పుస్తకం జారీ
- పహాణీ, వన్ బీలో మారని పేరు.. కొత్త పాస్‌బుక్ జారీకీ వేధింపులు
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన భూపాలపల్లి జిల్లా బాధితుడు

**ఒకటి** కాదు.. రెండు కాదు.. మూడుసార్లు కోర్టు మెట్లెక్కారు.. మూడుసార్లూ కోర్టులు బాధితుడికి అనుకూలంగానే తీర్పు ఇచ్చాయి. కానీ వాటిని అమలు చేయడానికి రెవెన్యూ అధికారులకు మాత్రం చేతులు రావడం లేదు. దాదాపు 29 ఎకరాల భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే పాస్‌పుస్తకం మాత్రం ఇచ్చి.. పహాణీ, వన్ బీలో పేరుమార్చకుండా కోర్టునూ తప్పుదారి పట్టించారు. ఇదిగో చేస్తున్నాం.. అదిగో చేస్తున్నాం అంటూ దాదాపు 30 ఏండ్లుగా తాసిల్ కార్యాలయం చుట్టూ తిప్పుకొంటున్నారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో విసిగిపోయిన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం నస్తూర్‌పల్లికి చెందిన పీ వెంకటముత్యంరావు 'ధర్మగంట'ను ఆశ్రయించారు.




## బిరబిరా కృష్ణమ్మ

అల్మట్టి నుంచి శ్రీశైలం దాకా అదే వేగం

శ్రీశైలంలోకి 24 గంటల్లోనే 18.29 టీఎంసీలు

80.36 టీఎంసీలకు పెరిగిన జలాశయం నీటినిల్వ

జూరాలలో నిరంతరంగా విద్యుదుత్పత్తి

3

**చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 85.00 | రిటైల్ లైవ్ | 107.00 |
| డ్రెస్‌డ్ | 155.00 | స్కిన్‌లెస్ | 177.00 |

**గుడ్ల ధరలు (వందకు) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 326.00 | రంగారెడ్డి | 326.00 |
| మెదక్ | 326.00 | కరీంనగర్ | 329.00 |
| వరంగల్ | 329.00 | చిల్లర ధర | 3.85 |

# గలగలా గోదారి..

- పేరూరు దగ్గర ఆరు లక్షల క్యూసెక్కులకు పైగా వరద
- కడెం, ఎల్లంపల్లికి పెరిగిన ఇన్‌ఫ్లోలు
- బాసర, ధర్మపురిలో గంగమ్మ కళకళ

**నమస్తే తెలంగాణ, హైదరాబాద్/ నెట్‌వర్క్:**

వరద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నది. ప్రాణహిత నుంచి లక్షల క్యూసెక్కుల వరద గోదావరి బేసిన్‌లోకి వచ్చి చేరుతున్నది. శనివారం ఉదయం పేరూరు దగ్గర గోదావరి 6.51 లక్షల క్యూసెక్కుల ప్రవాహం నమోదైంది. ధవళేశ్వరం దగ్గర ఇన్‌ఫ్లో శనివారం కొంతమేర తగ్గింది. బరాజ్‌కు 6,48 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా.. అధికారులు సముద్రంలోకి 6.39 లక్షల క్యూసెక్కులు వదులుతున్నారు. ఈ నీటిసంవత్సరంలో ఇప్పటిదాకా 269.04 టీఎంసీల గోదావరిజలాలు సముద్రంలో కలిశాయి. గడిచిన 24 గంటల్లోనే సుమారు 50 టీఎంసీల వరకు గోదావరిజలాలు సముద్రంలో కలిశాయి. నిర్మల్ జిల్లా స్వర్ణ ప్రాజెక్టు, సదర్మాట్ ప్రాజెక్టులు జలకళతో

మిగతా 3వ పేజీలో



శనివారం జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలం కమ్మునూర్ వద్ద నిండుగా పారుతున్న గోదావరి

- అన్ని ప్రాజెక్టుల్లోనూ పెద్ద ఎత్తున ఇన్‌ఫ్లోలు
- మేడిగడ్డ వద్ద నిలకడగా నీటి ప్రవాహం
- మిడ్‌మానేర్‌కు నీటి విడుదలకు సన్నాహాలు
- నందిమేడారం మోటర్లను పరిశీలించిన పెద్దపల్లి కలెక్టర్

## 48 గంటల్లో అల్పపీడనం!

రాష్ట్రంలో మరో రెండురోజులు వర్షాలు

4



రాష్ట్ర అటవీ సంరక్షణ ఇంచార్జి ప్రధానాధికారిగా బాధ్యతలు చేపట్టిన ఆర్ శోభ శనివారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం రాజ్‌భవన్‌లో గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

# తెలంగాణ అటవీ ఉత్పత్తులకు అంతర్జాతీయ గుర్తింపు!

- గుర్తింపు ఇవ్వాలని ఎఫ్ఎస్సీకి వినతి
- త్వరలో అమెరికా సంస్థ పర్యటన
- గుర్తింపు ఖాయమని ఎఫ్‌డీసీ ధీమా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తన అటవీ ఉత్పత్తులకు అంతర్జాతీయస్థాయి గుర్తింపును తీసుకొచ్చే ప్రయత్నాలను ముమ్మరంచేసింది. మెరుగైన అటవీ ఉత్పత్తులకు గుర్తింపునిచ్చే అమెరికాలోని ఫారెస్ట్ స్టీవార్డ్‌షిప్ కౌన్సిల్(ఎఫ్ఎస్సీ)ను సంప్రదించింది. రాష్ట్రంలో అటవీఉత్పత్తులు పూర్తిగా నాణ్యతతో కూడినవని, శాస్త్రీయపద్ధతుల్లో తయారవుతున్నాయని ఫారెస్ట్ స్టీవార్డ్‌షిప్ కౌన్సిల్‌కు రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) ఎండీ, పీసీసీఎఫ్ రఘువీర్ నివేదించారు. క్షేత్రస్థాయిలో ఉత్పత్తులను పరిశీలించి గుర్తింపునివ్వాలని ఎఫ్ఎస్సీను ఆయన కోరారు. ఈ వినతిని పరిశీలించిన సంస్థ, ఈ నెలలో రాష్ట్ర అడవుల్లో క్షేత్రస్థాయిలో పర్యటించాలని నిర్ణయించింది. కౌన్సిల్ సభ్యులు రెండురోజులపాటు క్షేత్రస్థాయిలో పర్యటించి అటవీ ఉత్పత్తులను పరిశీలించాక గుర్తింపు ఇస్తారు. తెలంగాణ అటవీఉత్పత్తులు అంతర్జాతీయ ప్రమాణాలతో ఉన్నాయని, ఎఫ్ఎస్సీ గుర్తింపు లభించడం ఖాయమని అధికారులు ధీమా వ్యక్తంచేస్తున్నారు.

### గుర్తింపు వస్తే మెరుగైన ధర

ఎఫ్ఎస్సీ బ్రాండ్ ఉన్న అటవీఉత్పత్తులకు అంతర్జాతీయమార్కెట్‌లో నాలుగు రెట్లు ధర అధికంగా ఉంటుంది. రాష్ట్రంలో పెంచుతున్న వెదురు, యూకలిప్టస్, టేకు, టింబర్, పేపర్ తయారీకి ఉపయోగించే పల్ప్‌వుడ్ వంటి ఉత్పత్తులకు దేశీయమార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. తెలంగాణ కలపకు అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఉంది. కానీ, రాష్ట్ర అటవీఅభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలోని సరుకులకు ఎఫ్ఎస్సీ బ్రాండ్ లేకపోవడంతో అంతర్జాతీయమార్కెట్‌లో మెరుగైన ధర పలుకడంలేదు.



## డీపీఎస్ఈ కోర్సు ఫలితాలు విడుదల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** డిప్లొమా ఇన్ ప్రీ-స్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ) ప్రోగ్రామ్ కోర్సు మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఫలితాలను www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో పెట్టామని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ బీ సుధాకర్ తెలిపారు. మార్కుల మెమోలను ప్రిన్సిపాళ్లకు పంపిస్తామని, తాత్కాలిక మెమోలను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. ప్రతి సబ్జెక్టుకు రూ.500 ఫీజుగా నిర్ణయించామని, రీ కౌంటింగ్‌కు 16 లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## డిగ్రీ కాలేజీల్లో 1.74 లక్షల సీట్లు భర్తీ

- ఇంకా మిగిలిన సీట్లు 2.12 లక్షలు
- త్వరలో మరోవిడుత దోస్త్ కౌన్సెలింగ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో దోస్త్ పరిధిలోని డిగ్రీ కాలేజీల్లో మొత్తం 3,86,684 సీట్లు ఉండగా.. ఇప్పటివరకు 1,74,073 సీట్లు భర్తీ అయినట్టు దోస్త్ అధికారులు తెలిపారు. ఇంకా 2,12,611 సీట్లు మిగిలే ఉన్నాయని, దాదాపు 50 శాతానికి పైగా కాలేజీల్లో సీట్లు భర్తీ కాలేదని పేర్కొన్నారు. యాభైకిపైగా కాలేజీల్లో అసలు అడ్మిషన్లే ప్రారంభం కాలేదని వెల్లడించారు. డిగ్రీ కాలేజీల్లో సీట్ల భర్తీ నిర్వహించిన ప్రత్యేక కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన విద్యార్థులకు రిపోర్టింగ్ గడువు ముగియడంతో మిగిలిన సీట్ల వివరాలను శనివారం దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ లింబాద్రి వెల్లడించారు. మిగిలిన సీట్ల భర్తీకి త్వరలోనే మరో విడుత కౌన్సెలింగ్ కోసం షెడ్యూల్ విడుదలకు సన్నాహాలు చేస్తున్నట్టు తెలిపారు.

## వ్యవసాయ వర్సిటీలో 7 నుంచి బైపీసీ స్ట్రీమ్ కౌన్సెలింగ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఈ నెల 7 నుంచి 14 వరకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం బైపీసీ స్ట్రీమ్ కోర్సుల్లో ప్రవేశానికి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు రిజిస్ట్రార్ డాక్టర్ సుధీర్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జయశంకర్ వర్సిటీలో బీఎస్సీ అగ్రికల్చర్, పీవీ నరసింహారావు వెటర్నరీ విశ్వవిద్యాలయంలో బీవీఎస్సీ అండ్ ఏహెచ్, బీఎఫ్ఎస్సీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో బీఎస్సీ హార్టికల్చర్ కోర్సులకు ఇప్పటికే దరఖాస్తుచేసుకొన్న అభ్యర్థుల వివరాలు www.pjtsau.edu.in లో చూసుకోవచ్చని పేర్కొన్నారు. షెడ్యూల్‌లో పొందుపరిచిన ర్యాంకుల ప్రకారం ఆయా తేదీల్లో నిర్ణీత ఫీజుతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు.



గ్రామ పంచాయతీల్లో అమలుచేయాల్సిన 60 రోజుల కార్యాచరణ ప్రణాళికపై శనివారం ప్రగతిభవన్‌లో అధికారులు, సర్పంచ్‌ల సంఘం ప్రతినిధులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు. ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, సీఎస్ ఎస్కే జోషి, ముఖ్య కార్యదర్శి ఎస్ నర్సింగ్‌రావు, పంచాయతీరాజ్ కార్యదర్శి వికాస్‌రాజ్, కమిషనర్ నీతూకుమారి ప్రసాద్, పలు జిల్లాల కలెక్టర్లు, సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు భూమన్న యాదవ్, పలువురు సర్పంచ్‌లు కూడా ఉన్నారు.

# గ్రామ వికాస విప్లవం


మొదటిపేజీ తరువాయి...


తీసుకొనే అధికారం కూడా ఈ చట్టం ప్రభుత్వానికి కల్పించింది. కొత్త చట్టాన్ని కట్టుదిట్టంగా అమలుచేసే విషయంలో ప్రభుత్వం చాలా మొండిగా వ్యవహరిస్తుంది. ఎవరినీ ఉపేక్షించదు. గ్రామాల్లో గుణాత్మక మార్పు తేవడమే ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం ఏమి చేయాలో అది చేస్తాం' అని ముఖ్యమంత్రి స్పష్టంచేశారు.

### అన్ని పంచాయతీలకు డీపీవోలు

'అన్ని జిల్లాలకు జిల్లా పంచాయతీ అధికారులను (డీపీవో) నియమించాలి. ప్రతి రెవెన్యూ డివిజన్‌కు ఒకరు చొప్పున డీఎల్పీవోలను నియమించాలి. ప్రతి మండలానికి ఒక మండల పంచాయతీ అధికారి (ఎంపీవో) ని నియమించాలి. ఈవోపీఆర్ అండ్ ఆర్డీ అనే పేరును తీసేసి, ఎంపీవోగా మార్చాలి. ఎంపీడీవో, సీఈవో పోస్టులను భర్తీచేయాలి. పోస్టులను భర్తీచేయడానికి వీలుగా పంచాయతీ అధికారులకు పదోన్నతులివ్వాలి. శాఖాపరంగానే కొత్త నియామకాలు చేపట్టాలి. ప్రక్రియ అంతా చాలా వేగంగా జరుగాలి' అని సీఎం కేసీఆర్ ఆదేశించారు.

### పచ్చదనం, పరిశుభ్రతపైనే దృష్టిపెట్టాలి

గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో వ్యవహరించి, ప్రజల భాగస్వామ్యంతో పచ్చదనం, పరిశుభ్రతను పెంచే కార్యక్రమం చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. మిషన్ భగీరథ ద్వారా మంచి నీళ్లను ప్రభుత్వమే సరఫరా చేస్తున్నందున గ్రామపంచాయతీలపై పెద్ద భారం దిగిపోయిందని, కరంటు, సాగునీటి కల్పన, చెరువుల పునరుద్ధరణ, రోడ్ల నిర్మాణం, విద్య, వైద్యం లాంటి ప్రధాన సమస్యలన్నీ ప్రభుత్వమే నేరుగా చేస్తున్నదని, గ్రామ పంచాయతీలు పచ్చదనం, పరిశుభ్రతపైనే ఎక్కువ దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. త్వరలోనే రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో 60 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలుచేయాలని ఆదేశించారు. 60 రోజుల తర్వాత ముఖ్యఅధికారుల నేతృత్వంలోని 100 ఫ్లయింగ్ స్క్వాడ్లు రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి, ఆకస్మిక తనిఖీలు చేస్తాయన్నారు. ఏ గ్రామంలో అయితే 60 రోజుల కార్యాచరణలో నిర్దేశించిన పనులు చేపట్టలేదో అక్కడ సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులపై చర్యలు తీసుకుంటామని సీఎం చెప్పారు. ఈ సమీక్షా సమావేశంలో పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, సీఎస్ ఎస్కే జోషి, ముఖ్య కార్యదర్శి ఎస్ నర్సింగ్‌రావు, పంచాయతీరాజ్ కార్యదర్శి వికాస్‌రాజ్, కమిషనర్ నీతూకుమారి ప్రసాద్, మహబూబ్‌నగర్, సిద్దిపేట, కామారెడ్డి, జయశంకర్ భూపాలపల్లి, సూర్యాపేట జిల్లాల కలెక్టర్లు రొనాల్డ్ రాస్, వెంకట్రామిరెడ్డి, ఎం సత్యనారాయణ, వీ వెంకటేశ్వర్లు, అమయ్‌కుమార్.. సిద్దిపేట, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, సిరిసిల్ల జిల్లాల పంచాయతీ అధికారులు సురేశ్‌బాబు, పద్మరాణి, రవికుమార్, వీ వెంకటేశ్వర్లు, రిటైర్డ్ డీపీవో లింబగిరి స్వామి, ఈవోపీఆర్ అండ్ ఆర్డీలు బీ శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు భూమన్న యాదవ్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు ప్రణీత్‌చందర్, ఉమ్మడి మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, నల్లగొండ జిల్లా అధ్యక్షురాలు ధనలక్ష్మి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాచిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 60 రోజుల కార్యాచరణలో చేపట్టాల్సిన పనులు

- ☞ గ్రామంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించాలి.
- ☞ కూలిపోయిన ఇండ్లు, పాడైపోయిన పశువుల కొట్టాల శిథిలాలను పూర్తిగా తొలిగించాలి.
- ☞ పాడుపడిన బావులను, నీటి బొందలను పూడ్చేయాలి. ఇందుకు నరేగా నిధులు వాడుకోవాలి. దోమల మందు పిచికారి చేయాలి.
- ☞ సర్కారు తుమ్మ వంటి పిచ్చిమొక్కలు తొలిగించాలి.
- ☞ లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ☞ వైకుంఠధామం (శ్మశానవాటిక) నిర్మాణం కోసం అనువైన స్థలాలను ఎంపిక చేయాలి.
- ☞ ప్రతి రెండువేల జనాభాకు ఒకటి చొప్పున వైకుంఠ ధామం నిర్మించాలి.
- ☞ ఆరునెలల్లో వైకుంఠధామాలను ఏర్పాటుచేయాలి.
- ☞ గ్రామ డంపింగ్‌యార్డు కోసం స్థలం సేకరించాలి.
- ☞ విలేజ్ కమ్యూనిటీ హాల్, విలేజ్ గోదాం నిర్మాణానికి స్థలాలు కేటాయించాలి.
- ☞ గ్రామానికి కావాల్సిన వార్షిక, పంచవర్ష ప్రణాళికలు వేర్వేరుగా రూపొందించాలి (ప్లాన్ యువర్ విలేజ్). ఆ గ్రామంలో ఉన్నదేమిటి? కావల్సిందేమిటి? దాని కోసం ఏం చేయాలి? అనేది ప్రణాళికల్లో ఉండాలి.

### పవర్ వీక్‌లో చేయాల్సిన పనులు

- ☞ 60 రోజుల కార్యాచరణలో భాగంగా ఏడురోజులు పూర్తిగా విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి.
- ☞ గ్రామంలో వీధిలైట్ల కోసం ఎంత కరంట్ వాడుతున్నారో ఖచ్చితమైన నిర్ధారణకు రావాలి. మీటర్లు పెట్టాలి. వీధిలైట్ల కోసం థర్డ్ లైన్‌ను వేయాలి. విధిగా ఎల్ఈడీ బల్బులు అమర్చాలి.
- ☞ గ్రామంలో వంగిపోయిన స్తంభాలను సరిచేయాలి. వేలాడే వైర్లను సరిచేయాలి. కర్ర, ఇనుప స్తంభాలను తొలిగించి, సిమెంటు స్తంభాలను ఏర్పాటుచేయాలి.

### తెలంగాణకు హరితహారంలో చేయాల్సిన పనులు

- ☞ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలోనే విలేజ్ నర్సరీ ఏర్పాటుచేయాలి. మండల అటవీశాఖాధికారి నుంచి సాంకేతిక సహకారం తీసుకోవాలి. ఇందు కోసం నరేగా నిధులు వినియోగించాలి.
- ☞ గ్రామంలో విరివిగా మొక్కలు నాటాలి. వాటికి నీళ్లు పోసి, రక్షించాలి. పెట్టిన మొక్కలన్నీ చెట్లుగా ఎదిగే వరకు బాధ్యత తీసుకోవాలి.
- ☞ ఇంటి యజమానులు, రైతులతో మాట్లాడి వారికి ఏ రకం చెట్లు కావాలో ముందే తెలుసుకొని, ఆ మొక్కలను సరఫరాచేయాలి.
- ☞ చింతచెట్లను పెద్దసంఖ్యలో పెంచాలి.

### గ్రామ పంచాయతీలు నిర్వహించాల్సిన బాధ్యతలు

- ☞ గ్రామంలో వందకు వందశాతం పన్నులు వసూలు చేయాలి. ఇది గ్రామ కార్యదర్శి బాధ్యత.
- ☞ వారపు సంత (అంగడి) లో సౌకర్యాలు కల్పించాలి.
- ☞ వివాహ రిజిస్ట్రేషన్ నిర్వహించాలి. ఎవరు పెండ్లిచేసుకున్నా వెంటనే రికార్డులో నమోదుచేసుకోవాలి.
- ☞ జనన, మరణ రికార్డులు రాయాలి. పుట్టిన వెంటనే కులం వివరాలతో సహా బర్త్ సర్టిఫికెట్ ఇవ్వాలి.
- ☞ విద్యుత్ సంస్థలకు విధిగా బిల్లులు చెల్లించాలి.
- ☞ గ్రామపంచాయతీ నిధులతో నరేగా నిధులు అనుసంధానం అయ్యే విధానం రూపొందించాలి.
- ☞ ఆయా ప్రాంతాల్లోని పరిశ్రమలు, ఇతర కంపెనీలతో సంప్రదించి, సీఎస్సార్ నిధులను గ్రామాభివృద్ధికి ఉపయోగించే విధానం అవలంబించాలి.
- ☞ గ్రామస్థులను శ్రమదానానికి ప్రోత్సహించి, సామాజిక పనులు చేయాలి.

# ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లకు కలిసిరండి

- వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర..
- ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించడమే లక్ష్యాలు
- పర్యాటకరంగ అభివృద్ధిలోనూ భాగస్థులు కండి
- ఐటీసీ చైర్మన్ సంజీవ్‌పురితో ముఖ్యమంత్రి కేసీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించే అంశంలో ప్రభుత్వంతో కలిసిరావాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఐటీసీ ప్రతినిధులను కోరారు. వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటుధర కల్పించడంతోపాటు ప్రజలకు నాణ్యమైన, కల్తీలేని ఆహారపదార్థాలు అందించే లక్ష్యంతో పెద్దఎత్తున ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటుచేయాలని ప్రభుత్వం భావిస్తున్నదని తెలిపారు. ఐటీసీ చైర్మన్ సంజీవ్‌పురి, ఈడీ నకుల్ ఆనంద్, సీనియర్ అధికారులు సంజయ్‌సింగ్, ఉషారాణి శనివారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఐటీసీ ప్రతినిధులు పలు అంశాలను సీఎం కేసీఆర్‌కు వివరించారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ సమీపంలో రూ.800 కోట్ల వ్యయంతో ఐటీసీ చేపట్టిన ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణపనులు పూర్తయ్యాయని, రెండుమూడు నెలల్లో ఈ యూనిట్‌ను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. తెలంగాణలో అతిపెద్ద ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్‌ను తక్కువ సమయంలోనే నిర్మించినందుకు సీఎం కేసీఆర్ ఈ సందర్భంగా వారిని అభినందించారు. వ్యవసాయ ఉత్పత్తులకు మంచి ధర రావడంతోపాటు ప్రజలకు కల్తీలేని ఆహార పదార్థాలు అందడంకోసం పెద్దఎత్తున ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నదని, ఈ లక్ష్యసాధనకు ఈ రంగంలో అనుభవం కలిగిన ఐటీసీ కలిసి రావాలని సీఎం కేసీఆర్ సూచించారు. రాష్ట్రంలో నాలుగున్నర లక్షల మహిళా సంఘాలున్నాయని, ముడిసరుకు సేకరణలో, ఇతరత్రా అంశాల్లో మహిళల సేవలను వినియోగించుకుని రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పాలని, దీన్ని సామాజిక బాధ్యతగా స్వీకరించాలని కోరారు. ములుగు జిల్లాలో రేయాన్స్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు ఐటీసీ చొరవచూపాలని సీఎం కోరగా.. ఐటీసీ అధికారులు సానుకూలంగా స్పందించారు.

### పర్యాటక అభివృద్ధిలోనూ భాగస్థులు కండి

రాష్ట్రంలో కాళేశ్వరంతోపాటు ఇతర ప్రాజెక్టుల నిర్మాణం శరవేగంగా పూర్తిచేస్తున్నామని సీఎం కేసీఆర్ ఈ సందర్భంగా వెల్లడించారు. తెలంగాణవ్యాప్తంగా దాదాపు 500 టీఎంసీల సామర్థ్యం కలిగిన జలాశయాలు సిద్ధమవుతున్నాయని, వాటిచుట్టూ అందమైన ప్రకృతి ఆకృతిదాలుస్తుందని చెప్పారు. రాష్ట్రంలో సహజసిద్ధమైన అడవులున్నాయని, చారిత్రక ప్రదేశాలున్నాయని, ఇవన్నీ పర్యాటక కేంద్రాలుగా వెలుగొందే అవకాశం ఉన్నదని తెలిపారు. రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధికి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నదని, వాటిలో కూడా ఐటీసీ కలిసిరావాలని సీఎం కేసీఆర్ కోరారు.

### ముహూర్తం

సూర్యోదయం: 6.00 గంటలకు

సూర్యాస్తమయం: 6.44 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం చతుర్థి సాయంత్రం 6.50 వరకు, తదుపరి పంచమి, నక్షత్రం: ఉత్తర, అమృతఘడియలు: రాత్రి 7.15 నుంచి 8.51 వరకు, రాహుకాలం: సాయంత్రం 5.09 నుంచి 6.44 వరకు, దుర్ముహూర్తం: సాయంత్రం 5.03 నుంచి 5.53 వరకు, వర్జ్యం: తె.జా. 4.28 నుంచి ఉదయం 6.04 వరకు.

### లోకం పోకడ




ఇంకెక్కడి మత్తు సార్.. తాగిన కిక్కంతా ఈ వానకు దెబ్బకు దిగిపోయింది!

# జమ్ముచేరిన శ్రీనగర్ నిట్ తెలుగు విద్యార్థులు

- సాయంకోసం చేసిన ట్వీట్‌కు స్పందించిన కేటీఆర్
- సీఎస్‌తోపాటు ఢిల్లీలోని అధికారులతో చర్చలు
- విద్యార్థులను భద్రంగా హైదరాబాద్‌కు తేవాలని వినతి




విద్యార్థులకు భరోసాఇస్తూ కేటీఆర్ చేసిన ట్వీట్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జమ్ముకశ్మీర్‌లో పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో శ్రీనగర్‌లోని ఎన్ఐటీ (నిట్)లో దిక్కుతోచని స్థితిలో చిక్కుకున్న 130 మంది తెలుగు విద్యార్థులు.. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు చొరవతో సురక్షితంగా జమ్ముకు చేరుకున్నారు. వారిని ప్రత్యేక బస్సుల్లో ఢిల్లీకి తరలిస్తున్నారు. అనంతరం రైళ్లలో వారిని హైదరాబాద్‌కు తరలించేందుకు ఢిల్లీలోని తెలంగాణ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జమ్ముకశ్మీర్‌లో పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో శ్రీనగర్ నిట్‌లోని విద్యార్థులంతా వెంటనే క్యాంపస్‌ను ఖాళీచేసి వెళ్లిపోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఆందోళన చెందిన తెలుగు విద్యార్థులు.. తమను ఆదుకోవాలని ట్విట్టర్ ద్వారా కేటీఆర్‌కు విజ్ఞప్తిచేశారు. దీనికి కేటీఆర్ వెంటనే స్పందించి వారికి అభయమిచ్చారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, సహాయం కోసం 011-233820141 లేదా 9968299337 ఫోన్ నంబర్ల ద్వారా ఢిల్లీలోని తెలంగాణభవన్ రెసిడెంట్ కమిషనర్ వేదాంతం గిరిని సంప్రదించాలని కేటీఆర్ ట్వీట్ చేశారు. తెలుగు విద్యార్థులను సురక్షితంగా రాష్ట్రానికి చేర్చేందుకు ఏర్పాట్లు చేయాలని కేటీఆర్ శనివారం ఫోన్‌ద్వారా వేదాంతం గిరితోపాటు సీఎస్ ఎస్కే జోషిని కోరారు. శ్రీనగర్ నిట్ విద్యార్థులు ఇప్పటికే రోడ్డు మార్గాన జమ్ముకు బయలుదేరారని, వారిని జమ్ము నుంచి ఢిల్లీకి తరలించేందుకు వేదాంతంగిరి ప్రత్యేక బస్సులను ఏర్పాటుచేశారని, ఢిల్లీకి చేరిన తర్వాత రైళ్లలో హైదరాబాద్‌కు తరలించేందుకు ఏర్పాట్లుచేస్తు న్నట్టు సీఎస్ వివరించారు. వెంటనే స్పందించిన అధికారులకు కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు.

## తెలంగాణ.. పవర్ బ్యాంక్!

కర్ణాటకకు 200, పంజాబ్‌కు 500 మెగావాట్ల విద్యుత్

రాష్ట్రంలో డిమాండ్ ఉన్నప్పుడు తిరిగి తీసుకునే అవకాశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విద్యుత్ విషయంలో ఇతర రాష్ట్రాలతో ఇచ్చిపుచ్చుకునే ధోరణిని తెలంగాణ జెన్‌కో ఈ ఏడాదికూడా అమలుచేస్తున్నది. ప్రస్తుతం విద్యుత్ డిమాండ్ తక్కువగా ఉండటంతోపాటు జలవిద్యుత్ కూడా అందుబాటులోకి రావడంతో కర్ణాటక, పంజాబ్ రాష్ట్రాలకు తెలంగాణ జెన్‌కో విద్యుత్‌ను అందిస్తున్నది. జూరాలలో తెలంగాణ జెన్‌కో 240 మెగావాట్ల జలవిద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నది. ఇందులో కర్ణాటకకు 200 మెగావాట్లను పంపిణీ చేస్తున్నది. గతంలోకూడా కర్ణాటకకు విద్యుత్‌ను సరఫరాచేసి, అవసరమైనప్పుడు తీసుకున్నది. ఈసారి కర్ణాటకకు విద్యుత్‌ను అందిస్తున్నామని జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు తెలిపారు. తెలంగాణ జెన్‌కో పంజాబ్‌కు కూడా 500 మెగావాట్ల విద్యుత్‌ను సరఫరాచేస్తున్నది. ఇక్కడ మిగులు విద్యుత్ ఉంటే అవసరమైన రాష్ట్రానికి సరఫరాచేసి ఎక్కువ డిమాండ్ ఉన్నప్పుడు తిరిగిపొందే విధానాన్ని తెలంగాణ జెన్‌కో రెండేండ్లుగా అవలంబిస్తున్నది.

# టీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గుత్తా

- ప్రకటించిన పార్టీ అధ్యక్షుడు కేసీఆర్
- ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన సుఖేందర్‌రెడ్డి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** శాసనసభ్యుల కోటా శాసనమండలి స్థానానికి జరిగే ఉపఎన్నికలో టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా నల్లగొండ జిల్లాకు చెందిన మాజీ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డిని పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు శనివారం ఖరారుచేశారు. తనను అభ్యర్థిగా ప్రకటించినందుకు ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రిని కలిసి గుత్తా సుఖేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. నామినేషన్ పత్రాల ప్రక్రియ నిర్వహణలో సహకరించాలని ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డిని కేసీఆర్ ఆదేశించారు. ఈ స్థానానికి 2015లో టీఆర్ఎస్ అభ్యర్థి కే యాదవరెడ్డి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆయన కాంగ్రెస్‌లో చేరడంతో పార్టీ ఫిరాయింపుల కింద మండలి చైర్మన్ జనవరిలో అనర్హత వేటువేశారు. ఈ నేపథ్యంలో ఖాళీ అయిన స్థానానికి కేంద్ర ఎన్నికల సంఘం ఉపఎన్నికల షెడ్యూల్‌ను విడుదలచేసింది. ఈ నెల ఏడు నుంచి 14 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 16న నామినేషన్లు పరిశీలించి.. బరిలోఉన్న అభ్యర్థుల తుది జాబితాను 19న ప్రకటించనున్నారు. శాసనసభలోఉన్న బలాబలాలను పరిశీలిస్తే టీఆర్ఎస్ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు. ఈ ఎమ్మెల్సీ పదవీకాలం 2021 జూన్ మూడు వరకు ఉన్నది.

### రైతు సమన్వయ సమితి అధ్యక్ష పదవికి రాజీనామా

రాష్ట్ర రైతు సమన్వయసమితి అధ్యక్ష పదవికి గుత్తా సుఖేందర్‌రెడ్డి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను ఆమోదిస్తూ వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి శనివారం ఉత్తర్వులు జారీచేశారు.

### మూడుసార్లు ఎంపీగా గెలిచిన గుత్తా

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఉపఎన్నికకు టీఆర్ఎస్ అభ్యర్థిగా ఎంపికైన గుత్తా సుఖేందర్‌రెడ్డిది సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం. 1954 ఫిబ్రవరి 2న నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్లలో జన్మించిన ఆయన 1978లో వార్డు మెంబర్‌గా రాజకీయాల్లోకి వచ్చారు. తర్వాత చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్, సింగిల్‌విండో చైర్మన్ పనిచేశారు. 1992 లో నల్లగొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం చైర్మన్‌గా.. 1995 నుంచి 1999 వరకు ఏపీ పాల ఉత్పత్తుల సహకార సంఘం చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. 1995లో దేవరకొండ జెడ్పీటీసీగా.. 1999లో తొలిసారిగా నల్లగొండ ఎంపీగా గెలుపొందారు. 2004లో నల్లగొండ ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడి పోయారు. 2009, 2014 ఎన్నికల్లో నల్లగొండ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2018లో సీఎం కేసీఆర్.. గుత్తా సుఖేందర్‌రెడ్డిని తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయసమితి చైర్మన్‌గా నియమించారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్న ఆయనను తాజాగా ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికచేశారు.

# ఛత్తీస్‌గఢ్ విద్యుత్ సరఫరాలో అంతరాయం

- రాయ్‌పూర్ థర్మల్ కేంద్రంలో సాంకేతిక సమస్యలు
- తెలంగాణ జెన్‌కోకు సమాచారమిచ్చిన ఛత్తీస్‌గఢ్ అధికారులు

- రాష్ట్రంలో జలవిద్యుత్ అందుబాటులోకి రావడంతో ఇబ్బంది లేదు
- ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు వెల్లడి
- డబ్బులు కట్టకపోవడం వల్లనే నిలిపివేత అనేది దుష్ప్రచారమే

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణకు విద్యుత్ సరఫరాలో తాత్కాలిక అంతరాయం ఏర్పడింది. రాయ్‌పూర్‌లోని థర్మల్ విద్యుత్‌కేంద్రంలో తలెత్తిన సాంకేతిక సమస్యల కారణంగా సరఫరాలో అంతరాయం ఏర్పడిందని ఛత్తీస్‌గఢ్ విద్యుత్ అధికారులు తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావుకు సమాచారం ఇచ్చారు. అయితే, కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో తెలంగాణలో ప్రాజెక్టులు నిండుతున్నాయని.. జూరాల తదితర చోట్ల జల విద్యుత్ అందుబాటులోకి వచ్చిందని, సాంకేతిక సమస్యలు తొలిగి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే వరకు తమకెలాంటి ఇబ్బంది లేదని సీఎండీ ప్రభాకర్‌రావు ఛత్తీస్‌గఢ్ అధికారులకు తెలిపారు. జలవిద్యుత్ ఉత్పత్తి అవుతున్న నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్ నుంచి 1000 మెగావాట్ల విద్యుత్ కూడా అవసరం లేదని అన్నారు. గడిచిన కొద్దిరోజులుగా ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ సరఫరా క్రమంగా తగ్గుతున్నది. వాస్తవానికి ఆ రాష్ట్రం నుంచి 1000 మెగావాట్ల విద్యుత్ రావాల్సి ఉండగా.. తరుచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటంతో 500 నుంచి 600 మెగావాట్ల విద్యుత్ మాత్రమే వస్తున్నది. ఈ సమస్యలు శనివారం మరింత ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలోనే రాయ్‌పూర్ థర్మల్ విద్యుత్‌కేంద్రం అధికారులు తెలంగాణ విద్యుత్ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు.

### 24 గంటల విద్యుత్‌కు ఢోకాలేదు

సాంకేతిక కారణాలతో ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేయగా.. తెలంగాణలో 24 గంటల విద్యుత్ ఘనతను ఎలాగైనా దెబ్బతీయాలనే ఉద్దేశంతో కొందరు తెలంగాణ విద్యుత్ సంస్థలు బకాయిలు చెల్లించకపోవడంతోనే విద్యుత్‌ను నిలిపివేశారనే దుష్ప్రచారం మొదలుపెట్టారు. ఇందుకు తాజాగా కేంద్రం నిర్దేశించిన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్సీ) అంశాన్ని తెరపైకి తెచ్చి అనేక ఊహాగానాలను ప్రచారం చేశారు. ఈ దుష్ప్రచారాన్ని తెలంగాణ విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు తీవ్రంగా ఖండించారు. దీనిపై ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ.. బకాయిలు చెల్లించకపోవడంతోనే ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందనడం తెలంగాణ విద్యుత్ వెలుగులంటే గిట్టనివారుచేస్తున్న దుష్ప్రచారంగా కొట్టిపారేశారు. రాయ్‌పూర్ థర్మల్ కేంద్రంలో తలెత్తిన సాంకేతిక సమస్యలను పరిష్కరించడంలో భాగంగా అంతరాయం ఉంటుందని ఛత్తీస్‌గఢ్ విద్యుత్ అధికారులు సమాచారం ఇచ్చారని, దీనికి మనంకూడా అంగీకరించామని ఆయన చెప్పారు. వరుసగా కురుస్తున్న వర్షాలతో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా తగ్గిందని, దీంతో ఉన్న థర్మల్ విద్యుత్‌కేంద్రాల్లో ఉత్పత్తినే తగ్గించుకుంటున్నామని పేర్కొన్నారు. దీనికి తోడు జల విద్యుత్‌కూడా అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. తెలంగాణలో 24 గంటల విద్యుత్‌కు ఎలాంటి ఆటంకం ఉండదని ఆయన స్పష్టంచేశారు.



జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం రాయపట్నం వద్ద నీట మునిగిన పాత వంతెన



ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి



భద్రాచలంలో కరకట్ట వద్ద పుష్కర ఘాట్‌లను ఆనుకొనిఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

# గలగలా గోదారి..

మొదటిపేజీ తరువాయి...

ఉట్టిపడుతున్నాయి. ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో బాసరలో గోదావరి కళకళలాడుతున్నది. కుమ్రంభీం ప్రాజెక్టులో నీటిమట్టం 8.6111 టీఎంసీలకు చేరింది. ప్రాజెక్టులోని ఐదు గేట్లనుంచి 15,400 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని సాత్నాల ప్రాజెక్టు రెండు గేట్లను శనివారం రాత్రి ఎత్తివేసి, సుమారు 15వేల క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నారు. వరుస వర్షాలతో కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మారెడ్డి శివారులో ఉన్న కల్యాణి ప్రాజెక్టు శనివారం ఉదయం ఆరుగంటలకు పూర్తిగా నిండింది. ప్రాజెక్టు నీటిమట్టం 410 మీటర్లు కాగా.. 409.5 మీటర్లకు నీరు చేరుకొన్నది. శ్రీరాంసాగర్‌కు శనివారం రాత్రికి 15,157 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ధర్మపురి వద్ద గోదావరి ఉధృతి బాగా పెరిగింది. జగిత్యాల జిల్లా కమ్మునూరు వద్ద గంగమ్మ పరవళ్లు తొక్కుతున్నది. ధర్మపురి వద్ద పుష్కరఘాట్లను తాకుతూ ప్రవహిస్తున్నది. ములుగు జిల్లా రామన్నగూడెం పుష్కరఘాట్ ప్రాంతాల్లో గోదారమ్మ సముద్రాన్ని తలపిస్తున్నది.





జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అన్నారం బరాజ్‌లోని గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న గోదావరి.. నిర్మల్ జిల్లా కడెం వరదగేట్ల నుంచి దిగువకు వెళ్తున్న వరదనీరు

## మేడిగడ్డలో నిలకడగా ప్రవాహం

ప్రాణహిత ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మేడిగడ్డ బరాజ్‌లో నీటి ప్రవాహం నిలకడగా కొనసాగుతున్నది. ప్రాజెక్టులోని 65 గేట్లను ఎత్తివేసి సుమారు 4.89 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు తరలించారు. మరోవైపు అన్నారం బరాజ్‌లో 14 గేట్ల నుంచి నీటిని దిగువకు వదిలారు. బరాజ్‌లో 7.70 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ యాదగిరి తెలిపారు. కన్నెపల్లి వద్ద ఆరోరోజు కూడా మోటర్లను బంద్‌చేసి ఉంచారు.

## భద్రాది వద్ద రెండో హెచ్చరికకు చేరువలో!

**భద్రాచలం, నమస్తే తెలంగాణ:** భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. శనివారం రాత్రి 7 గంటలకు 46.6 అడుగులు దాటి ప్రవహిస్తున్నది. ఉదయం 5.30 గంటలకు 43 అడుగులకు నీటిమట్టం చేరుకోగానే అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేశారు. 48 అడుగులకు రెండో ప్రమాద హెచ్చరిక, 53 అడుగులకు మూడో ప్రమాద హెచ్చరిక జారీచేస్తారు. చర్ల మండలం తాలిపేరు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరుకోవడంతో 24 గేట్లు ఎత్తి 1,18,700ల క్యూసెక్కులు విడుదలచేశారు. దుమ్ముగూడెం మండలంలో హెడ్‌లాక్‌ల వద్ద గోదావరి 22.6 అడుగులకు చేరుకున్నది. పర్ణశాలలో ఉన్న నారచీరల ప్రదేశం, సీతవాగు పూర్తిగా జలమయమయ్యాయి.

## పోలవరం వద్ద ఉగ్రగోదావరి

ఏపీలోని పోలవరం పరిసర ప్రాంతాల్లో గోదావరి ఉగ్రరూపంలో ప్రవహిస్తుండటంతో ప్రాజెక్టు నిర్మాణపనులు పూర్తిగా ఆగిపోయాయి. స్పిల్‌వే పొడవున మొత్తం 48 గేట్ల నుంచి క్లస్టర్‌స్థాయి దాటి రెండు మీటర్ల ఎత్తున వరదనీరు ప్రవహిస్తున్నది. స్పిల్‌వే వెనుక గోదావరికి అడ్డంగా తాత్కాలికంగా నిర్మించిన కాఫర్‌డ్యామ్ చాలావరకు కొట్టుకుపోయింది.

## ఇక మిడ్‌మానేర్‌కు కాళేశ్వరం జలాలు



నంది మేడారం రిజర్వాయర్ హెడ్ రెగ్యులేటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీదేవసేన, కాళేశ్వరం ప్రాజెక్ట్ ఈఎన్‌సీ వెంకటేశ్వర్లు

ఎల్లంపల్లి ప్రాజెక్టునుంచి మధ్య మానేర్ రిజర్వాయర్‌లోకి (కాళేశ్వరం లింక్-2) నీటిని ఎత్తిపోసేందుకు సిద్ధంగా ఉండాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీదేవసేన అధికారులను ఆదేశించారు. ధర్మారం మండలం నందిమేడారం వద్ద నిర్మించిన రిజర్వాయర్ హెడ్ రెగ్యులేటర్ గేట్లను కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్సీ వెంకటేశ్వర్లుతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లికి నీటిని ఎత్తిపోసే ప్రక్రియ (లింక్-1) విజయవంతం కాగా, ఆరో ప్యాకేజీ ద్వారా ఎల్లంపల్లి నుంచి 7, 8 ప్యాకేజీలకు నీటిని ఎత్తిపోసేందుకు చేపడుతున్న పనుల గురించి ఈఎన్సీని అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 5 తర్వాత ఎప్పుడైనా లింక్-2కు నీరు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. రిజర్వాయర్‌కు అనుసంధానంగా ఉన్న అప్రోచ్ కాల్వ సిద్ధంగా ఉన్నదని, ఏడో ప్యాకేజీ అండర్ టన్నెల్‌లో చిన్నచిన్న పనులు పూర్తికావాల్సి ఉన్నదని ఈఎన్సీ తెలిపారు. సీఎం కేసీఆర్ సూచన మేరకు త్వరలోనే పాత్రికేయులు ప్రాజెక్టు పరిశీలనకు వస్తున్నందున అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శ్రీదేవసేన సూచించారు.

### శనివారం వివిధ ప్రాజెక్టుల్లో నీటిమట్టాల వివరాలు

| రిజర్వాయర్ | ఎఫ్ఆర్ఎల్ అడుగుల్లో | ప్రస్తుత మట్టం అడుగుల్లో | పూర్తిస్థాయి నిల్వ టీఎంసీల్లో | ప్రస్తుత నిల్వ టీఎంసీల్లో | ఇన్‌ఫ్లో క్యూసెక్కుల్లో | అవుట్‌ఫ్లో క్యూసెక్కుల్లో |
|---|---|---|---|---|---|---|
| ఆల్మట్టి | 1705.00 | 1700.43 | 129.72 | 106.05 | 2,39,000 | 2,39,520 |
| నారాయణపుర | 1615.00 | 1609.78 | 37.64 | 30.69 | 2,55,000 | 2,48,790 |
| జూరాల | 1045.00 | 1044.36 | 9.66 | 9.26 | 2,30,000 | 2,31,296 |
| తుంగభద్ర | 1633.00 | 1608.57 | 100.86 | 32.59 | 17,200 | 1,065 |
| శ్రీశైలం | 885.00 | 850.10 | 215.81 | 80.36 | 2,17,893 | 2,400 |
| నాగార్జునసాగర్ | 590.00 | 506.80 | 312.05 | 126.30 | 897 | 897 |
| సింగూరు | 1717.93 | 1670.44 | 29.91 | 0.46 | 252 | 20 |
| నిజాంసాగర్ | 1405.00 | 1368.16 | 17.80 | 0.12 | 150 | 10 |
| శ్రీరాంసాగర్ | 1091.00 | 1049.50 | 90.31 | 5.93 | 2,617 | 232 |
| లోయర్‌మానేరు | 920.00 | 881.50 | 24.07 | 3.43 | 620 | 204 |
| మిడ్‌మానేరు | 1043.31 | 992.95 | 25.873 | 3.41 | 392 | 83 |
| కడెం | 700.00 | 694.45 | 7.60 | 6.23 | 51,864 | 39,809 |
| ఎల్లంపల్లి | 485.56 | 475.95 | 20.18 | 12.80 | 48,861 | - |

## సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటుకు కాళేశ్వరం నీళ్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సుందిల్ల బరాజ్ నుంచి సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటుకు ఏడాదికి ఒక్క టీఎంసీని కేటాయిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా పారిశ్రామిక అవసరాలకు 16 టీఎంసీల నీటిని కేటాయించిన విషయం తెలిసిందే. ఇందులోభాగంగా తొలి కేటాయింపునకు ప్రభుత్వం అనుమతిచ్చింది. మంచిర్యాల జిల్లాలోని జైపూర్ దగ్గర సింగరేణికి చెందిన 1200 మెగావాట్ల (2x600) పవర్‌ప్లాంటు ఉన్నది. మంచిర్యాల జిల్లాలోని షెట్‌పల్లి, ఆదిలాబాద్ జిల్లా జైపూర్ మండలం దేవలవాడ గ్రామ పరిధిలోని గోదావరి నుంచి ప్లాంటుకు నీటిని తీసుకుంటున్నారు. షెట్‌పల్లి సుందిల్ల బరాజ్ ముంపు పరిధిలోకి వస్తున్నందున ఈ బరాజ్ నుంచి ఏడాదికి ఒక్క టీఎంసీని ప్లాంటుకు తీసుకునేందుకుగాను ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

# బిరబిరా కృష్ణమ్మ



జోగుళాంబ గద్వాల జిల్లాలో జూరాల గేట్లు ఎత్తడంతో దిగువకు పరుగులు పెడుతున్న కృష్ణా జలాలు

- శ్రీశైలంలోకి 24 గంటల్లోనే 18.29 టీఎంసీలు
- ప్రస్తుత నిల్వ 80.36 టీఎంసీలు
- జూరాలలో నిరంతరంగా విద్యుదుత్పత్తి

**హైదరాబాద్/మహబూబ్‌నగర్, నమస్తే తెలంగాణ:** కృష్ణాబేసిన్‌లో వరద ఉధృతి అదే ఒరవడిలో కొనసాగుతున్నది. ఆల్మట్టికి ఇన్‌ఫ్లో మరింతగా పెరుగటంతో కృష్ణా జలాలు దిగువకు పరుగులు పెడుతున్నాయి. నారాయణపుర మొదలు శ్రీశైలం దాకా సగటున 2.30 లక్షల క్యూసెక్కుల వరద పోటెత్తింది. దీంతో శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం వేగంగా పెరుగుతున్నది. శనివారం సాయంత్రం ఐదు గంటల సమయానికి శ్రీశైలం జలాశయంలో 77 టీఎంసీల నీటి నిల్వ ఉండగా.. గడచిన 24 గంటల్లోనే ఏకంగా 18.29 టీఎంసీలు వచ్చాయి.

## ఆల్మట్టికి భారీగా వరద

ఎగువన విస్తారంగా కురుస్తున్న వర్షాలతో ఆల్మట్టికి భారీ వరద వస్తున్నది. శనివారం ఉదయం సుమారు 2.20 లక్షల క్యూసెక్కులుగా ఉన్న వరద సాయంత్రానికి 2.39 లక్షలకు పెరిగింది. దీంతో అదేస్థాయిలో నీటిని దిగువకు వదులుతున్నారు. నారాయణపురకు కూడా 2.55 లక్షల క్యూసెక్కుల వరద వస్తున్నది. దాదాపు ఏడువేల క్యూసెక్కులను కాల్వలకు వదిలిన అధికారులు సుమారు 2.48 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో జూరాల జలాశయంలో జలసవ్వడి ఇంకింతగా పెరిగిపోయింది. జూరాలకు శనివారం సాయంత్రం ఐదు గంటల సమయానికి 2.30 లక్ష వరద వస్తుండటంలో కరంటు ఉత్పత్తి ద్వారా సుమారు 31 వేల క్యూసెక్కులు, స్పిల్‌వే ద్వారా 1.93 లక్షల క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. జూరాల జలవిద్యుత్ కేంద్రంలో గత 24 గంటల్లో 5 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేసినట్లు జెన్‌కో హైడల్ ప్రాజెక్టుల సీఈ సురేశ్ తెలిపారు. వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో మొత్తం యూనిట్లను వినియోగించలేకపోతున్నట్లు తెలిపారు.

## మరో 320 టీఎంసీలతో నిండనున్న శ్రీశైలం, సాగర్

ప్రస్తుత పరిస్థితులను పరిగణనలోకి తీసుకొంటే.. కృష్ణాబేసిన్‌లో జీవనాధారమైన శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలు పూర్తిస్థాయిలో నిండటానికి మరో 320 టీఎంసీలు రావాల్సి ఉన్నది. శనివారం సాయంత్రానికి శ్రీశైలం జలాశయంలో 2.17 లక్షల క్యూసెక్కుల వరద నమోదైంది. కేవలం జూరాల మినహా తుంగభద్ర నుంచిగానీ ఉజ్జయిని నుంచిగానీ శ్రీశైలానికి వరద రావడం లేదు. అయినప్పటికీ రెండు లక్షల క్యూసెక్కులకు పైగా వరద వస్తుండటంతో రోజుకు 18-19 టీఎంసీల నీళ్లు వచ్చి చేరుతున్నాయి. శుక్రవారం సాయంత్రానికి జలాశయంలో నీటి నిల్వ 58.71 టీఎంసీలు ఉండగా.. శనివారం ఉదయం ఆరు గంటల సమయానికి 67.98 టీఎంసీలకు చేరుకొన్నది. సాయంత్రం ఐదు గంటల సమయానికి 848.60 అడుగుల నీటిమట్టంతో 77 టీఎంసీల నీటినిల్వకు చేరుకుంది. గడిచిన 24 గంటల్లో 18.29 టీఎంసీల వరద వచ్చినట్లయింది. శ్రీశైలం నుంచి కల్వకుర్తి లిఫ్టు ద్వారా 2,400 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఇదే ఒరవడి మరో 15 రోజులకు పైగా కొనసాగితే రెండు జలాశయాలు నిండుకుండల్లా మారనున్నాయి.

**సిండికేట్ బ్యాంక్ వేలం అమ్మకం**
**SARFAESI చట్టం క్రింద**
పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం, గునుపూడి SRO, గొల్లల కోడేరు గ్రామ పంచాయతీలోగల ఎకరాలు 5.10 సెంట్ల కన్వర్టెడ్ భూమి.
http://syndicatebank.auctiontiger.net దర్శించండి.
వేలం ID నెం: 170940, 170937, 170939.
అక్షాంశం: N16.573883. రేఖాంశం: E81.524458.

**సిండికేట్ బ్యాంక్ వేలం అమ్మకం**
**SARFAESI చట్టం క్రింద**
ప్రకాశం జిల్లా, మద్దిపాడు, గ్రోత్ సెంటర్ గుండ్లపల్లి వద్దగల మెషినరీతో రా & బాయిల్ రైస్ మిల్ భూమి, భవనం.
http://syndicatebank.auctiontiger.net దర్శించండి.
వేలం ID నెం: 168187/88/89.
అక్షాంశం: N15.605107. రేఖాంశం: E79.889462.

**సిండికేట్ బ్యాంక్ వేలం అమ్మకం**
**SARFAESI చట్టం క్రింద**
**08 ఆగస్టు, 2019 (08-08-2019)**న నెల్లూరు, కృష్ణపట్నం రోడ్‌లోగల **M/s. సస్టెయినబుల్ ప్రోటీన్ ఫుడ్స్ (న్యూ ఆంధ్రా రైస్ మిల్)**కు చెందిన 170.75 అంకణాలలోని పాత మెషినరీ & ఎక్విప్‌మెంట్‌తో రైస్ మిల్.
http://syndicatebank.auctiontiger.net దర్శించండి.
వేలం ID నెం: 167999.

**సిండికేట్ బ్యాంక్ వేలం అమ్మకం**
**SARFAESI చట్టం క్రింద**
**08 ఆగస్టు, 2019 (08-08-2019)**న నెల్లూరు జిల్లా, కొవ్వూరు మండలంలోగల **M/s. శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి రా & బాయిల్డ్ రైస్ మిల్** పేరునగల పాత మెషినరీ & ఎక్విప్‌మెంట్‌తో రైస్ మిల్ మరియు ఇతర ఆస్తులు (ఒక నివాస భవనం, రెండు ఖాళీ నివాస ప్లాట్లు).
http://syndicatebank.auctiontiger.net దర్శించండి.
వేలం ID నెం: 167848, 849, 850, 851, 852.

**సిండికేట్ బ్యాంక్ వేలం అమ్మకం**
**SARFAESI చట్టం క్రింద**
కాకినాడలోగల స్టార్ హోటల్ G+5 ఫ్లోర్స్, అటాచ్డ్ స్విమ్మింగ్ పూల్ మరియు ఫర్నిచర్స్ & ఫిక్చర్స్‌తో 3636 చ.గజాలు.
http://syndicatebank.auctiontiger.net దర్శించండి.
వేలం ID నెం: 166427.
అక్షాంశం: N16.972375. రేఖాంశం: E82.236944.

# దేవునిగూడెం.. పచ్చనిహారం

- 583 ఎకరాల్లో లక్ష మొక్కలతో ప్లాంటేషన్
- నాలుగేండ్లలో ఏపుగా పెరిగి.. వనంగా మారిన పల్లె



నిర్మల్ జిల్లా దేవునిగూడెంలో పెరుగుతున్న వివిధ రకాల మొక్కలు

**కడెం:** తెలంగాణకు హరితహారం కార్యక్రమంతో దేవునిగూడెం పచ్చనిహారంగా మారింది. నాలుగేండ్ల కిందట నాటిన లక్ష మొక్కలు నేడు ఏపుగా పెరిగి ఆ ప్రాంతమంతా వనంగా తయారైంది. 583 ఎకరాల్లో పచ్చనికళ సంతరించుకున్నది. తెలంగాణకు హరితహారం మొదటివిడుతలో నిర్మల్ జిల్లా కడెం (ప్రస్తుత దస్తురాబాద్) మండలం దేవునిగూడెం గ్రామ సమీపంలోని సర్వేనంబర్ 320లో ఉన్న 583 ఎకరాల అటవీప్రాంతంలో లక్ష మొక్కలు నాటేందుకు అటవీశాఖ అధికారులు శ్రీకారం చుట్టారు. 2015 జూలై 5న సీఎం కేసీఆర్ దేవునిగూడెం వచ్చి స్వయంగా మొక్కనాటి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాడు నాటిన మొక్కలు నేడు వనంగా మారాయి. దేవునిగూడెం సమీపంలో అప్పట్లో స్థానికులు పెద్దసంఖ్యలో చెట్లను నరికివేయగా, నరికినచోటే అటవీశాఖ అధికారులు చేపట్టిన చర్యల కారణంగా మళ్లీ పచ్చదనం వెల్లివిరుస్తున్నది.

## 21 రకాల మొక్కలు..

దేవునిగూడెంలో 21 రకాల మొక్కలు లక్షకుపైగా నాటారు. పండ్ల మొక్కలు అల్లనేరేడు, ఇప్ప, మామిడి, సీతాఫలం, ఉసిరి, వెలగ, బుడ్డదరమి, తాని, అటవీజాతి మొక్కలు.. నారేపి, వెదురు, వేప, జిట్రేగి, నెమలినార, రావి, మర్రి, ఏగిస, చిందుగ, తెల్లచిందుగతోపాటు కందకాల పటిష్ఠత కోసం నీలగిరి, గచ్చకాయ, నల్లతుమ్మ వంటి అనేక రకాల మొక్కలు నాటారు.

## కందకాలు తవ్వించి.. ప్రతి చుక్కనూ ఒడిసిపట్టి

దేవునిగూడెంలో మొక్కల సంరక్షణపై అటవీశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రతి మొక్క బతికేలా చర్యలు చేపట్టారు. ప్లాంటేషన్‌లో పెంచుతున్న మొక్కల జోలికి జంతువులు రాకుండా చుట్టూ కందకాలను తవ్వించారు. మొక్కల పరిశీలనకు అనువుగా వాచ్‌టవర్‌ను నిర్మించారు. మొక్కలకు పూర్తిస్థాయిలో నీటిని అందించే ఏర్పాట్లు సైతం చేశారు. వర్షాలు పడ్డప్పుడు వచ్చిన నీరు ఇంకుడుగుంతల్లోకి చేరి మొక్కలకు ఉపయోగపడేలా ఏర్పాట్లుచేశారు. మొదటివిడుతలో భాగంగా వర్షాలు సరిగ్గా కురవని కారణంగా మొక్కలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడింది. అయినప్పటికీ ట్యాంకర్ల ద్వారా దూరప్రాంతాల నుంచి నీటిని తెచ్చి మొక్కలకు పోస్తూ సంరక్షించారు. మొక్కల సంరక్షణకు అప్పటి ఎఫ్‌బీవో కృషి ప్రసంశనీయంగా చెప్పవచ్చు. దేవునిగూడెంలో 2015లో నాటిన మొక్కలు ప్రస్తుతం ఏపుగా పెరిగాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ నాటిన మొక్కతో సహా అన్నిరకాల మొక్కలు దాదాపు అదేస్థాయిలో కనిపిస్తున్నాయి. నీలగిరి మొక్కలు మరింత ఎత్తు పెరిగాయి. మొక్కలు పెరిగి అటవీప్రాంతాన్ని తలపిస్తున్నాయి. సిబ్బంది కృషితోనే ప్లాంటేషన్‌లో హరితహారం విజయవంతమైందని నిర్మల్ డీఎఫ్‌వో ప్రసాద్ తెలిపారు.



నిర్మల్ జిల్లా కడెం (ప్రస్తుతం దస్తురాబాద్ మండలం) మండలం దేవునిగూడెంలో 2015 జూలై 5న మొక్క నాటుతున్న సీఎం కేసీఆర్



సీఎం కేసీఆర్ నాటిన మొక్క ప్రస్తుతం ఏపుగా ఇలా..




# ఏపుగా ఎదిగిన సీఎం నాటిన మొక్క

**కడెం/మామడ:** 'వానలు వాపస్ రావాలి.. కోతులు వాపస్ పోవాలి' అని సీఎం కేసీఆర్ చెప్పిన మాట అక్షరాలా వాస్తవరూపం దాల్చుతున్నది. 2015లో సీఎం కేసీఆర్ తెలంగాణకు హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టి.. అందులోభాగంగా అదేఏడాది జూలై 5వ తేదీన నిర్మల్ జిల్లా కడెం (ప్రస్తుత దస్తురాబాద్) మండలంలోని దేవునిగూడెం గ్రామ సమీపంలోని అటవీప్రాంతంలో మొక్క నాటారు. మొక్కను రక్షించేందుకు అధికారులు ట్రీగార్డును ఏర్పాటుచేశారు. రోజూ మొక్కకు నీళ్లు పోయడంతో ప్రస్తుతం అది ఏపుగా పెరిగి వృక్షంగా మారింది.

**సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజినీరింగ్ & టెక్నాలజీ (సిపెట్)**
సిపెట్ : సెంటర్ ఫర్ స్కిల్లింగ్ & టెక్నికల్ సపోర్ట్ (సి యస్ టి యస్)
**నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ మరియు ఉపాధి కార్యక్రమములు**
CIPET లో ప్లాస్టిక్స్ వస్తువులు తయారీ చేయుటకు సంబంధించిన మెషిన్ ఆపరేటర్ అసిస్టెంట్ / మెషిన్ ఆపరేటర్ / మెషిన్ ఆపరేటర్ (టూల్ రూమ్) కోర్సులలో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానించుచున్నది. శిక్షణ అనంతరం ఉద్యోగఅవకాశములు కల్పించబడును.
కోర్సు వ్యవధి : 3 నెలలు / 6 నెలలు అర్హత : 8వ తరగతి / SSC పాస్ / ఐటిఐ
వయసు: 18 నుంచి 30 సం॥ లు (యస్సి/యస్టి/బీసీ అభ్యర్థులకు వయసు సడలింపు కలదు)
శిక్షణ, వసతి మరియు భోజనం: పూర్తిగా ఉచితము
పూర్తి వివరములకు సంప్రదించగలరు:
శ్రీ లంజ నాయక్: 7893586494 | శ్రీ డి వి సాయి సురేంద్ర: 9959333418 | శ్రీ ఏ. విజయ్ కుమార్: 9849 599 133

**PROF. G.RAM REDDY CENTRE FOR DISTANCE EDUCATION**
(Recognized by the Distance Education Bureau, UGC, New Delhi)
OSMANIA UNIVERSITY, Hyderabad-500007, Telangana State, INDIA
(A University with Potential for Excellence and Re-accredited by NAAC with A+ grade)
**ADMISSION NOTIFICATION FOR THE ACADEMIC YEAR 2019-20 COURSES OFFERED**

| Course | Years | Eligibility |
|---|---|---|
| M.B.A. | 2 yrs | Graduate with qualifying in TS ICET / AP ICET-2019 or ET conducted by PGRRCDE, OU |
| M.C.A. | 3 yrs | Any Graduate with qualifying in TS ICET / AP ICET-2019 or ET conducted by PGRRCDE, OU |
| M.A. (Urdu / Hindi / Telugu / Sanskrit / English) | 2 yrs | A Graduate in the concerned subject |
| M.A. (Philosophy/Sociology/ Public Personal Mgt) | 2 yrs | Graduate of any faculty |
| M.A. (Economics/Pol.Science/History/Psychology) | 2 yrs | A Graduate in the concerned subject at U.G. level |
| M.Com | 2 yrs | Pass in B.Com |
| M.Sc. (Mathematics) | 2 yrs | A Graduate in the concerned subject |
| M.Sc. (Statistics) | 2 yrs | Graduate with Mathematics and Statistics |
| B.A. | 3 yrs | Inter or 10+2 level exam Pass |
| B.A. (Mathematics & Statistics) | 3 yrs | Inter or 10+2 with Mathematics as one of the optional subject |
| B.Com (General) | 3 yrs | Inter or 10+2 level exam Pass |
| B.B.A. | 3 yrs | Inter or 10+2 level exam Pass |
| P.G. Diploma in Mathematics | 1 yr | Graduate of any faculty, (3 YDC) |
| P.G. Diploma in English Language Teaching | 1 yr | Graduate of any faculty, (3 YDC) |
| P.G. Diploma in Business Management | 1 yr | Graduate of any faculty, (3 YDC) |
| P.G. Diploma in Bioinformatics | 1 yr | B.Sc/ M.Sc/ B.Sc (Ag)/ B.Pharmacy/ BVSc/ MBBS/ BDS/ BAMS/ BUMS/ BHMS/ BE with 50% of marks |
| P.G. Diploma in Computer Applications (Two Semesters) | 1 yr | Graduate of any faculty |

For On-line registration and admission details visit website: www.oucde.net
Admissions start from: 18th July, 2019.
Last date for Admission without Late fee is: 30th September, 2019.
Sd/- DIRECTOR


ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండలోని కడెం వాగులో చిక్కుకున్న కాపరిని కాపాడిన ఎస్సై


నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం గొట్టిముక్కల వద్ద వాగులో పారుతున్న వరద


యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లిలోని పిలాయిపల్లి కాల్వకు పడిన గండి


జలకళ సంతరించుకున్న కరీంనగర్ జిల్లా మానకొండూర్ పెద్దచెరువు

# ఆదిలాబాద్‌లో జోరు వాన

## పలుచోట్ల ఉప్పొంగిన వాగులు

- జలదిగ్బంధంలో మూగజీవాలు, బయటపడ్డ కాపరి
- బంగారుగూడ బడిలోనే రాత్రి వరకు నిరీక్షించిన విద్యార్థులు
- వికారాబాద్, నిర్మల్, కామారెడ్డి జిల్లాల్లో ఓ మోస్తరు..
- అత్యధికంగా ఇచ్చోడలో 13.02 సెం.మీ. వర్షపాతం నమోదు
- రాష్ట్రంలో మరో రెండురోజులు వర్షాలు


ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలో ఉప్పొంగి ప్రవహిస్తున్న ముక్రా(కే) వాగు

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ/నెట్‌వర్క్:** ఆదిలాబాద్ జిల్లాలో శనివారం భారీ వర్షం కురవగా, వికారాబాద్, నిర్మల్, కామారెడ్డి జిల్లాల్లో ఓ మోస్తరు, మెదక్, సంగారెడ్డి, నల్లగొండ, జనగామ, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో జల్లులు పడ్డాయి. గ్రేటర్ హైదరాబాద్‌లో ఉదయం నుంచి తుంపర పడగా, రాత్రి పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసింది. భారీ వర్షానికి తోడు ఎగువ నుంచి వరద రావడంతో ఆదిలాబాద్ జిల్లాలోని కడెం వాగులో మేకల కాపరి చిక్కుకోగా అధికారులు సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. కాగా దాదాపు వంద మూగజీవాలు జలదిగ్బంధంలోనే ఉండిపోయాయి. బంగారువాగు పొంగిపొర్లడంతో దాదాపు 400 మంది విద్యార్థులు బడిలోనే ఉండాల్సి వచ్చింది. కలెక్టర్ చొరవతో రాత్రి 10గంటలకు క్షేమంగా ఇండ్లకు చేరుకున్నారు. అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలో 13.02సెం.మీ. వర్షపాతం నమోదైంది. ప్రస్తుతం కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనానికి తోడుగా సోమవారం ఉదయం కల్లా అల్పపీడనం తోడు కానున్నదని, ఫలితంగా మరో రెండురోజుల వరకు రాష్ట్రంలో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు, మరికొన్నిచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

**ఆదిలాబాద్ జిల్లాలో..**

ఆదిలాబాద్ జిల్లాలో కురిసిన భారీ వర్షానికి తోడు ఎగువ నుంచి వచ్చిన వరదతో బంగారుగూడ, అనుకుంట వాగులు పొంగిపొర్లాయి. తలమడుగు మండల కేంద్రానికి వెళ్లే వాగు లోలెవల్ వంతెనపైనుంచి నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఆదిలాబాద్-కరంజి(టి) రూట్‌లో సెంటర్ సాంగ్వి వద్ద వాగు ప్రవాహంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. సరిహద్దు గుబ్‌డి, కొజ్జన్‌గూడ, టేకిడిరాంపూర్ వాసులు అటు పెన్‌గంగ ప్రవాహం, ఇటు వాగుల ప్రవాహంతో బయటికి రాలేకపోయారు. ఉట్నూర్, నార్నూర్, ఇంద్రవెల్లి, గుడిహత్నూర్, బజార్‌హత్నూర్, సిరికొండ, నేరడిగొండ, ఇచ్చోడ, బోథ్ మండలాల్లోని పలు గ్రామాలకు సమీప వాగులకు వరదలతో ఆయా గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆదిలాబాద్ పట్టణానికి సమీపంలోని వాగు పొంగడంతో సుందరయ్యనగర్, గాంధీనగర్ కాలనీల్లో కొన్ని ఇండ్లల్లోకి వరదనీరు చేరింది. మత్తడివాగు ప్రాజెక్టు, సాత్నాల ప్రాజెక్టులో భారీగా వరదనీరు వచ్చి చేరుతున్నది.

**రాత్రి వరకు బడిలోనే 400 మంది విద్యార్థులు..**

బంగారువాగు పొంగిపొర్లడంతో ఆదిలాబాద్ రూరల్ మండలంలోని బంగారుగూడ ఆదర్శ పాఠశాలకు చెందిన 400 మంది విద్యార్థులు శనివారం రాత్రి 10 గంటల వరకు బడిలోనే ఉండిపోయారు. కలెక్టర్ దివ్య దేవరాజన్ చొరవతో ఎంఈవో రవీందర్‌రెడ్డి ఆర్టీసీ అధికారులతో మాట్లాడి నాలుగు ప్రత్యేక బస్సులను సమకూర్చి జైనథ్, బేల మీదుగా ఆ విద్యార్థులను ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి తరలించారు. నేరడిగొండ మండలంలోని కడెం వాగులో సేవాలాల్ అనే మేకల కాపరి చిక్కుకున్నాడు. వెంకటాపూర్‌కు చెందిన సేవాలాల్ మేకలతో కడెం పరీవాహక ప్రాంతంలోకి వెళ్లాడు. ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షంతో సాయంత్రం ఒక్కసారిగా వాగులో వరద ఉధృతి పెరిగింది. దీంతో పశువుల కాపరి సేవాలాల్‌తోపాటు మేకలు అక్కడే చిక్కుకున్నాయి. గ్రామస్థులు నేరడిగొండ ఎస్సైకి సమాచారమివ్వగా ఆయన సిబ్బందితో అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గ్రామస్థులు, కుంటాల జాలర్ల సాయంతో సేవాలాల్‌ను రక్షించారు. దాదాపు వంద మేకలు వాగు మధ్యలోనే చిక్కుకున్నాయి. కాగా జిల్లావ్యాప్తంగా శనివారం 52.1 మి.మీ. వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ఇచ్చోడలో 130.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. భారీ వర్షానికి విద్యార్థులు ఇక్కట్లు పడుతుండటంతో శనివారం ఇచ్చోడ మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవు ప్రకటించారు. కాగా బజార్‌హత్నూర్‌లో 125.2 మి.మీ., బోథ్‌లో 102.4 మి.మీ., నేరడిగొండలో 73.2 మి.మీ., ఉట్నూర్‌లో 62.2 మి.మీ., నార్నూర్‌లో 36.4 మి.మీ. ఇంద్రవెల్లిలో 31.6 మి.మీ., గుడిహత్నూర్‌లో 27.0మి.మీ., బేలలో 19.3 మి.మీ., తాంసిలో 19.2 మి.మీ., తలమడుగులో 19.2 మి.మీ, ఆదిలాబాద్ రూరల్‌లో 17.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

**నిర్మల్ జిల్లాలో..**

నిర్మల్ జిల్లాలో శనివారం 41.8 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. నిర్మల్ జిల్లా భైంసా పల్సికర్ రంగారావు ప్రాజెక్టు నీరు నిండటంతో గుండెగాం వంతెనపై నుంచి నీరు పారడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో భైంసా నుంచి మహాగాం, పార్డి తదితర గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఖానాపూర్ మండలం రాజురా-సింగాపూర్ రోడ్డుపై శుక్రవారం రాత్రి కురిసిన గాలివానకు చెట్లు రోడ్డుపై పడ్డాయి. వికారాబాద్ జిల్లాలో శనివారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. కోట్‌పల్లి మండలం మోత్కుపల్లి, నాసన్‌పల్లి సమీపంలో గల చెరువుల్లో నీరు చేరింది. సంగారెడ్డి జిల్లాలో 50.3 మి. మీ., ఖమ్మం జిల్లాలో 30.5 మి.మీ., కామారెడ్డిలో 60.8 మి. మీటర్ల వర్షపాతం నమోదైంది. నల్లగొండ జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకు జల్లులు కురుస్తూనే ఉన్నాయి. మెదక్ జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. జనగామ జిల్లాలో శనివారం చిరు జల్లులు కురిశాయి. జిల్లా వ్యాప్తంగా శనివారం ఉదయం వరకు 46.7 మిల్లీమీటర్ల వర్షం కురవగా, రఘునాథపల్లి మండలంలో అత్యధికంగా 60.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా శనివారం ముసురు నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. ఇండ్లనుంచి ప్రజలు బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు.

**పలు జిల్లాల్లో కూలిన ఇండ్లు**

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణం కావేరమ్మపేటలో ఓ ఇల్లు నేలమట్టమైంది. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం చేగుంటలో ఓ ఇంటిపైకప్పు, ఇదే మండలం ఇప్పలపల్లిలో ఈదురు గాలులకు పశువుల షెడ్డు కూలిపోయాయి. కొల్లాపూర్‌లో ఇల్లు కూలిపోయింది. మెదక్ జిల్లా అల్లాదుర్గంలో ఓ ఇల్లు కూలగా, తూప్రాన్ మండలం కిష్టాపూర్‌లో రెండు ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. శుక్రవారం రాత్రి మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లో ఓ ఇల్లు కూలింది. ఎగువ నుంచి వస్తున్న వరదతో మంచిర్యాల జిల్లాలో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తున్నది

**సింగరేణి ఓసీల్లో నిలిచిన బొగ్గు ఉత్పత్తి**

మంచిర్యాల జిల్లాలోని ఆర్కేపీ ఓసీ, కేకే ఓసీల్లో తేలికపాటి వర్షం ఉన్నప్పటికీ రెండు రోజుల నుంచి కురిసిన వానతో బురద, నీళ్లు నిండిపోయి ఉత్పత్తికి అంతరాయం కలిగింది. కేకే ఓసీలో 5 వేల టన్నులు, ఆర్కేపీ ఓసీలో 5వేల టన్నుల ఉత్పత్తి నిలిచిపోయింది. ఇక శ్రీ రాంపూర్‌లో యథావిధిగా ఉత్పత్తి కొనసాగింది.

### ఉధృతంగా ముక్రా(కే) వాగు..

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని ముక్రా(కే) వాగు ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షంతో మండలంలోని గుండాల, సిరిచెల్మ, గేర్జం, అడెగామ (కే), ఎల్లమ్మకుంట చెరువులు పూర్తిగా నిండిపోయి జలకళను సంతరించుకున్నాయి. ఎగువన కురిసిన వర్షానికి కోకస్‌మన్నూర్‌లోని పెద్ద గుండం జలపాతం పరవళ్లు తొక్కింది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఎడతెరిపిలేని వర్షాలతో వాగులు ఉప్పొంగుతున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలోని భూదాన్‌పోచంపల్లి మండల పరిధిలోని పిలాయిపల్లి కాల్వలో ప్రవహిస్తున్న వర్షం నీరు ఉధృతికి పోచంపల్లి నుంచి కొత్తగూడెం మధ్యలో కాల్వకు గండిపడింది.


ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం త్రివేణి సంగం ప్రాజెక్టు మత్తడి వద్ద చేపలు పడుతున్న స్థానికులు


నిర్మల్ జిల్లా భైంసా - మహగాం రోడ్డుపై నిలిచిన వరదనీరు


ఖమ్మం రూరల్ మండలంలో ఉధృతంగా పారుతున్నమున్నేరు వాగు

## రాగల 48 గంటల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం..

వాయవ్య బంగాళాఖాతం దానిని ఆనుకొని ఉన్న ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాల్లో సముద్రమట్టానికి 7.5 కిలోమీటర్ల ఎత్తున ఏర్పడిన ఉపరితల ఆవర్తనం స్థిరంగా కొనసాగుతున్నది. రాగల 48 గంటల్లో ఈశాన్య బంగాళాఖాతం దాని పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనానికి తోడుగా సోమవారం ఉదయం కల్లా అల్పపీడనం తోడు కానున్నది. మరో రెండు రోజుల వరకు రాష్ట్రంలో కొన్ని చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు, మరికొన్నిచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు చెప్పారు.

## గ్రేటర్ హైదరాబాద్‌కు వర్షసూచన

**హైదరాబాద్‌సిటీబ్యూరో-నమస్తే తెలంగాణ:** గ్రేటర్ హైదరాబాద్‌లో రాగల రెండు రోజులు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురువనున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రాగల 48 గంటల్లో గ్రేటర్ హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నదన్నారు. శుక్రవారం ఉదయం 8.30 నుంచి శనివారం ఉదయం 8.30 వరకు గ్రేటర్ పరిధిలోని మేడ్చల్ జిల్లా దుండిగల్‌లో అత్యధికంగా 15 సెం.మీ., నగరంలో 5 సె.మీ., రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో 3.6 సెం.మీటర్ల చొప్పున వర్షపాతం నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. శనివారం మధ్యాహ్నం కాసేపు ఆగిన వాన సాయంత్రం నుంచి ముసురుగా మారింది. శనివారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు శేరిలింగంపల్లి, హాఫీజ్‌పేటలో అత్యధికంగా 2.3సెం.మీ. వర్షపాతం నమోదైనట్టు అధికారులు వెల్లడించారు.


మంచిర్యాల జిల్లా జన్నారం మండలం దేవునిగూడలో శనివారం కూలీలతో కలిసి ఎమ్మెల్యే రేఖానాయక్ నాటువేశారు. పర్యటనలో భాగంగా కవ్వాల్ గ్రామానికి వెళ్తూ మార్గమధ్యంలో పొలంలో నాటు వేస్తున్న కూలీలను చూసి వాహనందిగారు. వారితో మాట కలిపి, పొలంలోకి దిగి నాటు వేశారు. - జన్నారం(మంచిర్యాల జిల్లా)


మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం గంగిపెల్లిలో మంచిర్యాల కలెక్టర్ భారతిహోళికేరి, ఆమె భర్త శంకర్, కూతురు ఆద్యతో కలిసి శనివారం వరి నాట్లు వేశారు. అంతకుముందు సుందిల్ల బరాజ్ సందర్శించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం శివ్వారంలోని ఎల్ మడుగుకు వెళ్లి సరదాగా గడిపారు. - జైపూర్


ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం రంగాపురంలో జిల్లా కలెక్టర్ చింతకుంట నారాయణరెడ్డి మహిళా కూలీలతో కలిసి వరి నాట్లు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను రైతు బిడ్డనేనని.. రైతు కుటుంబం నుంచే ఐఏఎస్ అయ్యాయని చెప్పారు. కలెక్టర్ వెంట డీఆర్‌డీఏ పీడీ వసంతరావు, ఎంపీపీ సూడి శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో బొబ్బ ప్రభాకర్‌రెడ్డితో పాటు పలువురు ఉన్నారు. - గోవిందరావుపేట(ములుగు)

## టూరిజం ఐకాన్‌గా రంగనాయకసాగర్


రంగనాయకసాగర్ వద్ద పర్యాటక శాఖ ఎండీకి సూచనలు చేస్తున్న హరీశ్‌రావు

- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

**సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** సీఎం కేసీఆర్ విజన్‌కు అనుగుణంగా రంగనాయక సాగర్‌ను టూరిజం ఐకాన్‌గా తీర్చిదిద్దాలని పర్యాటకశాఖ ఎండీ మనోహర్‌కు సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలో నిర్మిస్తున్న రంగనాయకసాగర్ రిజర్వాయర్‌ను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ చింతమడక పర్యటనలో సీఎం కేసీఆర్ రూ.5 కోట్లు మంజూరు చేశారన్నారు. రంగనాయకసాగర్ సుందరీకరణకు ప్రణాళికలు సిద్ధం చేసి కలెక్టర్‌కు ప్రతిపాదించి అనుమతులు తీసుకోవాలని టూరిజం అధికారులకు సూచించారు. అనంతరం సిద్దిపేటలో కాల్వల భూసేకరణపై అధికారులతో సమీక్షించారు.

## రైలు ప్రమాదంలో సీఆర్పీఎఫ్ జవాన్ మృతి


దేవేంద్రాచారి (ఫైల్)

**మిర్యాలగూడ టౌన్:** నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన సీఆర్పీఎఫ్ జవాన్ దేవేంద్రాచారి (38) విధి నిర్వహణలోభాగంగా రైలు నుంచి జారిపడి మృతి చెందారు. కొప్పోజు వెంకటాచారి, సైదమ్మల కుమారుడు దేవేంద్రాచారి 13 ఏండ్ల క్రితం సీఆర్‌పీఎఫ్‌లో చేరారు. ప్రస్తుతం జార్ఖండ్‌లో విధుల్లో ఉన్న ఆయన తన బెటాలియన్ బృందంతో కలిసి వేరే ప్రాంతానికి వెళ్తుండగా శుక్రవారం సాయంత్రం ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి ప్రాణాలు వదిలారు.


స్వచ్ఛ వనపర్తి-హరిత వనపర్తి పోస్టర్‌ను విడుదల చేస్తున్న మంత్రి నిరంజన్ రెడ్డి, కలెక్టర్

## ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిద్దాం

- మంత్రి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి, నమస్తే తెలంగాణ:** ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని మంత్రి నిరంజన్‌రెడ్డి సూచించారు. వనపర్తిలో 'స్వచ్ఛ వనపర్తి-హరిత వనపర్తి' కార్యక్రమాన్ని కలెక్టర్ శ్వేతా మొహంతితో ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిల్లాను స్వచ్ఛ వనపర్తిగా తీర్చిదిద్దే బాధ్యత చాలా పెద్దదని ఇందుకు అందరూ కృషి చేయాలని కోరారు. ప్లాస్టిక్ బదులు పేపర్, బట్ట బ్యాగులు వాడాలని, ఇందుకు పాఠశాల విద్యార్థులు, మహిళా సంఘాల ఇది వరకే బ్యాగులను తయారు చేస్తున్నాయని, వీటిని వినియోగించాలని సూచించారు. ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో భాగంగా సీఎస్‌ఆర్ ఫౌండేషన్ తరపున తన వంతుగా ఆర్థిక సాయం అందిస్తానని ప్రకటించారు.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- ఏడుగురు మావోయిస్టులు మృతి
- మృతుల్లో ఐదుగురు మహిళలు


ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టులు

**కొత్తగూడెం క్రైం:** ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. శనివారం పోలీసులు, మావోయిస్టులకు జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మరణించారు. మృతుల్లో ఐదుగురు మహిళలు ఉన్నారు. ఓ జవాన్‌కు గాయాలయ్యాయి. రాజ్‌నంద్‌గావ్ జిల్లాలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారన్న సమాచారంతో జిల్లారిజర్వ్‌గార్డ్స్ (డీఆర్జీ) బలగాలు, స్థానిక పోలీసులతో కలిసి గాలింపు చేపట్టారు. బాగందీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని షేర్‌పార-సీతాగోట్ అటవీప్రాంత సమీపంలో తారసపడిన మావోయిస్టులు కాల్పులకు తెగబడ్డారు. దీంతో పోలీసులు ఎదురుకాల్పులు జరిపారు. మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే అడవిలోకి పారిపోయారు. దాదాపు రెండు గంటలపాటు జరిగిన భీకర కాల్పుల అనంతరం పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించగా ఏడుగురు మావోయిస్టుల మృతదేహాలు కనిపించాయి. మృతుల్లో సుఖ్‌దేవ్ అలియాస్ లక్ష్మణ్ (మావోయిస్టు పార్టీ డీవీసీఎస్ ఏరియా కమిటీమెంబర్), అతని భార్య ప్రమీల(ఏరియా కమిటీ మెంబర్), మీనా (ఏసీఎం), సీమా (ఏసీఎం), రితేష్ (ఏసీఎం), లలిత (1వ నెంబర్ ప్లాటూన్ మెంబర్), శిల్ప (1వ నెంబర్ ప్లాటూన్ మెంబర్) ఉన్నారు. ఘటనాస్థలంలో ఒక ఏకే -47 తుపాకీ, ఒక 303 రైఫిల్, ఒక 12బోర్ తుపాకీ, ఒక స్టెన్‌గన్, 315 బోర్ రైఫిల్ ఒకటి, బుల్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గాయపడిన జవాన్‌ను దవాఖానకు తరలించగా ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉన్నది.


అనారోగ్యంతో బాధపడుతున్న పెద్దపల్లి జిల్లా రామగుండం మాజీ మున్సిపల్ చైర్మన్ బడికెల రాజలింగంకు మంత్రి కొప్పుల ఈశ్వర్ అండగా నిలిచారు. సీఎం సహాయ నిధి నుంచి రూ.5లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. శనివారం హైదరాబాద్‌లోని యశోద దవాఖానకు వెళ్లిన మంత్రి కొప్పుల, రాజలింగంను పరామర్శించి ఎల్‌వోసీని అందజేశారు. - గోదావరిఖని టౌన్

## కులబహిష్కరణ చేశారని మహిళ ఆత్మహత్యాయత్నం

**రెంజల్ :** కులబహిష్కరణ చేశారని మనస్తాపం చెందిన ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం నీలా గ్రామంలో శనివారం కలకలం రేపింది. గ్రామంలో బ్లాక్ కల్లు దుకాణాన్ని మూసివేయాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ , సీఐలకు గ్రామానికి చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేశారు. దీంతో ఇటీవల సదరు కుల పెద్దలు పంచాయతీ పెట్టి కేసును ఉపసంహరించుకోవాలని కోరినా వినకపో వడంతో ఆమె కుటుంబాన్ని కుల బహిష్కరణ చేశారు. అవమానంగా భావించిన మహిళ సూసైడ్‌నోట్ రాసి శుక్రవారం రాత్రి భర్త ఇంట్లోలేని సమయంలో ఆత్మహత్యకు యత్నించారు. నిజామాబాద్ దవాఖానలో బాధితురాలు చికిత్స పొందుతున్నారు.

నమస్తే తెలంగాణ

# ధర్మగంట

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు

ధర్మగంట
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.

Whatsapp No.
9346979997

dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.

స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.

/NTDAILYONLINE



## పాస్‌బుక్ ఇచ్చి.. ఆన్‌లైన్ మరిచారు

- నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యం
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన మహిళా రైతు కృష్ణమ్మ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం కొండనాగుల గ్రామానికి చెందిన ఎర్రమోని కృష్ణమ్మకు సర్వే నంబర్లు 2/ఈలో 18 గుంటలు, 398/ఈలో 31 గుంటలు, 399/ఈలో 36 గుంటలు, 400/ఈలో ఎకరం మూడు గుంటల భూమి ఉన్నది. తన భర్త మరణించడంతో ఈ భూమి కృష్ణమ్మకు వారసత్వంగా లభించింది. రెవెన్యూ అధికారులు గత ఏడాది జూలై 3న కొత్త పాస్‌పుస్తకం కూడా జారీచేశారు. కానీ సర్వే నంబర్ 2/ఈలోని 18 గుంటల భూమిని ఆన్‌లైన్‌లో నమోదుచేయలేదు. భూమిని ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని అనేకసార్లు రెవెన్యూ అధికారులను కలిసినా ఇంతవరకు స్పందించడంలేదు. సరైన సమాధానం కూడా చెప్పడంలేదు. గ్రామ శివారులో ఉన్న ఈ భూమిపై కొందరి కన్నుపడి, రెవెన్యూ అధికారులు వారితో కుమ్మక్కవడంవల్లే ఆన్‌లైన్ చేయడంలేదని బాధిత మహిళా రైతు ఆరోపిస్తున్నారు. అన్ని రికార్డులు సక్రమంగా ఉన్నా.. పట్టాదారు పాస్‌పుస్తకం జారీచేసినా ఆన్‌లైన్ ఎందుకు చేయడంలేదని బాధితురాలు ప్రశ్నిస్తున్నారు. ఈ సర్వే నంబర్‌లో ఇతరులకు చెందిన భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేశారని కృష్ణమ్మ తెలిపారు. అధికారులు స్పందించకపోవడంతో బాధితురాలు 'ధర్మగంట'ను ఆశ్రయించారు. ఈ విషయమై బల్మూరు తాసిల్దార్ మల్లికార్జున్‌రెడ్డిని 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా.. ప్రస్తుతం సర్వే నంబర్ 2/ఈ వ్యవసాయేతర భూమిగా ఉన్నదని, అందుకే ఆన్‌లైన్‌లో నమోదుచేయలేదని చెప్పారు.

## మూడుకోర్టులు తీర్పు ఇచ్చినా..

# ముప్పుతిప్పలు

ముత్యంరావు పాత పాస్‌బుక్



### 27 ఏండ్లుగా తాసిల్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు ■ కోర్టు తీర్పు ఇచ్చిన పద్నాలుగేండ్ల తర్వాత పాస్‌పుస్తకం జారీ

- పహాణీ, వన్ బీలో పేరు మార్చని రెవెన్యూ అధికారులు
- కొత్త పాస్‌పుస్తకం ఇవ్వకుండా వేధింపులు
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన జయశంకర్ భూపాలపల్లి జిల్లా రైతు వెంకట ముత్యంరావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం నస్తూర్‌పల్లి గ్రామానికి చెందిన డాక్టర్ పీ వెంకటముత్యంరావు, పీ రాధాకిషన్‌రావు అన్నదమ్ములు. వీరికి తండ్రి నుంచి 28.38 ఎకరాల చొప్పున వారసత్వంగా వచ్చింది. అయితే రాధాకిషన్‌రావు.. సోదరుడు వెంకట ముత్యంరావు భూమికి తప్పుడు పత్రాలు సృష్టించి రెవెన్యూ రికార్డుల్లో తన పేరు ఎక్కించుకొన్నాడు. విషయం తెలుసుకొన్న వెంకట ముత్యంరావు వెంటనే ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని పెద్దపల్లి సబార్డినేట్ కోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన న్యాయస్థానం 28 ఎకరాల 38 గుంటల భూమి మొత్తం వెంకట ముత్యంరావుదేనని 1992 జనవరి 31న తీర్పు ఇచ్చింది. సర్వే నంబర్లవారీగా భూమిని కోర్టు తన తీర్పులో పేర్కొన్నది. కోర్టు తీర్పు కాపీని తీసుకొని బాధితుడు రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లారు. కానీ, రికార్డులు మార్చకుండా నానా తిప్పలు పెట్టారు. దీంతో నాటి కరీంనగర్ జిల్లా కలెక్టర్‌ను కలువగా.. వెంకట ముత్యంరావుకు పట్టాదారు పాస్‌పుస్తకం ఇవ్వాలని 1995 జూలై 7న కాటారం మండల రెవెన్యూ అధికారిని ఆదేశించారు. ఆ ఆదేశాలనూ బేఖాతర్ చేసిన స్థానిక రెవెన్యూ అధికారులు.. బాధితుడితోపాటు కుటుంబసభ్యులను తాసిల్ కార్యాలయం చుట్టూ తిప్పించుకొని 14 ఏండ్ల తర్వాత 2009లో పాస్‌పుస్తకం ఇచ్చారు.

**పాస్‌బుక్ ఉన్నా.. రికార్డులో పేరులేదట!**

2017లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూరికార్డుల ప్రక్షాళనలో భాగంగా తనకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకం ఇవ్వాలని ముత్యంరావు కాటారం తాసిల్దార్, నస్తుర్‌పల్లి వీఆర్వోను అడిగారు. అయితే మీకు పాస్‌పుస్తకం మాత్రమే ఉన్నది.. రెవెన్యూ రికార్డుల్లో మీ పేరు లేదంటూ ముత్యంరావుకు రెవెన్యూ అధికారులు విస్తుపోయే సమాధానం ఇచ్చారు. రికార్డుల్లో రాధాకిషన్‌రావు పేరే మొదటి నుంచీ కొనసాగుతున్నదని, ఆయన పేరును తొలగించి.. మీ పేరు ఎక్కించలేదంటూ ముత్యంరావుకు చెప్పారు. పాస్‌పుస్తకం ఇచ్చిన తర్వాత రికార్డుల్లో తన పేరు ఎందుకు ఎక్కించలేదని రెవెన్యూ అధికారులను అడిగినా సరైన సమాధానం రాలేదు. దీంతో భూపాలపల్లి జిల్లా కలెక్టర్, ఆర్డీవోలను ఆశ్రయించారు. సమాచార హక్కుచట్టం కింద తన ఫిర్యాదుపై తీసుకొన్న చర్యలను వివరించాలని కోరారు. అక్కడా సరైన సమాధానం రాకపోవడంతో పెద్దపల్లి కోర్టు ఇచ్చిన తీర్పు అమలుచేయకపోవడంపై ముత్యంరావు 2019 ఫిబ్రవరిలో హైకోర్టును ఆశ్రయించారు. కేసును విచారించిన హైకోర్టు సింగిల్ బెంచ్ పెద్దపల్లి కోర్టు ఇచ్చిన తీర్పును ఖరారు చేస్తూ 2019 ఏప్రిల్ 2న ముత్యంరావుకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును కూడా రెవెన్యూ అధికారులు అమలుచేయకపోవడంతో ముత్యంరావు హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేశారు. దీనిని స్వయంగా విచారించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం కింది కోర్టులు ఇచ్చిన తీర్పును ఖరారు చేస్తూ 2019 జూన్ 10న తీర్పు వెలువరించారు. ఈ తీర్పు ఇచ్చి కూడా 45 రోజులు గడుస్తున్నప్పటికీ రెవెన్యూ అధికారులు రికార్డులను సరిచేయలేదు. ఇదేమిటని ప్రశ్నిస్తే ఏపూటకు ఆపూట దాటవేసే మాటలు మాట్లాడుతూ అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ముత్యంరావు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

### కోర్టు తీర్పును అమలుచేస్తాం

కోర్టు ఆదేశాల మేరకు పీ వెంకట ముత్యంరావుకు ఆయా సర్వే నంబర్ల ప్రకారం రెవెన్యూ రికార్డుల్లో ఎక్కించి 1-బీ, పహాణీ, పట్టాదారు పాస్‌పుస్తకం అందజేస్తాం. కోర్టు ఆర్డర్ ప్రకారం ప్రొసీడింగ్‌ను కూడా రూపొందించాల్సి ఉన్నది. ఇందుకోసం వీఆర్వోకు మెమో ఇచ్చి రెవెన్యూ రికార్డులో వెంకట ముత్యంరావు పేరు ఎక్కిస్తాం. ఆయన సంబంధీకులు ఎవరైనా కార్యాలయానికి వచ్చి నన్ను సంప్రదిస్తే సమస్యను వెంటనే పరిష్కరిస్తాం.

**- అశోక్‌కుమార్, కాటారం తాసిల్దార్**

## మా మాట!

### రైతులకు మేలు జరుగుతుంది



రెవెన్యూ చట్టాలను మార్చడంవల్ల ఆ శాఖలో అవినీతి తగ్గుతుంది. కొత్త చట్టం వల్ల పేదలకు, రైతులకు మేలు జరుగుతుంది. ఎన్నో ఏండ్ల నుంచి గ్రామాల్లో భూసమస్యలున్నాయి. ఏండ్ల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగినా పనులు కావడంలేదు. పైసలు ఇయ్యందే పనిచేయడంలేదు. కొంతమంది అధికారులు పైసలు తీసుకొని కూడా రేపు మాపు అంటూ నెలలతరబడి తిప్పుకొంటున్నారు. సీఎం కేసీఆర్ తీసుకొస్తున్న కొత్త చట్టం ద్వారా అందరికీ మేలు జరుగుతుంది.

**- దొంతునేని భగవంతరావు, రుద్రాయగూడెం, డిండి మండలం, నల్లగొండ జిల్లా**

### ప్రభుత్వం రైతుల పక్షపాతి



'నమస్తే తెలంగాణ' ధర్మగంటతో రైతులకు సంబంధించిన భూముల పెండింగ్ సమస్యలు పరిష్కారమవుతున్నాయి. గతంలో రైతులు భూమి పట్టాదారు పాస్‌పుస్తకాలు చేయించుకోవాలంటే రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగి నానా ఇబ్బందులు పడేవారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రెవెన్యూ చట్టంలో మార్పులు తీసుకురావాలని నిర్ణయం తీసుకోవడం హర్షనీయం. సమూల ప్రక్షాళన ద్వారా ప్రభుత్వం రైతుల పక్షపాతిగా నిలిచిపోయింది.

**- కర్నాటి విజయభాస్కర్‌రెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, పెద్దవూర మండలం, నల్లగొండ జిల్లా**

### భూసమస్యలు పరిష్కారం



'ధర్మగంట'తో రైతుల భూసమస్యలు పరిష్కారమవుతున్నాయి. గతంలో రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగేవారు. ఇప్పుడు ఆ దుస్థితి నుంచి 'ధర్మగంట' దూరం చేసింది. ధర్మగంటను ఆశ్రయించక ముందే రైతుల భూసమస్యలు తీర్చాలని రెవెన్యూ అధికారులు ఆరాటపడుతున్నారు. తెలంగాణ ప్రభుత్వ నిర్ణయం రైతులకు వరంగా మారింది. అవినీతికి తావులేకుండా వీర్వోల బదిలీలు చేపట్టడం కూడా రైతులకు ఊరటనిస్తున్నది.

**- శ్రీనివాస్, రైతు, జలాల్‌పురం గ్రామం, తిరుమలగిరి మండలం, సూర్యాపేట జిల్లా**

## మూడేండ్లయినా విరాసత్ కాలే!

- పట్టించుకోని బోధన్ రెవెన్యూ అధికారులు
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన బాధితుడు ఖాజా సలావుద్దీన్



**శక్కర్‌నగర్:** వారసత్వ భూమిని విరాసత్‌చేయాలని ఓ బాధితుడు మూడేండ్లుగా తాసిల్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలుచేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారికంగా వారసత్వం కలిగిన తమ భూములను దాయాదులు మరోమారు అక్రమంగా స్వాధీనం చేసుకొనేందుకు యత్నిస్తున్నారని, వారికి కొందరు అధికారులు, నేతలు వత్తాసు పలుకుతున్నారని బాధితుడు ఆరోపించారు. తనకు న్యాయంచేయాలని కోరుతూ నిజామాబాద్ జిల్లా బోధన్‌కు చెందిన ఖాజా సలావుద్దీన్ 'ధర్మగంట'ను ఆశ్రయించారు. బోధన్ పట్టణ శివారులో పాండు, దౌత్యాల్ తర్ఫలో.. నిజాం ప్రభుత్వ పాలనలో ముంతఖబ్ (సర్వే) నంబర్ 2506। 1295 హిజ్రి ఏడీ 1876 అబ్దుల్ సత్తార్‌కు 87 ఎకరాల భూమిని కేటాయించారు. అనంతరం ఆయన కుమారుడైన ఖాజామొహియొద్దీన్‌కు ఆ భూమి వారసత్వంగా సంక్రమించింది. ఖాజా మొహియొద్దీన్ మృతిచెందిన అనంతరం ఆయన కుమారులైన నలుగురు ఈ భూమికి వారసులుగా ప్రకటిస్తూ 40। 1352 ఫస్లీ కేస్ నంబర్ 5। 58 ఆఫ్ 1352 ఫస్లీ ఆధారంగా జిల్లా కలెక్టర్ 1942లో ఉత్తర్వుల జారీచేశారు. నలుగురు కుమారుల్లో ఇద్దరు అబ్దుల్ రజాక్, ఖాజా అమీనుద్దీన్ పోలీస్‌చర్యలో భాగంగా పాకిస్థాన్‌కు వెళ్లారు. స్థానికంగా ఉన్న ఖాజా ఖలీలుద్దీన్, ఖాజా జలీలుద్దీన్ ఈ భూములకు వారసులుగా అధికారులు నిర్ధారించారు. భూములకు ఆక్యుపెన్సీ రైట్ సర్టిఫికెట్ (ఇనాం 158,77)ను 1977 అక్టోబర్ 30న బోధన్ సబ్ కలెక్టర్ అందజేశారు. ఖాజా ఖలీలుద్దీన్‌కు 45.17 ఎకరాలు, ఖాజా జలీలుద్దీన్‌కు 43.06 ఎకరాలు కేటాయిస్తూ ఓఆర్సీ అందజేశారు. ఖాజా ఖలీలుద్దీన్ తన భూమిని పూర్తిగా అమ్మివేశారు. సోదరుడు ఖాజా జలీలుద్దీన్‌కు చెందిన 28 ఎకరాల భూమిని కూడా విక్రయించారు. ఈ భూములకు రెవెన్యూ అధికారులు పట్టాలు కూడా అందజేశారు. మిగతా 15 ఎకరాలను ఖాజా జలీలుద్దీన్ కుమారుడైన ఖాజా సలావుద్దీన్ సాగు చేసుకొంటున్నారు. అన్ని అధారపత్రాలు చూపుతున్నా, చట్టబద్ధంగా వారసత్వ భూమి సంక్రమించినా తన పేరిట పట్టా అందించేందుకు రెవెన్యూ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని బాధితుడు సలావుద్దీన్ ఆరోపిస్తున్నారు. తండ్రి వారసత్వ భూమిని తన పేరిట పట్టాచేయాలని విజ్ఞప్తిచేస్తున్నారు.

## రికార్డులు సక్రమంగా ఉన్నా..

# రైతుబంధు నిలిపివేత



బాధితుడు వెంకన్న

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం జలాలుపురం గ్రామానికి చెందిన దొంగరి వెంకన్న గత పదేండ్లుగా క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. 1969 తెలంగాణ ఉద్యమంలో పోరాడి వరంగల్ సెంట్రల్‌జైల్‌లో శిక్ష అనుభవించిన వెంకన్నకు జలాలుపురం గ్రామంలోని సర్వే నంబర్ 401-ఋ లో 2 గుంటలు, 404-అ 3 లో 22 గుంటలు, 404-ఈ లో 23 గుంటలు, 404-ఉ లో 23 గుంటలు, 405-ఉ 1 లో 18 గుంటలు, 405-ఉ 3 లో 18 గుంటలు, 406-అ 2 లో 21 గుంటలు, 406-ఈ 3 లో 16 గుంటల భూమి ఉన్నది. మొత్తం 3.26 ఎకరాల భూమికి వెంకన్న పేరిట గతేడాది మేలో మొదటి విడుత రైతుబంధు కింద రూ.11,300 చెక్కు కూడా వచ్చింది. అర్వపల్లి పరిధిలోకి వచ్చిన జలాలుపురం గ్రామ వీఆర్వో.. వెంకన్నకు చెక్కు ఇవ్వకుండా తిప్పుకొన్నారు. చెక్కు కోసం అడిగితే.. చెక్కు తప్పుగా వచ్చిందని, భూమి విస్తీర్ణం తక్కువగా ఉన్నదంటూ వీఆర్వో తన దగ్గరే పెట్టుకొన్నారని వెంకన్న వాపోయారు. ఈ చెక్కును రద్దు చేసి, కొత్త చెక్కు వచ్చేలా చేస్తానంటూ తిప్పుకొంటున్నాడని ఆవేదన వ్యక్తంచేశారు. గతేడాది నుంచి రైతుబంధు చెక్కు కోసం తిరిగితే పట్టించుకోవడం లేదని, గ్రామసభలో కూడా విన్నవించుకొన్నానని, చివరకు సూర్యాపేట జిల్లా కలెక్టర్‌కు కూడా విజ్ఞప్తి చేసుకొన్నానని బాధితుడు తెలిపారు. మూడు విడుతల్లో రైతు బంధు చెక్కులు గ్రామంలో రైతులకు వచ్చాయని, కానీ తనకు మాత్రమే నిలిపివేస్తున్నారని వాపోయారు. పదేండ్లుగా క్యాన్సర్‌తో బాధపడుతున్నానని, ప్రతినెలా హైదరాబాద్‌కు వెళ్లి చికిత్స చేయించుకొంటున్నానని వేడుకొంటున్నా అధికారులు కనికరం చూపడం లేదని వెంకన్న రోదిస్తున్నారు.

### అవినీతి అధికారుల నుంచి విముక్తి



లంచాలకు అలవాటుపడిన అవినీతి అధికారుల వేధింపుల నుంచి రైతులను 'ధర్మగంట' ఆదుకొంటున్నది. రెవెన్యూ కార్యాలయాల్లో సిబ్బంది.. పని నిమిత్తం వచ్చిన రైతులు, ప్రజల నుంచి లంచం అడగడానికి భయపడుతున్నారు. భూసమస్యలు పరిష్కారమయ్యేలా 'నమస్తే తెలంగాణ' చేస్తున్న కృషి అభినందనీయం. రెవెన్యూ అధికారులు అదేస్థాయిలో స్పందించడం శుభపరిణామం.

**- కట్టా జగద్దాస్, జనగామ క్రాస్‌రోడ్డు, సూర్యాపేట జిల్లా**

## నమూనా వచ్చినా పాస్‌బుక్ రాలే

- ఏడాదిగా తాసిల్ కార్యాలయం చుట్టూ బాధితుడి ప్రదక్షిణ
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన కొత్తగూడెం జిల్లా దమ్మపేటవాసి



బాధితుడు హేమచంద్

**దమ్మపేట:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట రెవెన్యూ మౌజాలోని సర్వే నంబర్ 845/2లో దమ్మపేటకు చెందిన రావు హేమచంద్ తాత రావు బాలకోటేశ్వరరావుకు 3.03 ఎకరాలు భూమి ఉన్నది. 2012లో బాలకోటేశ్వరావు చనిపోయిన తర్వాత హేమచంద్‌కు సదరు భూమి వారసత్వంగా సంక్రమించింది. బాలకోటేశ్వరావు పాస్‌బుక్ ఖాతా నంబర్ 583 నుంచి హేమచంద్ పాస్‌బుక్ ఖాతా నంబర్ 2399లోకి గతంలో మారింది. అప్పుడు రెవెన్యూ అధికారులు పాస్‌బుక్ సైతం జారీచేశారు. కానీ, గతేడాది భూరికార్డుల ప్రక్షాళన సందర్భంగా హేమచంద్ తన వద్ద ఉన్న ఆధారాలను అధికారులకు అందజేసి కొత్త పాస్‌పుస్తకం కోసం దరఖాస్తు చేసుకొన్నారు. తర్వాత అధికారులు పాస్‌పుస్తకానికి సంబంధించిన నమూనా కూడా అందించారు. అప్పటి నుంచి కొత్త పాస్‌పుస్తకం కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నా రెవెన్యూ అధికారులు కనికరించడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతో 'రైతు బంధు' కోల్పోయానని బాధితుడు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తనకు కొత్త పాస్‌పుస్తకం అందజేయాలని హేమచంద్ కోరుతున్నారు. ఈ విషయమై తాసిల్దార్ శిరీషను వివరణ కోరగా.. గతేడాది తాను ఇక్కడ తాసిల్దార్‌గా లేనన్నారు. పూర్తి వివరాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకొంటామన్నారు.

# మోఖాలో ఉన్నా.. రికార్డుల్లో మాయం

- 39 ఏండ్లుగా కాస్తులో ఉన్న రైతులకు కాకుండా మరొకరికి పట్టా
- ఇదీ జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండల రెవెన్యూ అధికారుల ఘనత
- కలెక్టర్ ఆదేశించినా.. తేల్చని తాసిల్దార్
- న్యాయం కోసం 'ధర్మగంట'ను ఆశ్రయించిన గిరిజన అన్నదమ్ములు

**జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం తీగారం గ్రామానికి చెందిన నలుగురు గిరిజన అన్నదమ్ములు నిరక్షరాస్యులు. తండ్రి వారసత్వంగా సక్రమించిన ఐదెకరాల భూమిని 39 ఏండ్లుగా సాగుచేసుకొంటున్నారు. కాస్తులో ఉన్న రైతులకు తెలియకుండా రెవెన్యూ అధికారులు మరొకరికి వారి భూమిని పట్టాచేశారు. తాసిల్దార్‌ను ఆశ్రయించగా పట్టించుకోలేదు. కలెక్టర్‌కు మొరపెట్టుకోగా తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అయినా, తాసిల్దార్ నిర్లక్ష్యం వహించడంతో బాధితులు 'ధర్మగంట'ను ఆశ్రయించి న్యాయంచేయాలని కోరుతున్నారు.**

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం తీగారం గ్రామానికి చెందిన మాలోతు మాన్‌సింగ్, భీక్యా, రాములు, చంద్రులు నలుగురు అన్నదమ్ములు. వీరికి సర్వే నంబర్ 326లో 2.20 ఎకరాలు, సర్వే నంబర్ 325లో రెండెకరాలు, సర్వే నంబర్ 324లో 20 గుంటలు మొత్తం ఐదెకరాల భూమి ఉన్నది. ఈ భూమిని వీరి తండ్రి మాలోతు సీత్యా గతంలో అదే గ్రామానికి చెందిన నెల్లుట్ల నర్సింగరావు వద్ద కొనుగోలు చేశారు. అప్పటి పహాణీలో వీళ్ల తండ్రి పేరుతోనే ఈ భూమి ఉన్నది. అయితే అన్నదమ్ములు పట్టా చేసుకోవడం మరిచారు. ఇదే రెవెన్యూ అధికారులకు కలిసొచ్చింది. ఆ భూమిని మరో గ్రామానికి చెందిన మడిగ మహిపాల్, మడిగ ప్రమీల పేరిట తాసిల్దార్ పట్టా చేసేశారు. ఈ విషయం ఆ అన్నదమ్ములకు తెలియదు. పట్టా చేసుకున్న వాళ్లు కూడా మోఖాలోకి వెళ్లలేదు. రైతుబంధు సాయం అందకపోవడంతో అన్నదమ్ములు తాసిల్దార్ కార్యాలయానికి వెళ్లగా రెవెన్యూ అధికారులు తమ భూమి వేరొకరికి పట్టా చేశారనే విషయం తెలిసింది. తాసిల్దార్ వీరప్రకాశ్‌కు విషయం చెప్పగా స్పందించకపోవడంతో బాధితులు ఆర్డీవోకు తమ గోడు వెల్లబోసుకొన్నారు. అక్కడినుంచి తాసిల్దార్‌కు ఆదేశాలువెళ్లినా.. కాలయాపన కావడంతో బాధితులు కలెక్టర్‌కు మొరపెట్టుకొన్నారు. అయినా ఫలితం లేదని ఆ అన్నదమ్ములు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



### తాసిల్దార్ ఇబ్బంది పెడుతున్నారు

మా తండ్రి మాలోతు సీత్యా 19771-72లో నెల్లుట్ల నర్సింగరావు వద్ద మొత్తం 20 ఎకరాలకుపైగా భూమి కొనుగోలుచేశారు. ఆ భూమిలో మా నలుగురు అన్నదమ్ములకు పట్టాలు ఉన్నాయి. మేము సర్వే నంబర్లు 324, 325, 326లలో పట్టా చేసుకోవడం మరిచిపోయాం. ఆ భూమిలో వ్యవసాయం చేసుకొంటున్నాం అనుకొన్నాం. కానీ, ఆ భూమి వేరొకరి పేరుతో ఉన్నది. మా తండ్రికి భూమి అమ్మిన నెల్లుట్ల నర్సింగరావు ఇప్పుడు లేరు. ఆయన కుమారుడు కూడా ఆ భూమి మాకు విక్రయించినట్టు అధికారులకు లేఖ రాశారు. అయినా తాసిల్దార్ మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారు. పోలీసులతో బెదిరించి ఆ భూమి నుంచి వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారు.

**- మాలోతు రాములు, మాన్‌సింగ్, బాధిత రైతులు**

### సర్వే చేయనివ్వడం లేదు

సర్వే చేయడానికి ఆ భూమిలోకి వెళ్తే సహకరించడం లేదు. మాలోతు మాన్‌సింగ్ చెప్తున్న సర్వే నంబర్లలో మడిగ మహిపాల్, మడిగ ప్రమీల పేరుతో పట్టా అయింది. వాళ్లకు వారసత్వంగా ఆ భూమి కొనసాగుతున్నది. అందుకే పట్టా చేశాం. సర్వేచేస్తే నిజాలు బయటపడుతాయి. సర్వే కోసం తీగారం గ్రామానికి వెళ్తే అడ్డుకొంటున్నారు.

**- వీరప్రకాశ్, తాసిల్దార్, జఫర్‌గఢ్**

## రికార్డుల్లో భూమిని ఊడ్చేశారు!

- పట్టా రద్దుతో 9.25 ఎకరాలు కోల్పోయిన రైతు
- సమాచారం లేకుండానే దాయాదులకు పట్టా
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన నల్లగొండ జిల్లావాసి



కుక్కడపు నారాయణ

**నిడమనూరు:** నా పేరు కుక్కడపు నారాయణ. మాది నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలోని ఎర్రబెల్లి గ్రామం. గ్రామ శివారులోని సర్వే నంబర్లు 494/51, 403/అ1, 404/అ1, 416/అ1, 417/అ1లలో మొత్తం 9.25 ఎకరాల భూమి నా పేరిట పట్టా ఉన్నది. మేము మా తల్లిదండ్రులకు ఐదుగురం అన్నదమ్ములం. ఆడపిల్లల పెండ్లిళ్లు, తల్లిదండ్రుల బాగోగులు అన్నీ నేను, మా అన్న ఆంజనేయులు చూశాం. మిగిలిన సోదరుల్లో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు, మరొకరు వ్యాపార రీత్యా వేర్వేరు చోట్ల స్థిరపడ్డారు. ఈ ముగ్గురూ ఏనాడు కుటుంబ మంచిచెడులు గానీ, వ్యవసాయ సంబంధ వ్యవహారాల్లోగాని జోక్యం చేసుకోలేదు. మా తల్లి పిచ్చమ్మ 2014లో మృతిచెందడంతో అధికారులు సదరు భూమిని నా పేరిట విరాసత్‌చేసి పాస్‌పుస్తకం మంజూరుచేశారు. 30 ఏండ్లుగా నేను ఈ భూమిని సాగుచేస్తున్నా. భూరికార్డుల ప్రక్షాళనలో మా అన్నదమ్ములు ముగ్గురు భూమిని తమకు ఇవ్వాలంటూ నాపై దౌర్జన్యంచేశారు. ప్రభుత్వ ఉద్యోగులైన కారణంగా అధికారులు వారికి మద్దతుగా నిలిచి, నా పేరిట ఉన్న పట్టా భూమిని ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే రద్దు చేసి మా అన్నదమ్ములైన వెంకన్న, బ్రహ్మయ్య, చంద్రయ్య పేరిట పట్టాచేశారు. ఇది నాకు తెలిసి కార్యాలయం చుట్టూ తిరుగుతూ దరఖాస్తులు సమర్పిస్తున్నాను. రెండేండ్లుగా అధికారులను వేడుకొంటున్నా కనికరించడంలేదు. నేను ఇప్పటివరకు మోఖాలో ఉండి సాగుచేస్తున్నా అధికారులు నా పేరిట ఉన్న పట్టాను రద్దుచేయడంతో దిక్కుతోచడం లేదు. రెక్కలు ముక్కలు చేసుకొని సాగుచేసుకొంటున్న భూమి అధికారుల తీరుతో కోల్పోయాను. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని నా భూమిని ఇప్పించాలి.

### నారాయణది అక్రమ పట్టా

తల్లిదండ్రులకు ఐదుగురు వారసులుండగా, తల్లి మరణం తర్వాత నారాయణ అక్రమంగా పట్టా పొందారు. మిగతా వారసుల ఫిర్యాదుమేరకు విచారణచేపట్టి నిబంధనల మేరకు పట్టాను రద్దుచేశాం.

**- జీ దేశ్యానాయక్, నిడమనూరు తాసిల్దార్**

నమస్తే తెలంగాణ
కరీంనగర్
ఆదివారం, 4 ఆగస్టు 2019
WWW.NTNEWS.COM

# పంజరం వీడుతున్న పక్షులు

సామవేదం



సామ మల్లారెడ్డి

ఈ మధ్య దుబాయి రాజు భార్య రాజకుమారి హయా దేశం విడిచి పారిపోయి లండన్‌లో ఆశ్రయం కోరుతూ అక్కడి కోర్టులో పిటిషన్ పెట్టుకోవటం ప్రపంచవ్యాప్తంగా పెద్ద సంచలనమైంది. తనకూ, తన పిల్లలకు ప్రాణ భయం ఉన్నదని తన భర్త నుంచి రక్షణ కల్పించాలని బ్రిటిష్ ప్రభుత్వాన్ని కోరింది. అలాగే తన బిడ్డలకు బలవంతపు పెళ్లి ఒత్తిడిల నుంచి విముక్తి కల్పించాలని, తన భర్త, రాజ కుటుంబం నుంచి ఎదురయ్యే హింసాదౌర్జన్యాల నుంచి కాపాడాలని లండన్ కోర్టును కోరటంతో దుబాయిలో మహిళల స్థితిగతుల గురించి చర్చ సాగుతున్నది. ప్రపంచంలోనే అత్యంత ధనవంతమైన రాజ కుటుంబీకురాలిగా ఉంటూ కూడా సాధారణ పౌరురాలిగా దేశం విడిచి పారిపోవలసి వచ్చింది.

దుబాయి రాజు షేక్ మొహమ్మద్ మాత్రం ఆమె ఎవరో తెలియదని చెబుతూ ట్విటర్‌లో ఓ కవితాత్మక సందేశాన్ని రాశాడు. ఆ తర్వాత తన వివాహ హక్కులను మన్నించి తన బిడ్డలను, భార్యను తనచెంతకు చేర్చాలని లండన్ కోర్టులో పిటిషన్ వేశాడు. ఆమె ఒక మత ద్రోహి అని ఆరోపించాడు. దుబాయి రాజు అభ్యర్థనను లండన్ కోర్టు నిరాకరించింది కానీ, దుబాయి, ఇంగ్లాండ్ మధ్య ఉన్న స్నేహపూర్వక సంబంధాల నేపథ్యంలో పరిస్థితులు ఎలా ఉండబోతాయన్నది అందరినీ వేధిస్తున్న ప్రశ్న. రాజకుమారి హయాను తిరిగి దుబాయి రాజుకు అప్పగిస్తే ఆమె బతుకు ఏమవుతుందన్న భయాందోళనలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

హయా బింట్ అల్-హుస్సేన్ రాజకుమార్తె. జోర్డాన్ రాజు కూతురు. ఇప్పుడు జోర్డాన్ రాజుగా ఉన్న అబ్దుల్లా-IIకు హయా సవతి తల్లి కొడుకు. రాజ కుమార్తెగా హయా బ్రిటన్‌లోని ప్రైవేట్ స్కూల్‌లో విద్యాభ్యాసం చేసింది. బ్రిస్టల్‌లోని బ్యాడ్మింటన్ స్కూల్‌లో చేరింది. ప్రతిష్ఠాత్మక ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో తత్త్వశాస్త్రం, అర్థశాస్త్రంలో పట్టా పొందింది. గుర్రపు స్వారీ ఇష్టమైన క్రీడ. జోర్డాన్‌లో భారీ వాహన లైసెన్స్ పొందిన మొదటి మహిళ. 2000 సంవత్సరంలో సిడ్నీలో జరిగిన ఒలింపిక్ క్రీడల్లో జోర్డాన్ ప్రతినిధిగా ఆ దేశ పతాకాన్ని చేతబట్టి క్రీడా రంగాన అగ్రస్థానంలో నిలిచింది. ఈ క్రమంలోనే.. రాజకుమార్తెగా మరో రాజకుటుంబంలోనే అడుగుపెట్టాలనే తల్లిదండ్రుల కోరికతో, ప్రపంచంలోనే అత్యంత ధనవంతమైన దుబాయి రాజు షేక్ మొహమ్మద్ అల్-మఖ్తూమ్‌కు ఆరో భార్యగా దుబాయి రాజ ప్రాసాదంలో అడుగుపెట్టింది. 2004లో 70 ఏండ్ల దుబాయ్ రాజుకు భార్యగా 30 ఏండ్ల వయస్సులో మెట్టినింటికి చేరింది. అప్పటికే అతనికి ఉన్న ఐదుగురు భార్యలకు కన్న సంతానం 23 మంది పిల్లలు. దుబాయి రాజు అధికారిక పట్టపు రాణిగా హయా వెలుగొందింది. అధికారిక కార్యక్రమాల్లో, విదేశీ పర్యటనల్లో దుబాయ్ రాజు షేక్ మొహమ్మద్ వెంట ఎల్లప్పుడూ ఉండేది.

కాలికి మట్టి అంటని, కాలుకింద పెట్టని నోట్లో బంగారు చెంచాతో పుట్టి పెరిగిన హయా దుబాయి రాజకుటుంబంలో నుంచి దొంగచాటుగా దేశం విడిచి పారిపోయి విదేశాల్లో ఆశ్రయం కోరాల్సిన అవసరం ఏమొచ్చిందన్నదే అసలు సమస్య. అంతకన్నా ముఖ్యంగా దుబాయ్ రాజ ప్రాసాదం నుంచి మహిళలు పారిపోవటం ఇదే మొదటిసారి కాదు. గతంలోనూ ఇలాంటి ఘటనలు అనేకం జరిగాయి. రాజ కుటుంబానికి చెందిన మహిళలు ఇల్లు విడిచి, దొంగచాటుగా దేశ సరిహద్దులు దాటి విదేశాల్లో ఆశ్రయం కోరిన ఘటనలున్నాయి. గతేడాది దుబాయి రాజు కూతురు షేక్ లతిఫా ఓ ఫ్రెంచీ జాతీయుడైన స్నేహితుడి సాయంతో 19 ఏండ్ల వయస్సులో దేశం విడిచింది. ఆమె రాజప్రాసాద బంగారు పంజరం నుంచి బయటపడి సముద్ర మార్గాన విదేశాలకు పయనమైన విషయాన్ని ఓ వీడియో సందేశాన్ని పంపింది. దీంతో దుబాయి రాజు పొరుగు దేశాలకు వర్తమానం పంపి తన చెల్లెలును తమకు అప్పగించాలని కోరాడు. ఆమె పయనిస్తున్న పడవ భారత సముద్ర జలాల్లోకి చేరగానే భారత నావికాదళాలు చుట్టుముట్టి నిర్బంధించాయి. ఆమెను దుబాయి రాజుకు అప్పగించారు. ఆమెను దుబాయి మతచట్టాల ప్రకారం గృహ నిర్బంధంలో పడేశారు. మతి స్థిమితం కోల్పోయిన వ్యక్తిగా ప్రచారం చేసి సాధారణ పౌరుల నుంచి దూరం చేసి ఒంటరి ఖైదీగా సాయుధ వ్యక్తుల పహరా మధ్య నిర్బంధించారు.



**దేశ సరిహద్దులు దాటడం ప్రాణం మీదికి తెచ్చుకోవటం కాదా అంటే, జీవచ్ఛవాలుగా అక్కడ బతకటం కన్నా స్వేచ్ఛా గాలుల కోసం ప్రాణాలకైనా తెగిస్తామంటున్నారు అరబ్ మహిళలు. 1970 ప్రాంతంలో సౌదీ అరేబియాలో రాజ కుటుంబీకురాలైన మహిళకు ఏ గతి పట్టిందో తెలిసికూడా అరబ్ మహిళలు తెగిస్తున్న తీరు వారి దుస్థితికి అద్దం పడుతున్నది. రాజకుటుంబ పెద్దలను కాదని ప్రేమించిన వ్యక్తితో ఇల్లువిడిచి పారిపోయినందుకు ఆమెను మత రాజ్యాంగం ప్రకారం బహిరంగ ఉరిశిక్ష విధించారు.**

రాజకుటుంబీకురాలిగా లతిఫా దుస్థితిని చూసి హయా చలించిపోయింది. ఇన్నాళ్లు తాను అనుభవిస్తున్న రంపపుకోతకు పరిష్కారం కండ్లముందు ఆవిష్కారం అయ్యింది. అద్దాల మేడల్లో మత సంప్రదాయాలు, ఆచారాల పేరుతో భర్త, ఆయన కుటుంబీకులు వ్యవహరిస్తున్న తీరుతో ఉక్కిరిబిక్కిరవుతున్న ఆమె సంకెళ్లను తెంచుకనే తెగింపు తెచ్చుకున్నది. అయితే ఇక్కడే మతరాజ్యం దుబాయిలో మానవ హక్కులు, మహిళల హక్కుల గురించి చెప్పుకోవాలి. అక్కడి మత రాజ్యాంగం ప్రకారం స్త్రీ ఎల్లవేళలా పురుషుడి సంరక్షణలోనే ఉండాలి. స్కూలుకు వెళ్లినా, బజారుకు వెళ్లినా పురుషుడు తోడుండాలి, లేదా అనుమతి పత్రం ఉండాలి. వారు ఏ పనిచేయాలన్నా, ఏం కొనాలన్నా, ధరించాలన్నా మగవారి అనుమతి ఉండాలి. కనీసం ముఖమైనా చూడని వ్యక్తితో పెళ్లికి సిద్ధపడాలి. అదే ఉన్నత, రాజకీయ, రాజకుటుంబాలైతే మరిన్ని ఆంక్షలు. అడుగడుగునా పురుషాధిపత్యంలో స్త్రీ సంరక్షణ పేరిట సర్వత్రా బందీ.

ఇలాంటి బంధనాల నుంచి విముక్తి కోసం దేశం విడిచి పారిపోయిన వారి విషాద గాథలు వింటే హృదయం ద్రవిస్తుంది. వఫా, మహా అల్ సుబే ఇద్దరు అక్కా చెల్లెండ్లు. రాజకుటుంబంలో వారు అనుభవిస్తున్న బానిస బతుకుల నుంచి విముక్తి పొందాలని నిశ్చయించుకున్నారు. కుటుంబ పెద్దలకు తెలియకుండా దొంగచాటుగా ఎలాగో రియాద్‌కు పాస్‌పోర్టును సంపాదించారు. విమాన టికెట్లుకొని జార్జియా చేరుకున్నారు. ఎందుకంటే జార్జియాకు వెళ్లాలంటే దుబాయి వాసులకు వీసా అవసరం లేదు. పదిహేడేండ్ల షాహద్ అల్ ముహమీద్ ది మరో విషాద గాథ. ఆమెను తండ్రి ప్రతి చిన్న విషయానికి ఆచారాలు తప్పుతున్నావని చీటికి మాటికి హింసించేవాడు. చేతులు మెలిపెట్టి బాధించేవాడు. దీంతో ఆ నరకం నుంచి బయటపడాలని అదను కోసం వేచిచూసింది. సెలవు దినాలు గడుపటం కోసం వారి కుటుంబం టర్కీకి వెళ్లినప్పుడు ఆమె, కుటుంబీకులంతా నిద్రపోతున్న సమయాన ఓ కిరాయి కారు తీసుకొని టర్కీ సరిహద్దులు దాటి జార్జియా చేరుకున్నది. అక్కడి అధికారులను తననొక కాందిశీకురాలిగా ఆశ్రయం కల్పించాల్సిందిగా వేడుకున్నది. శరణార్థి శిబిరాల్లోని దుర్భర జీవితమే తన విలాస రాజకుటుంబం కన్నా మేలైనదని చెప్పుకున్నది. తనకు ఇష్టమైన జీవితాను స్వేచ్ఛగా అనుభవిస్తానని అంటున్నది. అశ్వక్, అరీజ్ హమౌద్ అనే ఇద్దరు అక్కా చెల్లెండ్లది మరో విషాద గాథ. 2017లో తమకు ఇష్టమైన వారిని పెండ్లి చేసుకోవటానికి నిరాకరించిన తల్లిదండ్రులనుంచి పారిపోయి టర్కీ చేరుకున్నారు. తమను తమ దేశానికి తిరిగి పంపితే తమ ప్రాణాలు నిలువవని వేడుకొని కన్నీటి పర్యంతమయ్యారు. ఆ సంవత్సరంలోనే ఫిలిప్పీన్స్‌కు పారిపోయే క్రమంలో విమానాశ్రయంలో అధికారులకు దొరికిపోవటంతో వారిని తిరిగి దుబాయి పంపించేశారు. ఆ తర్వాత వారు ఏ స్థితిలో ఉన్నారో ఎవరికీ తెలియదు. వారం రోజుల క్రితం రాహఫ్ అల్ఖానన్ దుబాయి నుంచి ఆస్ట్రేలియా పారిపోతూ థాయిలాండ్ విమానాశ్రయంలో పట్టుబడ్డారు. వారి విజ్ఞాపన, అంతర్జాతీయ హక్కుల సంఘాల జోక్యంతో వారిని తిరిగి దుబాయికి అప్పగించకుండా అక్కడి అధికారులు, ఐక్యరాజ్య సమితి శరణార్థులుగా గుర్తించి రక్షణ కల్పించింది. వారిప్పుడు కెనడాలో ఆశ్రయం పొందారు. ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో కన్నీటి గాథలు.

సిరిసంపదలకు పుట్టినిండ్లుగా పేరుగాంచి అరబ్ దేశాల నుంచి, ముఖ్యంగా ఉన్నత రాజ కుటుంబాల నుంచి మహిళలు పారిపోయి విదేశాల్లో ఆశ్రయాన్ని కోరుతున్న ఉదంతాలు లెక్కకుమించి ఉంటున్నాయి. 2012 నుంచి 2017 మధ్యకాలంలో దుబాయి నుంచి పారిపోయిన ఘటనలు 800 వరకున్నాయి. ఒక్క 2015లోనే సౌదీ అరేబియా నుంచి 577 మంది విదేశాలకు పారిపోయారంటే పరిస్థితి తీవ్రతను ఊహించుకోవచ్చు. గడపదాటి దేశ సరిహద్దులు దాటిన వారిలో సౌదీకి చెందిన వారే 96.3 శాతం ఉంటున్నారు. ఇందులో 17 నుంచి 21ఏండ్ల మధ్య వయస్సు వారు 54 శాతం ఉంటున్నారు. 86 శాతం మంది అమ్మాయిలు పెండ్లి కానివారు, 10.2 శాతం మంది పెండ్లయినవారు. దేశ సరిహద్దులు దాటడం ప్రాణం మీదికి తెచ్చుకోవటం కాదా అంటే, జీవచ్ఛవాలుగా అక్కడ బతకటం కన్నా స్వేచ్ఛా గాలుల కోసం ప్రాణాలకైనా తెగిస్తామంటున్నారు అరబ్ మహిళలు. 1970 ప్రాంతంలో సౌదీ అరేబియాలో రాజ కుటుంబీకురాలైన మహిళకు ఏ గతి పట్టిందో తెలిసికూడా అరబ్ మహిళలు తెగిస్తున్న తీరు వారి దుస్థితికి అద్దం పడుతున్నది. రాజకుటుంబ పెద్దలను కాదని ప్రేమించిన వ్యక్తితో ఇల్లువిడిచి పారిపోయినందుకు ఆమెను మత రాజ్యాంగం ప్రకారం బహిరంగ ఉరిశిక్ష విధించారు. పెండ్లి, ఇతర విషయాల్లో తల్లిదండ్రుల ఆజ్ఞలను ధిక్కరించిన మహిళలెందరినో నెలల తరబడి జైళ్లల్లో నిర్బంధించారు. వైద్యపరమైన చికిత్సల పేరుతో, మానసిక వైద్యం పేరుతో తీవ్ర చిత్రహింసలకు గురిచేసి పిచ్చివారిగా మార్చి కుటుంబ గౌరవాన్ని నిలుపుకుంటున్నామనుకుంటున్నారు.

అరబ్ దేశాలు, ముఖ్యంగా సౌదీ అరేబియా, దుబాయి దేశాల మహిళల దీనగాథలకు వారి కుటుంబ పెద్దల కాఠిన్య హృదయాలు మాత్రమే కారణం కాదు. ఈ విధమైన అమానవీయ సంప్రదాయ ఆచార వ్యవహారాలకు మత రాజ్యాంగం మూలం. మతం పునాదిగా సమస్త మానవ విలువలను నిర్దేశించటంలోనే అసలు సమస్య ఉన్నది. అరబ్ దేశాలే కాదు, మత మౌఢ్యం పెచ్చరిల్లితే ఏ దేశంలోనైనా స్త్రీల పరిస్థితి ఇట్లాగే ఉంటుంది. వారు ఏ దుస్తులేసుకోవాలె అనేది మొదలుకొని ఏ విధంగా బతుకాలనేది శాసిస్తారు.

# కాళేశ్వర జీవనాదం..!

ప్రాజెక్టు



నూర శ్రీనివాస్

ఒకప్పుడు గోదావరి అంటే ఉభయ గోదావరి జిల్లాలే. ప్రాజెక్టు అంటే ధవళేశ్వరమే. తెలంగాణ గుండెల మీదినుంచి గోదారమ్మ ఎగిరి దుంకి పారిపోయేది. తెలంగాణను పడావుపెట్టి పరుగులిడేది. ఇప్పుడా దృశ్యం అదృశ్యమైంది. గోదారంటే ఇప్పుడు కాళేశ్వరం, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి, మిడ్‌మానేరు, మల్లన్నసాగర్, కొండపోశమ్మ. ఒక్క ధవళేశ్వరం కాదు ఆ మాటకొస్తే పోలికే లేదు. ఇదీ నడుస్తున్న తెలంగాణ. దేశానికే నడక నేర్పుతున్న చరితార్థపు చరిత్ర ఇవ్వాళ తెలంగాణ సొంతం. కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్టు దేశానికే గొప్ప జల సందేశాన్నిచ్చిన చరిత్ర. నీరు పల్లమెరుగదు అది ఆంధ్రానెరుగును అనేది ఉద్యమ సమయంలో పాడుకున్న పాటలు. చుక్క నీటి కోసం తలపోసి తలపోసి వలపోసుకున్నం. కాలానికి చరమగీతం పాడిన చరిత్ర. నీటిపాఠాలు నేర్చిన పాలన తెలంగాణలో సాగుతుండటం వల్లే సరికొత్త నీటి చరిత్రను సృష్టించుకోవడం సాధ్యమైంది. నీళ్లల్లో చేపలు ఎదురెక్కుతవి అన్న నానుడికి బదులు తెలంగాణ బీడు భూములకు ఎదురేగి పారుతదనేది నడుస్తున్న చరిత్ర. జల తెలంగాణకు సజీవ సాక్ష్యం కాళేశ్వరం. ఈ సజీవ నీటి దృశ్యం చూసినవారికి కండ్లు కుడుతున్నవి. అందుకే అవతలి పక్షం 'మేతావి' వర్గం ఒకటి కోడిగుడ్డు మీద ఈకలు పీకే ప్రయత్నం చేస్తున్నది. దేహం నిండా ద్వేషం, విద్వేషం నింపుకున్న అవతలిగట్టున దిమాఖ్ ఉంచుకున్న వర్గానికి ఇప్పుడూ ఆడిపోసుకోవడం పరిపాటిగా మారడమే దురదృష్టకరం.

నీరుయునూ ఆహారమే అని చిన్నప్పుడు చదువుకున్న పాఠం ఇప్పుడిప్పుడే తెలంగాణలో నిజమవుతున్నది. ప్రాణహితుడి పాలనలో ప్రాణహిత జలగంగ ఉప్పొంగిపోతున్నది. ఎటుచూస్తే అటు నీరై ఎగిపడుతున్నది. జీవన విధ్వంసం జరిగినచోటే సరికొత్త వికాసం పాదుకొల్పుతున్నది ఇప్పుడిప్పుడే తెలంగాణలో. మేడిగడ్డ తెలంగాణ జీవగడ్డగా అవతరించి అబ్బురపరుస్తున్నది. తెలంగాణ సృష్టికి ప్రతిసృష్టి చేసిన చరిత్ర తెలంగాణది. నీరిప్పుడు తెలంగాణనూ ఎరుగును అని గోదారమ్మ నడిచి మరీ చూపుతున్నది. ప్రపంచంలోనే అనేక దేశాలు, దేశంలోని అనేక రాష్ర్టాల్లో నీటి కష్టాలను ఎదుర్కొంటున్నవి. నీటి యుద్ధాలనే చేస్తున్నవి. దూరదృష్టి లేమి వల్ల తమనెన్నుకున్న ప్రజల పట్ల పాలకులకు దృక్పథం లేకపోవడం వల్ల సమస్యలు. ఒకప్పుడు వేలాది చెరువులతో అలరారిన చెన్నపట్నం (చెన్నై) నీటిని రైళ్లల్లో తెచ్చుకొని తన దాహార్తిని తీర్చుకుంటుంది. మహారాష్ట్ర, గుజరాత్‌లో అనేక ప్రాంతాలు ఎండకాలం వచ్చిందంటే వేలాది కోట్లను నీటి కోసం ఖర్చు చేస్తున్నది. నీటి రవాణాకు, అదీ తాగునీటి రవాణాకు అందుబాటులో ఉన్న అన్నీ వ్యవస్థలను వినియోగించి ప్రజలకు తాగేందుకు నీళ్లిచ్చే ప్రయత్నం చేస్తున్నది.

వాటర్‌మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్ తెలంగాణ సర్కార్ చేపట్టిన చెరువుల పునరుద్ధరణ (మిషన్ కాకతీయ) లోని అంతస్సూత్రాన్ని లోకానికే చెబితేకానీ తెలంగాణేతర రాష్ర్టాలకు కనువిప్పు కాలేదు. రాజేంద్రసింగ్ మిషన్‌కాకతీయ పనులను స్వయంగా పరిశీలించి తన పుట్టినరోజు వేడుకను చెరువుకట్ట మీదే జరుపుకున్నడు. అది వరంగల్ రూరల్ జిల్లా నెక్కొండ చెరువుకట్ట మీద. తను నీటి కష్టాలు తెలుసు. తన సొంతగడ్డ (రాజస్థాన్) ఎదుర్కొన్న నీటి కష్టాలను స్వయంగా చూసినవాడు కనుక, ఎడారిలోనూ నీటికయ్యల్ని సృష్టించినవాడు కనుక నీటి కష్టం అతనికి తెలుసు. తన ప్రాంతంలో పంచ నదులు (ఆరావళి, రూప్‌రేల్, సర్స, భగని, జహర్‌వాలీ) పారుతున్నా తన ప్రజలు తాగేందుకు నీరులేని దుస్థితిని గమనించి అందుబాటులో ఉన్న శాస్త్ర విజ్ఞానం కన్నా మానవ వనరులను సమష్టిగా చిత్తశుద్ధితో వినియోగించి భాగస్వామ్యం చేయడం వల్ల నీటి కరువును అధిగమించాడు. ఆ కష్టాలు ఎట్లా ఉంటాయో తనకు తెలుసు. తనూ 'తరుణ్ భారత్ సంఘ్' ద్వారా ఎడారి రాష్ట్రంలో అనేక ఎదురుదెబ్బలు తిన్నారు. మొదట్లో అందరూ ఏవేవో అంటారు వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదు. నేనేమీ పాలకుడిని కాదు. నాకున్న పరమిత ప్రాంతానికి పరిమిత వనరులను వినియోగించుకొని పనులు చేస్తేనే ఎంతోమంది నా పట్ల వ్యతిరేకతను చాటుకున్నారు. నా మీద ఎదురుదాడి చేశారు. నేను తెలంగాణను చూసినప్పుడు అదే జరుగుతున్నది. అదృష్టవశాత్తు ఇక్కడ పాలకుడే పాలకడలిని సృష్టిస్తున్నారు. కనుక స్వపక్ష, విపక్షాలకు మింగుడు పడదు సరికదా! దుమ్మెత్తి పోస్తారు. కానీ వెనక్కి తిరిగిచూస్తే ఏమీ కనిపించదు. ఆ ఏమీ కనిపించని శూన్యం నుంచే తెలంగాణ లేచి నీటివిప్లవాన్ని సృష్టిస్తున్నదని రాజేంద్రసింగ్ పేర్కొన్న మాట అక్షరసత్యం. చెరసాల నుంచి చెరువులు విముక్తమై ఆ చెరువుల్లో గోదారి నీళ్లు ఒదిగిపోతున్నాయి. చెరువుల కింద రైతాంగం మురిసిపోతున్నది. ఒకప్పుడు వలసెల్లిపోయిన జనులందరూ తాము పుట్టినగడ్డకు తిరిగివస్తున్నరు.

తెలంగాణ రాకముందు తెలంగాణ ఆట, ఆంధ్రా ఆట ఆంధ్రానే ఆడేది. ఇప్పుడు రాష్ట్రం ఏర్పడ్డాక కూడా అదే విధానం కొనసాగాలా? మా ఆట మేమే ఆడుతాం. మీ ఆట కూడా మేమే ఆడతామంటే ఎలా? అసలు తెలంగాణ ఏర్పడితే నీటి కష్టాలు తప్పవు. కరెంట్ కష్టాలు మిమ్మల్ని కటిక చీకట్లోకి నెట్టివేస్తాయని శాపనార్థాలు పెట్టినవాళ్లకు రుచించదు తెలంగాణ జల విప్లవ ప్రభావం. తెలంగాణ ఇవ్వాళ తనను తాను నిర్మించుకుంటున్నది. తన ఎవుసం తను చేసుకుంటున్నది. తెలంగాణ వాళ్లకు కేవలం రోడ్లెక్కి ఉద్యమాలు చేయడం మినహా పాలించుకోవడం వారికేం ఎరుక అని నీల్గినవాళ్లు వాళ్ల వాళ్ల నాల్కలలను కరచుకునే అద్భుత సందర్భాన్ని తెలంగాణ ఆవిష్కరించింది. అది కాళేశ్వరం రూపంలో గోదారి సాక్షిగా పరశించి పాలించుకుంటుంది. గోదావరి, కృష్ణాబేసిన్‌లు ఒక్కటైపోతున్నాయి. ఈ దృశ్యం కంటగింపు కానీ కన్నులు కండ్లల్లో నిప్పులు పోసుకుంటున్నరు. ఒకప్పుడు తెలంగాణ ప్రాజెక్టులంటే అంతర్రాష్ట్ర వివాదాలు, పర్యావరణ హేతువులు, అటవీశాఖ అడ్డుపుల్లలు, సీడబ్ల్యూసీ క్లియరెన్స్‌లు రాని దుస్థితి. వీటన్నింటినీ దాటుకొని దేశంలోనే అన్నిరకాల అనుమతులు తెచ్చుకొని రికార్డు స్థాయిలో కాళేశ్వరం తెలంగాణ అంతటా కడలిని సృష్టించడం అవతలివాళ్లకు కంటగింపుగాక మరేమవుతుంది. ఇంతకాలం ఏవేవో ముచ్చట్లు చెప్పినవాళ్లకు ఇప్పుడు కొత్తగా కరెంట్ భూతాన్ని అంటగడుతున్నారు. కరెంటే రాదని చెప్పినవాళ్లకు గింత కరెంట్ బిల్లు ఎట్లా కడుతారని కొత్తరాగం తీయడం కొత్త వైచిత్రి. అవతలివాళ్లు ఎంత నీల్గినా నీళ్ల గురించి తెలిసిన ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనికతను, అతని పట్టుసడలని విక్రమార్క పంతం కనుకనే వేటినీ పట్టించుకోలేదు. జంగం పొంగ కుక్కలు మొరుగుతాయంటరు తెలంగాణకు ఇవ్వాళ కేసీఆర్ కాళేశ్వర జంగమయ్య అయిండు. జనం గుండెల్లో జీవనాదమై వెలుగుతుండు. తెలంగాణ, తెలంగాణ సరిహద్దు రాష్ర్టాలైన ఛత్తీస్‌గఢ్, మహారాష్ర్టలకు మేడగడ్డ, అన్నారం, కాళేశ్వర ప్రాజెక్టుల వంతెనల నిర్మాణాలతో అంతర్రాష్ట్ర ప్రజలకు సంఘీభావ వంతెన నిర్మించారు.

**ఒకప్పుడు తెలంగాణ ప్రాజెక్టులంటే అంతర్రాష్ట్ర వివాదాలు, పర్యావరణ హేతువులు, అటవీశాఖ అడ్డుపుల్లలు, సీడబ్ల్యూసీ క్లియరెన్స్‌లు రాని దుస్థితి. వీటన్నింటినీ దాటుకొని దేశంలోనే అన్నిరకాల అనుమతులు తెచ్చుకొని రికార్డు స్థాయిలో కాళేశ్వరం తెలంగాణ అంతటా కడలిని సృష్టించడం అవతలివాళ్లకు కంటగింపుగాక మరేమవుతుంది. ఇంతకాలం ఏవేవో ముచ్చట్లు చెప్పినవాళ్లకు ఇప్పుడు కొత్తగా కరెంట్ భూతాన్ని అంటగడుతున్నారు.**

**(వ్యాసకర్త: 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక ప్రతినిధి, వరంగల్)**



నాలో ఎన్నో ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. కానీ ఒక్కదానికీ జవాబు దొరుకడం లేదు. జమ్ము కశ్మీర్ తో సంబంధం ఉన్న కొందరు ఉన్నత స్థానాల్లో ఉన్నవారిని కలిశాను. వీరిలో ఒక్కరు కూడా ఏమీ చెప్పలేకపోతున్నారు. ఆరేండ్ల పాటు సీఎంగా ఉన్న నా పరిస్థితే ఇట్లా ఉంటే ఇక ఏది నమ్మాలో తెలువని సాధారణ కశ్మీరీ సంగతి ఊహించుకోవచ్చు.

**ఒమర్ అబ్దుల్లా**



కశ్మీర్‌లో ఏమవుతున్నదో నాకు తెలువదు. కానీ ఆ రాష్ర్టాన్ని మూడు ముక్కలు చేస్తారన్న వదంతులను మాత్రం నమ్మలేను. కేంద్రంలో ఏ ప్రభుత్వమైనా సరే ఆ పని చేయదు.

**బర్ఖాదత్**



'ఉన్నావ్ కే బేటీ'కి మద్దతుగా వచ్చిన లక్నోలోని బాలికలకు కృతజ్ఞతలు. మనమంతా ఒక్కటిగా నిలబడితే, ఒత్తిడి తెచ్చి, లైంగికదాడికి పాల్పడుతున్నవారికి, ఇతర నేరస్థులకు మద్దతు ఇస్తున్నవారి మనసులు మారుతాయి.

**ప్రియాంకా గాంధీ వాద్రా**



ఉగ్రవాదుల దాడి జరుగవచ్చు, కశ్మీర్ లోయ నుంచి వెంటనే వెళ్ళిపొండని అమర్‌నాథ్ యాత్రికులను ప్రభుత్వం హెచ్చరించింది. ఈ హెచ్చరికల వార్తల నేపథ్యంలో ఆర్థిక పరిస్థితికి సంబంధించిన అసలు హెచ్చరిక మరుగున పడిపోతున్నది.

**రాజ్‌దీప్ సర్దేశాయ్**

# మీడియా నుంచే విముక్తి

విశ్లేషణ



రవీశ్ కుమార్

ఈ కాలంలో భయం నుంచి విముక్తి పొందాలంటే ప్రధాన స్రవంతి మీడియా నుంచి పొందడంగానే చెప్పవచ్చు. ఏదైతే ఆమోదయోగ్యం కాదని, అనైతికమని ఇంత కాలం భావించామో దానినే గత ఐదేండ్లలో ప్రధాన స్రవంతి మీడియా నైతికమైందిగా, ఆమోదనీయమైందిగా మార్చివేసింది. ఈ నీతి బాహ్యతను మీడియా ఘనంగా ప్రదర్శిస్తున్నది. ఈ అనౌచిత్యాన్ని పరాకాష్టకు తీసుకుపోతున్నది. ప్రధాన స్రవంతి మీడియా వ్యవహరిస్తున్న ఈ మొరటు వైఖరి వల్ల ఇప్పటివరకు నెలకొన్ని ప్రజాస్వామిక సంప్రదాయాలు నాశనమైపోతున్నాయి. ఈ మొరటుదనం ఇక ఏ మాత్రం తప్పు కాదు. అది వీధిలో కానీ, వార్తా చానెల్స్ స్టూడియోలలో కానీ. ఇది ఒక టీవీ చానెల్ లేదా ఒక ఆంకర్ చేస్తున్న పనికాదు. వందలాది టీవీ చానెల్స్ వ్యవహరిస్తున్న తీరు ఇది. ఏదోఒక చానెల్ భిన్నంగా ఉండవచ్చు. కానీ మొత్తంగా చూస్తే ఈ చానెల్స్ ప్రమాణాలను పతనమొనర్చడంలో ముందుంటున్నాయి. మీడియా, రాజకీయాలు కలిసిపోవడం వల్ల ఈ దిగజారుడుతనం వచ్చింది. రాజకీయ మద్దతుదారు మాత్రమే ప్రేక్షకుడు అని మీడియా భావిస్తున్నది. మీడియాను పోషిస్తున్నవారు, వినియోగదారులు ఏదో ఒక రాజకీయ భావజాలానికి కట్టుబడి ఉన్నవారు కావడంతో వీక్షకుడికి, రాజకీయ పార్టీ మద్దతుదారుకు మధ్య రేఖ చెరిగిపోయింది. ఏదోఒక రాజకీయ మద్దతుదారులే వీక్షకులుగా మారిపోవడంతో వార్తలలో వైవిధ్యం లేకుండాపోయింది. ఈ వీక్షక-రాజకీయ మద్దతుదారులను సమాచారరహిత గుంపులుగా చెప్పుకోవచ్చు. దీనిని తీవ్రమైన విషయంగా పరిగణించాలె. అభ్యసనం స్థానంలో అజ్ఞానం చోటుచేసుకుంటే ఏదో నవ్వులాటగా భావించవద్దు.

ఈ వీక్షకుల గుంపును సమాచార రహితమైందిగా పరీక్షించి చెప్పవచ్చు. ఉదాహరణకు పుల్వామా దాడి తర్వాత పరిస్థితినే చూద్దాం. ప్రధాని మౌనంపై చర్చ సాగదు. దీనిపై సచిన్ టెండూల్కర్ ఎందుకు మాట్లాడలేదనే చర్చ నడుస్తుంది. మీడియా విస్తరించడంతో సమాచార విస్తరణ జరుగుతుందని భావించడమే మనం చేసిన తప్పు. కానీ అట్లా జరుగలేదు. వైవిధ్యభరిత అంశాలకు స్థానం లేకుండా చేయడంతో సమాచారం అందకుండా పోయింది. దీంతో సమాచార రహిత పరిస్థితి ఏర్పడ్డది. ప్రధాన స్రవంతి మీడియా విస్తరించే కొద్దీ జరిగింది ఇదే. ఈ మీడియా ఐదేండ్లుగా నడుపుతున్న 'జాతీయ పాఠ్యాంశం' ప్రాజెక్టు ఉద్దేశం ఏమిటో మొదట్లోనే అర్థమైంది. మీలోని (ప్రశ్నించే) వీక్షకుడిని మాయం చేయడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఈ విధంగా చేయ డం వల్లనే ప్రజాస్వామ్యాన్ని హత్య చేయకుండా లోబరుచుకోవడం సాధ్యం. ఈ క్రమంలో వీధుల్లో రక్తం ప్రవహిస్తుందనేది వేరే విషయం. వీధి మూకలు ఎవరిని వదిలిపెట్టడం లేదు- సుబోధ్‌కుమార్ సింగ్‌ను కానీ, అఖ్లాక్‌ను కానీ. ఈ వ్యవస్థ చేపట్టిన జాతీయ పాఠ్యాంశం ప్రభా వం ఇంత బలంగా ఉన్నది మరి. ఈ ప్రాజెక్టు విజయవంతమైందనే నమ్ముతున్నా. మన ప్రజాస్వామ్యాన్ని, పౌరులుగా, ప్రజలుగా మన ఆత్మ ను ముంచెత్తింది!

2014లో మోదీ ప్రభుత్వం ఏర్పడగానే మీడియా ఈ జాతీయ పాఠ్యాంశం ప్రాజెక్టును మొదలుపెట్టింది. హిందు-ముస్లిం విభజన సాగించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఈ లక్ష్యం నెరవేరాలంటే ప్రజలలో విభజన భావనను పెంచాలె. ఈ క్రమంలో మీడియా ప్రజలలోని పౌరసత్వ స్పృహనే దెబ్బతీయ యత్నిస్తున్నది. పౌరసత్వానికి సమాచా రం, ప్రశ్నించడం అనేవి భూమిక కనుక ఆ అవకాశాలనే దెబ్బతీసింది. మన మీడియా ప్రభుత్వాన్ని ప్రశ్నించదు. అందుకు విరుద్ధంగా ప్రభు త్వం తరపున ప్రజలనే ప్రశ్నలతో వేధిస్తుంది. పుల్వామా దాడి తర్వాత మీడియా అనుసరించిన రాజకీయ పంథా ఇదే. పౌరుల్లో నుంచే శత్రువులను సృష్టిస్తుంది. ఇందుకోసం అరకొర సమాచారాన్ని వండివారుస్తూ 'హిందూ నైరాశ్యం', 'ముస్లిం నైరాశ్యం' అనే భావోద్వేగాలను మనలో కల్పిస్తుంది. ఈ నైరాశ్యం అంతకుముందు కూడా ఉంటుంది. కానీ దానిని భూతద్దంలో చూపించి ప్రతిష్ఠిస్తుంది. నేటి మీడియా ప్రజల మీడియా కాదు. హిందు మతం పేర రాజకీయాలు ఆడేవారి మీడియా. ఈ హిందుత్వ మీడియా ప్రధాన స్రవంతి మీడియాలో తొంభై శాతాన్ని ఆక్రమించుకుంటుందని ఐదేండ్ల కిందట ఊహించామా?

గతంలో పౌరులు తమకు తాము హిందువులమని అనుకోలేదని కాదు. కానీ ఇప్పుడు ఒక కొత్తరకమైన రీతిలో హిందువులుగా భావించుకుంటున్నారు. ధైర్యం కోల్పోయి పక్కవారంటే భయపడిపోతున్నా రు. పక్కవారిని అనుమానంగా, హిందువుగా లేదా హిందు-వ్యతిరేకిగా చూస్తున్నారు. ఇంకా చెప్పాలంటే, దేశ వ్యతిరేకిగా చూస్తున్నారు. ఒక హిందువు మిగతా హిందువుల వల్ల భయపడటాన్ని మొదటిసారి చూస్తున్నా. ఎంతో ఉన్నతమైనవనీ, నిరంతరం ప్రశంసించబడే హిందు సంప్రదాయాలకు విరుద్ధమైన పరిస్థితి ఇది. ఆగ్రహం వల్ల మంచి చెడు విచక్షణను కోల్పోతామని భగవద్గీత బోధించింది. కానీ న్యూస్ ఆంకర్లు మాత్రం అదే మత ముసుగులో అరిచి గీపెడుతుంటారు.

మన ప్రధాన స్రవంతి మీడియా, సోషల్ మీడియా కలిసికట్టుగా ఒక కొత్త భక్తుడిని సృష్టించిపెట్టాయి. లేదా ఈ భక్తులే మీడియాను ఈ విధంగా మారడానికి తోడ్పడి ఉంటారు! ఈ పరిస్థితుల్లో ప్రతి పౌరుడు ఒక కబీర్ మాదిరిగా, ఒక రవిదాస్‌గా మారాలె. నాటుకుపోయిన మతాచారాలను, ప్రభుత్వ వ్యవహారాలను ప్రశ్నించాలె. రవిదాస్ లేకుండా పవిత్రమైన మనసును, హృదయాన్ని ఊహించుకోలేము. కానీ ఇప్పుడు పరిస్థితి ఎట్లా మారిందంటే-గంగలో మునిగితేనే నీ మతాన్ని రుజువు చేసుకోగలవు. సచిన్ టెండూల్కర్ తన దేశభక్తిని నిరూపించుకోవాలంటే ఏదో ఒక న్యూస్ చానెల్‌కు వెళ్ళి మాట్లాడాలె! ఈ ప్రధాన స్రవంతి మీడియా భారతీయ సంప్రదాయాలన్నిటికి విరుద్ధం. సమాచారం పట్టని భక్తుడిని తయారుచేయడమే ఈ మీడియా లక్ష్యం. సమాచారం ఉండవద్దు, దయాదాక్షిణ్యాలు కూడా ఉండకూడదు! ఇదే ఇప్పటి ప్రజాస్వామ్య లక్షణమైపోయింది. ప్రజాస్వామ్య భూమికనే మార్చివేశారు. మీరే ఏదైనా ప్రశ్నిస్తే ఏదైనా ముద్ర వేస్తారు.ఇదే ప్రజాస్వామ్య అంతానికి ఆరంభం.

**'హిందు నైరాశ్యం' నింపడానికి మీడియా ముస్లింలు అంటే భయపడే మానసిక స్థితిని సృష్టిస్తున్నది. ఈ విధానంపైనే మొత్తం జాతీయ పాఠ్యాంశం ప్రాజెక్టు నిర్మాణమై ఉన్నది. హిందువులలో ఎట్లాగైతే సృష్టిస్తున్నారో, అదే రీతిలో ముస్లింలలో కూడా భయాందోళనలు సృష్టించడం ఈ ప్రాజెక్టు అంతిమ లక్ష్యం. ప్రభుత్వ తీరు తెన్నులను ఎట్లాగైతే హిందువులు ప్రశ్నించడం ఆపివేశారో, ముస్లింలు కూడా భయం కొద్దీ అదేవిధంగా మారారు.**

'హిందు నైరాశ్యం' నింపడానికి మీడియా ముస్లింలు అంటే భయపడే మానసిక స్థితిని సృష్టిస్తున్నది. ఈ విధానంపైనే మొత్తం జాతీయ పాఠ్యాంశం ప్రాజెక్టు నిర్మాణమై ఉన్నది. హిందువులలో ఎట్లాగైతే సృష్టిస్తున్నారో, అదే రీతిలో ముస్లింలలో కూడా భయాందోళనలు సృష్టించడం ఈ ప్రాజెక్టు అంతిమ లక్ష్యం. ప్రభుత్వ తీరు తెన్నులను ఎట్లాగైతే హిందువులు ప్రశ్నించడం ఆపివేశారో, ముస్లింలు కూడా భయం కొద్దీ అదేవిధంగా మారారు. ప్రశ్నించడం నిలిపివేయడమే కాదు, సమాజంలో విభజన పెరుగుతున్నదనే భయం కొద్దీ రాజకీయ ప్రాతినిధ్యాన్ని వదులుకొంటున్నారు. బీజేపీ తప్ప మిగతా రాజకీయపక్షాలు కూడా ఇదే భయం కొద్దీ ప్రశ్నించడం మానుకున్నాయి. ప్రతి ఒక్కరు భయపడుతున్న ఒక భీతిగొన్న భారతం నా కండ్ల ముందు కనబడుతున్నది. ఇప్పటికైనా మనం మన పౌరులమనే స్పృహను తిరిగి పొందాలె. లేకపోతే దాదాపు శతాబ్దం పాటు పోరాడి సాధించుకొని భారత్‌ను కోల్పోవలసి వస్తుంది. ఈ భయం నుంచి హిందువులు, ముస్లింలు విముక్తి పొందాలె. ఇది జరుగాలంటే మొదట ప్రధాన స్రవంతి మీడియా నుంచి విముక్తి పొందాలె. రాజకీయ నాయకుల ప్రసంగాలు, న్యూస్ ఆంకర్ల ఆగ్రహ ప్రదర్శన, టీవీ స్క్రీన్లపై కనిపించే నినాదాలు, వాట్సాప్‌లలో వాడుతున్న భాష మొదలైనవన్నీ- ఒకవిధమైన మానసిక స్థితిని సూచిస్తున్నాయి. ఈ మానసిక స్థితిని ప్రతిబింబించకపోతే సచిన్ టెండూల్కర్ దేశ ద్రోహిగా కనిపిస్తాడు. పచ్చి మూర్ఖత్వాన్ని, మోటుతనాన్ని, అమర్యాదను ఒక ఆదాయ మార్గంగా, వ్యాపారంగా మలుచుకోవచ్చని ఈ ప్రధాన స్రవంతి మీడియా రుజువు చేసింది.

మీడియా తీరుతెన్నులను ఎవరూ సవాలు చేయడం లేదని కాదు. కొందరు యూట్యూబ్ ద్వారా ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు.ఈ పోరాటాలన్నీ చిన్నస్థాయిలోనే ఉన్నాయి. ఇవి అంతకంతకూ పెరుగుతాయనే ఆశ కలుగుతున్నది. నేటి మీడియా ప్రజాస్వామ్య నాలుగో స్తంభం కాదు. రాజకీయ పార్టీకి మొదటి స్తంభం. మోదీ, బీజేపీ మూలంగా దేశంలో ఒక వెన్నెముక లేని ప్రధాన స్రవంతి మీడియా ఏర్పడ్డది.

**(రచయిత: ఎన్డీటీవీ ఆంకర్. ఇటీవల రామన్ మెగసేసే అవార్డు రావడానికి ముందు రాసిన వ్యాసం) 'ది వైర్' సౌజన్యంతో..**

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

# భద్రత కోసమే అదనపు బలగాలు

- స్వయం ప్రతిపత్తి రద్దు, రాష్ట్ర విభజన వంటివాటిపై సమాచారం లేదు: గవర్నర్
- పార్లమెంట్‌లో ప్రకటన చేయాలి: ఒమర్ అబ్దుల్లా



సత్యపాల్ మాలిక్

**శ్రీనగర్/జమ్ము/న్యూఢిల్లీ, ఆగస్టు 3:** జమ్ముకశ్మీర్‌లో భద్రత కోసమే అదనపు బలగాలను మోహరిస్తున్నామని గవర్నర్ సత్యపాల్ మాలిక్ స్పష్టం చేశారు. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని అందించే రాజ్యాంగ అధికరణలను రద్దుపై తనకు ఎలాంటి సమాచారం లేదని చెప్పారు. వారం వ్యవధిలో రాష్ట్రానికి 38 వేల అదనపు భద్రతా బలగాలను తరలించడంపై మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా నేతృత్వంలో నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) పార్టీకి చెందిన ప్రతినిధుల బృందం శనివారం గవర్నర్‌ను కలిసింది. కేంద్రం ఆర్టికల్స్ 370, 35-ఏను రద్దు చేయడం, జమ్ముకశ్మీర్‌ను మూడు రాష్ట్రాలుగా విభజించడం వంటి చర్యలు చేపట్టబోతున్నదని ప్రజలు ఆందోళన చెందుతున్నారని వారు గవర్నర్‌కు వివరించారు. ఈ సందర్భంగా సత్యపాల్ మాలిక్ స్పందిస్తూ అమర్‌నాథ్ యాత్రికులే లక్ష్యంగా భారీ ఉగ్రదాడికి ఉగ్రవాదులు కుట్ర పన్నారని పక్కా సమాచారం ఉన్నదని చెప్పారు. ఈ నేపథ్యంలో భద్రతను పెంచడంతోపాటు ధీటుగా స్పందించేందుకు అదనపు బలగాలను మోహరించామని చెప్పారు. వదంతులు నమ్మి ప్రజలు ఆందోళన చెందొద్దని పిలుపునిచ్చారు.

**గవర్నర్ మాటే అంతిమం కాదు: ఒమర్ అబ్దుల్లా**

గవర్నర్‌తో భేటీ అనంతరం మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా మీడియాతో మాట్లాడారు. 'ఆర్టికల్స్ 370, 35-ఏ రద్దు, రాష్ట్రాన్ని విభజించడం వంటి ఆలోచన లేదని గవర్నర్ మాకు హామీ ఇచ్చారు. కానీ జమ్ముకశ్మీర్ విషయంలో ఆయన మాటే అంతిమం కాదు కదా' అని పేర్కొన్నారు. ఈ అంశంలో కేంద్ర ప్రభుత్వం సోమవారం పార్లమెంట్‌లో స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.



ఒమర్ అబ్దుల్లా

> పీడీపీ, ఎన్సీ పార్టీల నేతలు అసత్య ప్రచారం చేస్తూ జమ్ముకశ్మీర్ ప్రజల్లో భయాన్ని పెంచుతున్నారు. కొందరు నేతలు అర్ధరాత్రి గవర్నర్ ఇంటికి వెళ్లివచ్చి ఏదో జరుగబోతున్నట్టు హడావుడి చేస్తున్నారు. ఆర్టికల్స్ 370, 35ఏలను రద్దు చేస్తారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మోదీ పాలనపై ప్రజలకు నమ్మకం ఉన్నది.
>
> -రవీందర్ రైనా, జమ్ము బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

> గతంలో ఎన్నడూ అమర్‌నాథ్ యాత్రను అర్ధంతరంగా రద్దు చేయలేదు. ప్రభుత్వ ప్రకటనతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కశ్మీర్‌లో ప్రస్తుత పరిస్థితిపై, అక్కడికి అదనపు బలగాలను ఎందుకు మోహరించాల్సి వచ్చిందో ప్రధాని వెంటనే పార్లమెంట్‌లో వివరించాలి.
>
> - గులాం నబీ ఆజాద్, కాంగ్రెస్ సీనియర్ నేత




# తిరుగుముఖం

## కశ్మీర్‌ను వదిలివెళ్తున్న పర్యాటకులు, అమర్‌నాథ్ యాత్రికులు

- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన పర్యాటక శాఖ
- రంగంలోకి వాయుసేన విమానాలు
- కిక్కిరిసిన బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలు
- సరిపడా వాహనాలు అందుబాటులో లేక ప్రయాణికుల అవస్థలు



స్వస్థలాలకు తిరిగి వెళ్లడానికి జమ్ము రైల్వేస్టేషన్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

**శ్రీనగర్, ఆగస్టు 3:** అమర్‌నాథ్ యాత్రికులు, పర్యాటకులు జమ్ముకశ్మీర్‌ను విడిచి వెళ్తున్నారు. అమర్‌నాథ్ యాత్రికులే లక్ష్యంగా ఉగ్రవాదులు భారీ దాడికి కుట్ర పన్నారని తేలడంతో కేంద్ర ప్రభుత్వం యాత్రను రద్దు చేస్తున్నట్టు శుక్రవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. యాత్రికులు, పర్యాటకులు వెంటనే రాష్ట్రం విడిచివెళ్లాలని సూచించడంతో అంతా తిరుగుముఖం పట్టారు. వారిని స్వస్థలాలకు తరలించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది. అయితే సరిపడా విమానాలు, బస్సులు అందుబాటులో లేక అవస్థలు పడుతున్నారు.

**ప్రత్యేక ఏర్పాట్లు**

అమర్‌నాథ్ యాత్రను రద్దు చేస్తున్నట్టు ప్రభుత్వ ప్రకటన వెలువడిన వెంటనే రాష్ట్ర పర్యాటకశాఖ తమ సిబ్బందిని అప్రమత్తం చేసింది. వివిధ పర్యాటక ప్రాంతాల్లోని యాత్రికులను, పర్యాటకులను శ్రీనగర్‌కు తీసుకొచ్చేందుకు బస్సులను పంపినట్టు టూరిజం శాఖ డైరెక్టర్ నిస్సార్ వనీ తెలిపారు. 'వివిధ పర్యాటక ప్రాంతాల్లో ఉన్న యాత్రికులను శ్రీనగర్‌కు తీసుకురావడం, రాష్ట్రాన్ని దాటించడానికి తగిన ఏర్పాట్లు చేశాం. శుక్రవారం రాష్ట్రంలో 20వేల నుంచి 22వేల మంది వరకు పర్యాటకులు ఉన్నారు. వారిలో అత్యధికశాతం మంది ఇప్పటికే శ్రీనగర్‌కు చేరుకున్నారు. కొందరు రాష్ట్రాన్ని వదిలివెళ్లగా.. కొందరు మాత్రం ఇంకా ఇక్కడే ఉన్నారు' అని చెప్పారు. శ్రీనగర్‌లోని వివిధ హోటళ్లలో బసచేసిన ప్రయాణికులను శనివారం విమానాశ్రయానికి తరలించి, అందుబాటులో ఉన్న విమానాల్లో పంపించివేసినట్టు చెప్పారు. దాదాపు 300 మందిని భారత వాయుసేన విమానాల్లో తరలించినట్టు వెల్లడించారు. యాత్రికులు, పర్యాటకులు తిరుగుముఖం పట్టడంతో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలు కిక్కిరిసిపోయాయి. సరిపడా వాహనాలు లేక గంటలపాటు ఎదురుచూడాల్సి వచ్చింది. అమర్‌నాథ్‌యాత్ర రద్దు నేపథ్యం లో ఈనెల 15వ తేదీ వరకు టికెట్లు బుక్ చేసుకున్న యాత్రికులకు డబ్బు తిరిగి ఇచ్చేయాలని విమానయాన సంస్థలు నిర్ణయించాయి. మరోవైపు బ్రిటన్, జర్మనీ దేశాలు తమ పౌరులకు హెచ్చరికలు జారీచేశాయి. జమ్ముకశ్మీర్‌కు వెళ్లాలనుకునేవారు ప్రయాణాన్ని వాయిదా వేసుకోవాలని సూచించాయి.

**అధికారుల సెలవులు రద్దు**

జమ్ముకశ్మీర్ రాష్ట్రంలోని అన్నిస్థాయిల అధికారుల సెలవులను ప్రభుత్వం రద్దు చేసింది. సమాచారం ఇవ్వకుండా ఎవరూ సెలవు పెట్టవద్దని స్పష్టంచేసింది. అధికారులు ఎట్టిపరిస్థితుల్లోనూ సెల్‌ఫోన్లను స్విచ్ఛాఫ్ చేయకూడదని ఆదేశించింది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా త్వరలో జమ్ముకశ్మీర్‌లో పర్యటిస్తారని సమాచారం.

**పర్యాటకులు.. వ్యాపారుల అసంతృప్తి**

మంచు శివలింగాన్ని దర్శించుకుందామని, కుటుంబంతో సరదాగా గడుపుదామని కశ్మీర్‌కు వచ్చిన యాత్రికులు, పర్యాటకులు.. మధ్యలోనే తిరుగుముఖం పట్టాల్సిరావడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదనుగా విమానాలు, ప్రైవేట్ వాహనాల ప్రయాణ చార్జీలు పెంచారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో వ్యాపార వర్గాలు నష్టపోయాయని కశ్మీర్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ తెలిపింది. మరోవైపు శ్రీనగర్ నిట్‌లో తరగతులను రద్దుచేశారు.



శ్రీనగర్ బేస్ క్యాంప్ నుంచి తిరుగు ప్రయాణమైన అమర్‌నాథ్ యాత్రికులు

### మచేల్ మాతా యాత్ర రద్దు

భద్రతాకారణాల నేపథ్యంలో అమర్‌నాథ్ యాత్రను రద్దు చేసిన ప్రభుత్వం.. 'మచేల్ మాతా యాత్ర'ను కూడా రద్దు చేస్తున్నట్టు శనివారం ప్రకటించింది. కిస్త్‌వాడ్ జిల్లా మచేల్ గ్రామంలోని కొండ ప్రాంతంలో దాదాపు 30 కి.మీ.ల ఎత్తున ఉన్న దుర్గామాతను దర్శించుకునేందుకు ఏటా 43 రోజులపాటు 'మచేల్ మాతా యాత్ర' నిర్వహిస్తుంటారు. గత నెల 25న ప్రారంభమైన ఈ యాత్ర సెప్టెంబర్ 5 వరకు కొనసాగాల్సి ఉన్నది. అయితే భద్రతా కారణాల నేపథ్యంలో యాత్రను రద్దు చేస్తున్నామని కిస్త్‌వాడ్ డిప్యూటీ కమిషనర్ అంగ్రేజ్ సింగ్ రాణా తెలిపారు.

# స్వయంప్రతిపత్తి.. సంగతేమిటి?

జమ్ముకశ్మీర్‌లో భారీ ఎత్తున కేంద్ర బలగాలను మోహరిస్తుండడం, అమర్‌నాథ్ యాత్రికులు, పర్యాటకులు తక్షణమే కశ్మీర్ లోయను విడిచి వెళ్లాలని ప్రభుత్వం సూచించిన నేపథ్యంలో రాష్ట్రంలో ఏం జరుగబోతున్నదనే దానిపై అందరిలోనూ తీవ్ర ఉత్కంఠ నెలకొన్నది. రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తి, ప్రత్యేక హక్కులు కల్పించే అధికరణలు 370, 35ఏలను కేంద్రం రద్దు చేయబోతున్నదని జోరుగా ప్రచారం జరుగుతున్నది. వీటిని రద్దు చేస్తే రాష్ట్రంలో కల్లోల పరిస్థితులు ఏర్పడుతాయని ఆ రాష్ట్ర రాజకీయ పక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్టికల్ 370, 35ఏల గురించి వివరాలు..



షేక్ అబ్దుల్లా, నెహ్రూ

## జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేకతను కల్పిస్తున్న ఆర్టికల్ 370, 35ఏ

**చారిత్రక నేపథ్యం..**

1947లో భారత్, పాకిస్థాన్ విడిపోయినప్పటికీ.. జమ్ము కశ్మీర్ ఏ దేశంలోనూ చేరకుండా స్వతంత్రంగా ఉంది. ఆ ఏడాది అక్టోబర్ 20న పాకిస్థాన్‌లోని గిరిజన తెగలు ఆ దేశ సైన్యం సాయంతో కశ్మీర్‌పై దండయాత్ర చేశాయి. దీంతో కశ్మీర్ మహారాజు హరిసింగ్ సైనికసాయం చేయాలని భారత్‌ను కోరారు. కశ్మీర్‌ను భారత్‌లో విలీనం చేయాలన్న భారత ప్రభుత్వ షరతుకు అంగీకరించారు. భారతసైన్యం పాక్ శక్తులను తరిమికొట్టింది. అప్పటికే కశ్మీర్‌లోని 1/3 వంతు భూభాగాన్ని పాకిస్థాన్ ఆక్రమించుకుంది. దీన్నే పాక్ ఆక్రమిత కశ్మీర్‌గా పిలుస్తున్నాం. జమ్ము కశ్మీర్‌ను భారత్‌లో కలుపుతూ అక్టోబర్ 26న భారత ప్రభుత్వంతో హరిసింగ్ ఒప్పందం కుదుర్చుకున్నారు. కాగా, జమ్ము కశ్మీర్ ప్రజల కోరిక మేరకు ప్రత్యేక రాజ్యాంగాన్ని రూపొందించుకోవడానికి భారత్ అంగీకరించింది. రాజ్యాంగ పరిషత్తు నిర్ణయం మేరకు మహారాజా హరిసింగ్ వైదొలిగి రాష్ట్ర ప్రజల ప్రజాస్వామిక ఉద్యమ నేత, నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత షేక్ మహమ్మద్ అబ్దుల్లాకి పగ్గాలు అప్పగించారు. షేక్ అబ్దుల్లా ప్రధానిగా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశారు. 1949లో ఆయన కేంద్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు 370వ అధికరణను భారత రాజ్యాంగంలో పొందుపరిచారు. అనంతరం 1954లో నెహ్రూ ప్రభుత్వం సూచన మేరకు రాష్ట్రపతి ఉత్తర్వుతో 35ఏ అధికరణను రాజ్యాంగంలో పొందుపరిచారు. జమ్ము కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి, హక్కులు కల్పిస్తున్న ఈ అధికరణలను తొలిగించాలని బీజేపీ యోచిస్తున్నది. లోక్‌సభ ఎన్నికల సమయంలో తమ మేనిఫెస్టోలోనూ హామీ ఇచ్చింది.

**ఆర్టికల్ 370**

- జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తున్నది.
- రక్షణ, ఆర్థిక, విదేశాంగ, సమాచార వ్యవహారాలు మినహా మిగిలిన అన్ని రంగాల్లో రాష్ట్రానికి పూర్తి స్వయం ప్రతిపత్తి ఉంటుంది.
- రక్షణ, ఆర్థిక, విదేశాంగ, సమాచార రంగాలు మినహా ఇతర రంగాలకు సంబంధించిన చట్టాలను రాష్ట్రంలో అమలుచేయాలంటే పార్లమెంట్ రాష్ట్ర సమ్మతి తీసుకోవాలి.
- రాష్ట్ర అనుమతి లేకుండా రాష్ట్ర సరిహద్దులను మార్చే అధికారం పార్లమెంట్‌కు లేదు.
- దేశమంతటా ఆర్థిక అత్యవసర పరిస్థితిని విధించినప్పటికీ, కశ్మీర్‌లో దానిని విధించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి లేదు.
- రాజ్యాంగంలోని 21 భాగంలో 'తాత్కాలిక, పరివర్తన' నిబంధనల కింద ఆర్టికల్ 370ని పొందుపరిచారు.

**ఆర్టికల్ 35ఏ**

- దీని ప్రకారం జమ్ము కశ్మీర్ శాశ్వత నివాసితులకు ప్రత్యేక హక్కులు ఉంటాయి. రాష్ట్రంలో స్థిరాస్తుల కొనుగోలుకు, స్థిర నివాసానికి, రాష్ట్ర ప్రభుత్వ స్కాలర్‌షిప్ పథకాలకు వారు మాత్రమే అర్హులు.
- దేశంలోని ఇతర ప్రాంతాలవారికి జమ్ము కశ్మీర్‌లో ఈ హక్కులు ఉండవు.
- కంపెనీలు రాష్ట్రేతర వ్యక్తులను నియమించుకోవడంపై ఈ అధికరణం నియంత్రణ విధిస్తున్నది.
- రాష్ట్రేతర వ్యక్తిని వివాహం చేసుకున్న జమ్ము కశ్మీర్ మహిళలు ఆస్తి హక్కులను కోల్పోతారు.
- అధికరణం 370 జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తుండగా, అధికరణం 35ఏ ప్రత్యేక హక్కులు కల్పిస్తున్నది.

**ఆర్టికల్ 370ని తొలిగించవచ్చా?**

రాష్ట్రపతి ఉత్తర్వుతో తొలిగించేందుకు 370(3) అధికరణం అనుమతినిస్తున్నది. అయితే ముందుగా జమ్ముకశ్మీర్ రాజ్యాంగ సభ సమ్మతి పొందాల్సి ఉంటుంది. 1957 జనవరి 26న ఆ సభను రద్దు చేసిన నేపథ్యంలో.. అధికరణను ఇకపై తొలిగించడానికి వీలుపడదని ఒక వాదన ఉన్నది. మరోవైపు ప్రస్తుత రాష్ట్ర అసెంబ్లీ సమ్మతితో తొలిగించొచ్చనే మరో వాదన కూడా వినిపిస్తున్నది.

-నేషనల్ డెస్క్

## మద్యం మత్తులో కారు నడిపిన ఐఏఎస్ అధికారి..

# ప్రమాదంలో జర్నలిస్టు మృతి



ఐఏఎస్ శ్రీరామ్ కారు ఢీకొట్టడంతో ధ్వంసమైన బైక్



మృతుడు బషీర్



శ్రీరామ్

**తిరువనంతపురం, ఆగస్టు 3:** మద్యం సేవించి మితిమీరిన వేగంతో విచక్షణారహితంగా కారు నడిపిన ఓ ఐఏఎస్ అధికారి ఓ యువ జర్నలిస్టు మృతికి కారణమయ్యాడు. ముప్పై మూడేండ్ల శ్రీరామ్ వెంకటరామన్ అనే ఐఏఎస్ అధికారి మద్యం మత్తులో వేగంగా కారు నడిపి ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఓ పాత్రికేయుడిని ఢీకొట్టాడు. ఈ ఘటనలో మలయాళ పత్రిక 'సిరాజ్' బ్యూరో ఛీఫ్ మహమ్మద్ బషీర్(35) అక్కడికక్కడే మృతి చెందారు. శనివారం వేకువజామున తిరువనంతపురం మ్యూజియం వద్ద ఈ ఘటన చోటు చేసుకున్నది. ప్రమాద సమయంలో కారులో శ్రీరామ్‌తో పాటు వఫాఫిరోజ్ అనే మహిళ కూడా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో బైక్‌పై ఉన్న బషీర్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. కారులో ఉన్న శ్రీరామ్‌కి కూడా గాయాలయ్యాయి. ఆయన్ని దవాఖానకి తరలించి చికిత్స అందించారు. అయితే తాను కారు నడపలేదని, తన స్నేహితురాలే నడిపారని శ్రీరామ్ మొదట పోలీసులను నమ్మించే ప్రయత్నం చేశాడు. 'కారు ఎవరు నడిపారన్న అంశంపై భిన్నమైన వాదనలు వినిపించినప్పటికీ, సంఘటన జరిగినప్పుడు అక్కడే ఉన్న ప్రత్యక్ష సాక్షులు ఇచ్చిన సమాచారం ప్రకారం కారును శ్రీరామ్ నడిపినట్టు నిర్ధారించాం' అని తిరువంతపురం పోలీసు కమీషనర్, ఐజీపీ దినేంద్ర కశ్యప్ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. బషీర్ మృతిపై సరైన విధంగా విచారణ జరుపాలని కేరళ జర్నలిస్ట్ యూనియన్ డిమాండ్ చేసింది. బషీర్ మృతి పట్ల కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విచారం వ్యక్తం చేశారు.

# పాక్‌ను తిప్పికొట్టిన ఆర్మీ

## ఆ దేశ సైన్యం అండతో ఉగ్రవాదుల చొరబాటు యత్నాలు ■ ఐదుగురి హతం

**శ్రీనగర్, ఆగస్టు 3:** పాకిస్థాన్‌కు చెందిన బోర్డర్ యాక్షన్ టీం (బ్యాట్) దుందుడుకు చర్యలను భారత ఆర్మీ తిప్పికొట్టింది. ఎదురుకాల్పుల్లో ఐదు నుంచి ఏడుగురు చొరబాటుదారులు హతమై ఉంటారని రక్షణశాఖ ప్రతినిధి శనివారం తెలిపారు. 'పాక్ బ్యాట్‌కు చెందిన సభ్యులు, ఉగ్రవాదులతో కూడిన బృందం గత రెండు రోజులుగా జమ్ముకశ్మీర్ కెరణ్ సెక్టార్‌లోని నియంత్రణ రేఖ వద్ద ఉన్న భారత ఆర్మీ పోస్టులను లక్ష్యంగా చేసుకుని కాల్పులకు పాల్పడుతున్నది. అప్రమత్తమైన మన జవాన్లు ధీటుగా బదులిచ్చారు. పాక్‌కు చెందిన ఐదు నుంచి ఏడుగురు చొరబాటుదారులను హతమార్చారు' అని కల్నల్ రాజేష్ కాలియా వెల్లడించారు. పాకిస్థాన్ ఆర్మీకి చెందిన స్పెషల్ సర్వీస్ గ్రూప్(ఎస్ఎస్‌జీ) కమాండోలు లేదా ఉగ్రవాదులకు చెందిన నాలుగు మృతదేహాలు భారత సైనిక పోస్టుకు సమీపంలో పడి ఉండటాన్ని గుర్తించామని, వీటి స్వాధీనం, గాలింపు చర్యలకు పాక్ కాల్పులతో ఆటంకం ఏర్పడుతున్నదని ఆయన చెప్పారు. కశ్మీర్ లోయలో శాంతికి విఘాతం కలిగించడంతోపాటు అమర్‌నాథ్ యాత్రికులను లక్ష్యంగా చేసుకునేందుకు పాక్ గత 36 గంటలుగా అనేక ప్రయత్నాలు చేసిందన్నారు. ఈ నేపథ్యంలో జరిగిన రెండు ఎన్‌కౌంటర్లలో నలుగురు జైషే మహ్మద్ ఉగ్రవాదులు హతమయ్యారని చెప్పారు. పాక్ గుర్తులున్న తుపాకీతోపాటు ఐఈడీ, మైన్లు వారి వద్ద లభించాయని రాజేశ్ వివరించారు.




సైన్యం విడుదల చేసిన చొరబాటుదారుల మృతదేహాల ఫొటో

**పూంచ్ సరిహద్దులో పాక్ కాల్పులు**

పాక్ ఆర్మీ మరోసారి కాల్పుల విరమణను ఉల్లంఘించింది. శనివారం జమ్ముకశ్మీర్‌లోని పూంచ్ సరిహద్దులోని నియంత్రణ రేఖ వెంబడి భారత సైనిక పోస్టులు, గ్రామాలపై కాల్పులు జరిపింది. 'మెంధార్ సెక్టార్‌లో రాత్రి 8.15కి పాక్ కవ్వింపు కాల్పులకు పాల్పడగా భారత ఆర్మీ తిప్పికొట్టింది' అని రక్షణ శాఖ ప్రతినిధి తెలిపారు.

### నలుగురు ఉగ్రవాదులు హతం

కశ్మీర్‌లో వేర్వేరు ఎన్‌కౌంటర్లలో నలుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. శనివారం బారాముల్లా జిల్లాలోని సోపోర్ ప్రాంతంలో ఉగ్రవాదులు సంచరిస్తున్నారన్న సమాచారం మేరకు భద్రతా బలగాలు గాలింపు చేపట్టాయి. వీరి రాకను గుర్తించిన మిలిటెంట్లు కాల్పులకు తెగబడటంతో బలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. దీంతో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. మరో ఘటనలో షోపియాన్ జిల్లాలోని పాందుషాన్ ప్రాంతంలో ఉగ్రవాదులకు, భద్రతా బలగాలకు జరిగిన ఎదురుకాల్పుల్లో జేఈఎం ఉగ్రవాది మన్‌జూర్ భట్ హతమయ్యాడు. ఇతడు హిజ్‌బుల్ ముజాహిదీన్ ఉగ్రవాద సంస్థలో పనిచేస్తున్నాడు. అలాగే షోపియాన్‌లోని మెమందర్ ప్రాంత నివాసి జీనత్ ఉల్ ఇస్లాం నైకూను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి.

## మహాభారతంలోనూ మధ్యవర్తిత్వం విఫలమైంది

### అయోధ్యపై యూపీ సీఎం ఆదిత్యనాథ్ వ్యాఖ్యలు



**అయోధ్య:** మహాభారతానికి (కురుక్షేత్ర యుద్ధానికి) ముందు మధ్యవర్తిత్వం విఫలమైందని, అయోధ్యపై ఇప్పుడు కూడా అదే జరుగుతుందన్నది తనకు ముందే తెలుసునని ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ అన్నారు. శనివారం అయోధ్యలో జరిగిన రామజన్మభూమి న్యాస్ పూర్వ అధిపతి పరమహంస రామచంద్ర దాస్ 16వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రామజన్మభూమి-బాబ్రీ వివాదంపై మధ్యవర్తిత్వం నెరిపేందుకు నియమించిన కమిటీ విఫలమైనందున, ఈ నెల 6 నుంచి ఈ కేసు రోజువారీ విచారణ జరుపుతామని సుప్రీంకోర్టు శుక్రవారం చెప్పిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన యోగి ఆదిత్యనాథ్.. 'మధ్యవర్తిత్వం ద్వారా ఏమి జరుగదన్న సంగతి తెలుసు. ఇది మన మంచికే. మధ్యవర్తిత్వం ఫలించినా కూడా మంచిదే' అని అన్నారు. మహాభారతానికి ముందు కూడా మధ్యవర్తిత్వం విఫలమైందంటూ పురాణగాథలను ఆయన గుర్తు చేశారు.

## పార్టీ కార్యకర్తలు తల్లిలాంటివారు

### వారిని అలక్ష్యం చేయొద్దు.. బీజేపీ ఎంపీలకు ప్రధాని మోదీ సూచన

**న్యూఢిల్లీ:** సిద్ధాంతం, భావజాలం కారణంగానే బీజేపీ నేడు ఈ స్థాయికి వచ్చిందని, కుటుంబ వారసత్వం వల్ల కాదని ప్రధాని నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. పార్టీ కార్యకర్తలతో సంబంధాలు కలిగి ఉండాలని బీజేపీ ఎంపీలకు సూచించారు. 'అభ్యాసవర్గ' పేరుతో బీజేపీ ఎంపీలకు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ప్రధాని ప్రారంభించారు. అనంతరం ఎంపీలనుద్దేశించి ఆయన మాట్లాడారు. పార్టీని, పార్టీ కార్యకర్తలను ఆయన తల్లి, కుమారుడితో పోల్చారు. కుమారుడికి వివాహమై, అతడు భార్యపై కొద్దిగా ఎక్కువ దృష్టిపెట్టినప్పుడు తల్లిలో కొద్దిగా అలక్ష్యానికి గురయ్యాననే భావన తలెత్తుతుందని చెప్పారు. కాబట్టి ఎంపీలుగా గెలిచిన తర్వాత పార్టీని, పార్టీ కార్యకర్తలను మర్చిపోవద్దని సూచించారు.

# వెంటనే విధుల్లో చేరండి

- లేకపోతే కఠిన చర్యలు
- సమ్మెచేస్తున్న వైద్యులకు కేంద్రం హెచ్చరిక

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే ఎయిమ్స్, సఫ్దర్‌జంగ్ దవాఖానల వైద్యులను కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. వెంటనే విధుల్లో చేరాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామంటూ వారికి నోటీసులు పంపింది. జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) బిల్లుకు లోక్‌సభ సోమవారం ఆమోదం తెలపడంపై దేశవ్యాప్తంగా వైద్యులు గురువారం నుంచి విధులు బహిష్కరించి నిరసనలు తెలుపుతున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఢిల్లీలోని ఎయిమ్స్, సఫ్దర్‌జంగ్ ప్రభుత్వ దవాఖానలకు చెందిన రెసిడెంట్, జూనియర్ డాక్టర్లు శనివారం నాటికి వరుసగా మూడో రోజు కూడా విధులకు దూరంగా ఉన్నారు. అత్యవసర సహా అన్ని వైద్య సేవలను నిలిపివేశారు. శుక్రవారం కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్ వైద్య సంఘాలతో సమావేశమై సమ్మెను విరమించాలని కోరారు. అయినా ఫలితం లేకపోవడంతో రోగుల ఇబ్బందుల నేపథ్యంలో కఠిన చర్యలకు ఆ శాఖ సిద్ధమైంది. కేంద్ర పరిధిలోని ఈ రెండు దవాఖానల వైద్యులు వెంటనే విధుల్లో చేరేలా నోటీసులు ఇవ్వాలని లేనిపక్షంలో సస్పెన్షన్, సర్వీసు నుంచి తొలిగింపు, వసతిగృహ సౌకర్యాన్ని రద్దు చేయడం వంటి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆయా డైరెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది.

# పెండ్లి చేసుకోమంటే.. కాల్చి చంపాడు

- కుటుంబంలో ఐదుగుర్ని హతమార్చి ఆత్మహత్య చేసుకున్న యువకుడు



**మోగా (పంజాబ్), ఆగస్టు 3:** పెండ్లి చేసుకోమని ఒత్తిడి చేస్తున్న కుటుంబ సభ్యులను ఓ యువకుడు కాల్చి చంపాడు. అనంతరం అతడు కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. పంజాబ్‌లో శుక్రవారం ఈ దారుణ ఘటన జరిగింది. నథువాల్ గార్బి గ్రామానికి చెందిన సందీప్ సింగ్ (27)ను పెండ్లి చేసుకోవాలని కుటుంబ సభ్యులు బలవంతపెట్టసాగారు. అయితే తాను నపుంసకుడినని భావించిన అతడు పెళ్లి చేసుకోనని తెగేసి చెప్పాడు. అయినప్పటికీ సందీప్ కుటుంబం ఓ పెండ్లి సంబంధం కుదిర్చడంతో విసిగిపోయిన అతడు తన బంధువుల నుంచి దొంగిలించిన తుపాకితో కుటుంబ సభ్యులపై కాల్పులు జరిపాడు. అనంతరం కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనలో సందీప్ అమ్మమ్మ, తల్లి, తండ్రి, సోదరి, ఆమె కుమార్తె మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన తాత గురుచరణ్ సింగ్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## లైంగిక వేధింపుల కేసులో వృద్ధుడికి జీవిత ఖైదు!

**పుదుకొట్టై(తమిళనాడు), ఆగస్టు 3:** మైనర్ బాలికను లైంగికంగా వేధించిన 68 ఏండ్ల వృద్ధుడికి జీవిత ఖైదు విధిస్తూ తమిళనాడులోని ఓ మహిళా కోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది. బాధితురాలి కుటుంబానికి నిందితుడు రూ. 7 లక్షలు పరిహారం చెల్లించాలని తన ఆదేశాల్లో పేర్కొంది. పుదుకొట్టై జిల్లాలోని అలంగుడి ప్రాంతానికి చెందిన అష్రఫ్ అలీ ఓ ఏడేండ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు పోలీసులు కేసు నమోదు చేశారు. 2018లో జరిగిన ఈ ఘటనపై విచారణ చేపట్టిన కోర్టు నిందితుడికి యావజ్జీవ శిక్ష విధించింది.

# మహారాష్ట్రను ముంచెత్తిన వాన

## స్తంభించిన జనజీవనం.. పాండవ్‌కాడ జలపాతంలో పడి ఇద్దరు మృతి



ముంబైలోని ఓ రైల్వేస్టేషన్‌లో నీట మునిగిన పట్టాలపై ఆడుకుంటున్న యువకులు

**ముంబయి:** గత కొన్నిరోజులుగా కురుస్తున్న ఎడతెగని వర్షాలకు మహారాష్ట్రలోని పలు జిల్లాలు అతలాకుతలం అవుతున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి మళ్లీ మొదలైన వర్షం శనివారం వరకు కొనసాగింది. ముంబయితో పాటు నగర శివారు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. ముంబయి లోతట్టు ప్రాంతాలన్నీ నీట మునిగాయి. జనజీవనం అస్తవ్యస్తమైంది. రైల్వే రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. థానే నగరంలో విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మరణించగా.. నాలాలో పడి మరో వ్యక్తి చనిపోయాడు. పాల్ఘర్ జిల్లాలో రాకపోకలు స్తంభించాయి. డజనుకు పైగా ఇండ్లు నేలమట్టమయ్యాయి. ముంబయి, థానే, పాల్ఘర్ జిల్లాల్లోని పాఠశాలలు, కళాశాలలకు అధికారులు సెలవు ప్రకటించారు. ఖర్ఘర్ పట్టణానికి సమీపంలోని పాండవ్‌కాడ జలపాతంలో ప్రమాదవశాత్తు పడి ఇద్దరు విద్యార్థినిలు మృతిచెందగా, మరో ఇద్దరు విద్యార్థినిలు గల్లంతయ్యారు.

# కుల్దీప్‌సింగ్‌ను ప్రశ్నించిన సీబీఐ

**లక్నో:** లైంగికదాడి ఆరోపణలను ఎదుర్కొంటున్న ఉత్తర్‌ప్రదేశ్‌లోని బీజేపీ ఎమ్మెల్యే కుల్దీప్‌సింగ్ సెంగర్‌ను సీబీఐ అధికారులు ప్రశ్నించారు. ప్రస్తుతం అతడు సీతాపూర్ జిల్లాలోని జైలులో ఉన్నాడు. శనివారం జైలుకు వచ్చిన ముగ్గురు సీబీఐ అధికారులు కొన్ని గంటలపాటు కుల్దీప్‌సింగ్‌ను ప్రశ్నించారు. 2017లో బాధితురాలు మైనర్‌గా ఉన్నప్పుడు కుల్దీప్‌సింగ్ లైంగికదాడికి పాల్పడ్డాడని తొలుత కేసు నమోదైంది. తర్వాత ఇటీవల బాధితురాలు, ఆమె బంధువులు, న్యాయవాది ప్రయాణిస్తున్న కారును లారీ ఢీకొట్టింది. దీంతో బాధితురాలి ఇద్దరు బంధువులు మరణించారు. ఆమె, న్యాయవాది తీవ్రగాయాలతో దవాఖానలో చికిత్స పొందుతున్నారు. దీంతో కుల్దీప్‌సింగ్‌పై హత్య కేసు నమోదైంది. ఈ నేపథ్యంలోనే సీబీఐ అధికారులు అతడిని ప్రశ్నించారు. కాగా చికిత్స పొందుతున్న బాధితురాలికి నిమోనియా వచ్చిందని, ఆమె ఆరోగ్యం విషమంగానే ఉన్నదని డాక్టర్లు చెప్పారు.

## మాల్దీవుల మాజీ ఉపాధ్యక్షుడిని తిప్పిపంపిన భారత్



**ట్యూటికోరిన్:** ఎలాంటి పత్రాలు లేకుండా భారత్‌కు చేరుకున్న మాల్దీవులు మాజీ ఉపాధ్యక్షుడు అహ్మద్ అదీబ్ అబ్దుల్ గఫూర్‌ను అధికారులు తిరిగి ఆయన స్వదేశానికి పంపారు. ఓ నౌకలో తొమ్మిది మంది సిబ్బందితో కలిసి అదీబ్ గురువారం తమిళనాడులోని ట్యూటికోరిన్ చేరుకున్న విషయం తెలిసిందే. అయితే ఆయనను విచారించిన పోలీసులు సరైన పత్రాలు లేకుండానే భారత్‌లోకి అడుగుపెట్టినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో తిరిగి స్వదేశానికి వెళ్లాలని ఆయనకు సూచించారు. దీంతో శుక్రవారం అర్ధరాత్రి ఆయన తాను వచ్చిన నౌకలోనే తిరిగి స్వదేశానికి వెళ్లారు. స్వదేశంలో తన ప్రాణాలకు ముప్పు ఉండటంతో అదీబ్ ఆశ్రయం కోసం భారత్‌కు వచ్చారని సమాచారం. మరోవైపు స్వదేశానికి చేరుకున్న అదీబ్‌ను మాల్దీవుల పోలీసులు అరెస్టు చేశారు.

**పీకేఎల్‌లో నేడు**
హర్యానా X తలైవాస్ -7.30గం.
పాట్నా X పుణేరి -8.30గం.
స్టార్ స్పోర్ట్స్‌లో

# క్రీడాభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

మంత్రి శ్రీనివాస్ గౌడ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ ప్రభుత్వం క్రీడల అభివృద్ధి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నదని, క్రీడాకారులకు అన్ని విధాల ప్రోత్సాహం అందిస్తున్నదని రాష్ట్ర క్రీడా, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శనివారం కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియంలో 11వ జాతీయ థాయ్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలను మంత్రి ప్రారంభించారు. 25 రాష్ట్రాల నుంచి సుమారు 1000 మంది క్రీడాకారులు పాల్గొంటున్న ఈ చాంపియన్‌షిప్ పోటీలకు హైదరాబాద్ నగరం ఆతిథ్యమివ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో దేశంలోనే తెలంగాణ నంబర్‌వన్ స్థానంలో నిలిచిందని, ఇదే స్ఫూర్తితో క్రీడా రంగంలోనూ టాప్‌లో నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించేలా క్రీడాకారులకు మెరుగైన శిక్షణ ఇవ్వాలని సాట్స్ ఛైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్ గౌడ్, సాట్స్ ఛైర్మన్‌తో పాటు సెట్విన్ ఛైర్మన్ ఇనాయత్ అలీ, థాయ్ బాక్సింగ్ చాంపియన్ నిర్వాహకులు ఇష్తికార్ హుస్సేన్, సౌరభ్, సుమన్ పాల్గొన్నారు.


శనివారం హైదరాబాద్‌లో జాతీయ థాయ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలను ప్రారంభిస్తున్న రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్, సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి

## ఐదు జిల్లాలకు ఏఎఫ్‌ఐ ఆర్థిక సహాయం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** భారత అథ్లెటిక్స్ సమాఖ్య(ఏఎఫ్‌ఐ) తొలిసారి తీసుకొచ్చిన ప్రతిష్ఠాత్మక పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా దేశ వ్యాప్తంగా వంద జిల్లాలను ఎంపిక చేశారు. క్రీడలను మరింత అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో ఎంపిక చేసిన ఈ జిల్లాలకు ఏఎఫ్‌ఐ నేరుగా నిధులు కేటాయించనుంది. నిరంతరంగా టోర్నీలు నిర్వహించడంతో పాటు ప్రాతినిధ్యంలో అంకితభావం కనబరుస్తున్న జిల్లాలకు ప్రాధాన్యమిచ్చారు. ఇందులో తెలంగాణ నుంచి వరంగల్, హైదరాబాద్, మేడ్చల్, మంచిర్యాల్, నాగర్ కర్నూల్ చోటు దక్కించుకున్నాయని రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రెటరీ సారంగపాణి పేర్కొన్నారు.



# ఫైనల్లో సాత్విక్ జోడీ

థాయ్‌లాండ్ బ్యాడ్మింటన్ ఓపెన్

**బ్యాంకాక్:** థాయ్‌లాండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో సాత్విక్ సాయిరాజ్ రాంకీరెడ్డి-చిరాగ్ శెట్టి జంట తుదిపోరుకు దూసుకెళ్లింది. తద్వారా బీడబ్ల్యూఎఫ్ సూపర్-500 టోర్నీ ఫైనల్ చేరిన భారత తొలి పురుషుల డబుల్స్ జోడీగా నిలిచింది. శనివారం జరిగిన సెమీఫైనల్లో సాత్విక్-చిరాగ్ ద్వయం 22-20, 22-24, 21-9తో ప్రపంచ 19వ ర్యాంక్ జోడీ కో సంగ్ హ్యూన్-షిన్ బేక్ చియోల్ (కొరియా)పై విజయం సాధించి స్వర్ణ పోరుకు సిద్ధమైంది. 63 నిమిషాల పాటు జరిగిన పోరులో తొలి రెండు గేమ్‌లు హోరాహోరీగా సాగగా.. చివరిదైన మూడో గేమ్‌లో భారత ద్వయం అదరగొట్టింది. ఆదివారం జరగనున్న తుదిపోరులో మూడో సీడ్ లి జున్ హుయి-లియూ యు చెన్ (చైనా) జంటతో.. అన్‌సీడెడ్ సాత్విక్ ద్వయం తలపడనుంది. పోటాపోటీగా సాగిన తొలి గేమ్‌లో ఆరంభంలో ఆధిక్యం సాధించిన సాత్విక్ జోడీ అదే జోరు కొనసాగించింది. 20-18తో ఆధిక్యంలో నిలిచిన భారత ద్వయం సులువుగానే గెలిచేలా కనిపించినా.. కొరియా జంట తిరిగి పుంజుకొని వరుసగా రెండు పాయింట్లు సాధించి స్కోరు సమం చేసింది. కీలక తరుణంలో రెండు పాయింట్లు చేజిక్కించుకున్న మన జోడీ గేమ్‌ను చేజిక్కించుకుంది. రెండో గేమ్ ఆరంభంలో 3-0తో ఆధిక్యంలో నిలిచిన మనవాళ్లు ఆ తర్వాత కూడా పక్కా ప్రణాళికలతో ఆడినా.. ప్రత్యర్థి ఆటగాళ్లు పైచేయి సాధించి గేమ్ సొంతం చేసుకున్నారు. ఇక నిర్ణయాత్మక మూడో గేమ్‌లో సాత్విక్-చిరాగ్ జంట రెచ్చిపోయింది. ఏ దశలోనూ ప్రత్యర్థికి కోలుకునే అవకాశం ఇవ్వకుండా విరుచుకుపడి గేమ్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది.

# నయా సైనికుడు



దాదాపు మూడేండ్ల క్రితం భారత్, వెస్టిండీస్ మధ్య ఇక్కడే జరిగిన మ్యాచ్‌లో 489 పరుగులు నమోదయ్యాయి. ఇరు జట్ల ఆటగాళ్లు కలిపి రెండు సెంచరీలు.. రెండు అర్ధసెంచరీలు బాది ప్రేక్షకులకు ఫుల్ మజా పంచారు. అదే పిచ్‌పై శనివారం జరిగిన మ్యాచ్ మరీ చప్పగా సాగింది. శతకం మాట అటుంచి.. రెండు టీమ్‌ల్లో కలిపి ఒక్క బ్యాట్స్‌మన్ కూడా కనీసం అర్ధశతకం నమోదు చేయలేకపోయాడు. యువ పేసర్ నవదీప్ సైనీ అరంగేట్రంలోనే అదిరిపోయే ప్రదర్శన చేయడంతో.. పరుగులు రాబట్టేందుకు కరీబియన్లు పరితపించిపోయారు. పొలార్డ్ మినహా మిగిలిన వారంతా విఫలమవడంతో విండీస్ స్వల్ప స్కోరుకే చాపచుట్టేసింది. ఆ కొద్ది పాటి లక్ష్యాన్ని ఛేదించేందుకు మనవాళ్లూ ఆపసోపాలు పడ్డారు.

నవదీప్ సైనీ (3/17)

**కరీబియన్లను బెంబేలెత్తించిన నవదీప్.. బ్యాటింగ్‌లో తడబడ్డ టీమ్ఇండియా**
**తొలి టీ20లో విండీస్‌పై విజయం.. నేడు రెండో మ్యాచ్**

**లాడర్‌హిల్ (అమెరికా):** వన్డే ప్రపంచకప్ పరాజయం అనంతరం అనేక సమస్యల మధ్య వెస్టిండీస్‌తో పొట్టి పోరుకు దిగిన టీమ్ఇండియా చక్కటి విజయాన్ని అందుకుంది. శనివారం ఇక్కడ జరిగిన తొలి టీ20లో భారత్ 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. 'మిడిలార్డర్‌లో మంచి బ్యాట్స్‌మన్ కావాలి.. నిలకడగా ఆడే ఆటగాడి కోసం చూస్తున్నాం'అని మ్యాచ్‌కు ముందు అన్న కోహ్లీ తీరా బరిలో దిగే సమయానికి ఉన్న బ్యాట్స్‌మెన్ నుంచి ఒకర్ని తగ్గించి ఆరుగురు బౌలర్లు, ఐదుగురు బ్యాట్స్‌మెన్‌తో తుదిజట్టును ప్రకటించాడు. ఈ ఫార్ములా ఫలించి ఆరంభంలో విండీస్ వీరులు తక్కువ పరుగులకే పరిమితమైనా.. లక్ష్య ఛేదనలో మరో బ్యాట్స్‌మన్ లోటు మాత్రం కొట్టొచ్చినట్లు కనిపించింది. అరంగేట్ర పేసర్ నవదీప్ సైనీ (3/17)తో పాటు భువనేశ్వర్ కుమార్ (2/19) విజృంభించడంతో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 95 పరుగులు చేసింది. సీనియర్ ఆల్‌రౌండర్ కీరన్ పొలార్డ్ (49 బంతుల్లో 49; 2 ఫోర్లు, 4 సిక్సర్లు) ఒక్కడే మెరుగ్గా ఆడగా.. పూరన్ (20) మినహా మిగిలినవారంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. టాప్‌ఆర్డర్‌లోనే ముగ్గురు సున్నాలు చుట్టారు. సుందర్, ఖలీల్, కృనాల్, జడేజా తలా ఓ వికెట్ పడగొట్టారు. అనంతరం భారత్ 17.2 ఓవర్లలో 6 వికెట్లకు 98 పరుగులు చేసి గెలిచింది. రోహిత్ శర్మ (24; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) టాప్ స్కోరర్. సైనీకి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య ఆదివారం ఇక్కడే రెండో టీ 20 జరుగనుంది. ఇదే పిచ్‌పై.. ఇదే ప్రత్యర్థితో ఆడిన చివరి మ్యాచ్‌లో అజేయ శతకంతో ఆకట్టుకున్న లోకేశ్ రాహుల్‌కు తుది జట్టులో చోటుదక్కక పోగా.. యువ పేసర్ నవదీప్ సైనీ భారత్ తరఫున తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు.

**కష్ట కష్టంగానే..**
స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలో దిగిన భారత్ అతి జాగ్రత్తకు పోయినట్లు కనిపించింది. 10 ఓవర్లలో ఛేదించాల్సిన టార్గెట్‌ను మరీ నెమ్మదిగా పూర్తిచేసింది. గాయం నుంచి కోలుకొని తిరిగి వచ్చిన ఓపెనర్ శిఖర్ ధవన్ (1)ను రెండో ఓవర్లో కాట్రెల్ ఔట్ చేశాడు. అయినా కెప్టెన్ కోహ్లీ (00), వైస్ కెప్టెన్ రోహిత్ (24; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) క్రీజులో ఉండటంతో కాసేపట్లోనే మ్యాచ్ ముగిసిపోతుందని అంతా భావించారు. అందుకు తగ్గట్లే రోహిత్ చక్కటి షాట్లతో మంచి టచ్‌లో కనిపించాడు. ఫలితంగా పవర్ ప్లే ముగిసేసరికి టీమ్ ఇండియా వికెట్ నష్టానికి 31 వికెట్లు పడగొట్టింది. కానీ మిస్టరీ స్పిన్నర్ సునీల్ నరైన్ వరుస బంతుల్లో రోహిత్ శర్మ, రిషబ్ పంత్‌ను పెవిలియమన్ పంపాడు. దీంతో 7 ఓవర్లు ముగిసేసరికి భారత్ 33/3తో నిలిచింది. ఈ దశలో మనీశ్ పాండే (19)తో కలిసి కోహ్లీ నెమ్మదిగా జట్టును లక్ష్యం దిశగా నడిపించాడు. 5 పరుగుల వ్యవధిలో వీరిద్దరూ ఔటైనా.. లక్ష్యం మరీ పెద్దది కాకపోవడంతో కృనాల్ (12), జడేజా (10 నాటౌట్), సుందర్ (8 నాటౌట్) మిగిలిన పని పూర్తి చేశారు. విండీస్ బౌలర్లలో కాట్రెల్, నరైన్, పాల్
తలా రెండు వికెట్లు పడగొట్టారు.


రోహిత్ (24) కోహ్లీ (19)

**సైకిల్ స్టాండ్‌ను తలపిస్తూ..**
టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న కోహ్లీ నిర్ణయం సరైందని తేలడానికి ఎక్కువ సమయం పట్టలేదు. యువ బౌలర్లు రెచ్చిపోవడంతో విండీస్ విలవిల్లాడింది. ఇన్నింగ్స్ రెండో బంతికే ఓపెనర్ క్యాంప్‌బెల్ (0)ను వాషింగ్టన్ సుందర్ వెనక్కి పంపి టీమ్ఇండియాకు శుభారంభం అందించాడు. విధ్వంసకర ఓపెనర్ ఎవిన్ లూయిస్ (0)ను నకుల్ బాల్‌తో బోల్తా కొట్టించిన భువనేశ్వర్ ఆనందాన్ని రెట్టింపు చేశాడు. ఎదురుదాడికి యత్నించిన నికోలస్ పూరన్ (20; 1 ఫోర్, 2 సిక్సర్లు)తో పాటు హెట్‌మైర్ (0)ను అరంగేట్ర పేసర్ నవదీప్ సైనీ వరుస బంతుల్లో పెవిలియన్ చేర్చాడు. కాసేపటికే పావెల్ (4)ను ఖలీల్ ఔట్ చేశాడు. దీంతో పవర్ ప్లే ముగిసేసరికి విండీస్ 33 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది.


హెట్‌మైర్ (0)

**పొలార్డ్ నిలిచినా..**
ఈ దశలో సీనియర్ ఆటగాళ్లు పొలార్డ్, బ్రాత్‌వైట్ సంయమనం ప్రదర్శించారు. మొదట వికెట్ల పతనాన్ని అడ్డుకొని ఆనక పరుగులు రాబట్టడంపై దృష్టిసారించారు. ఆరో వికెట్‌కు 34 పరుగులు జోడించి పరిస్థితిని చక్కదిద్దుతున్న తరుణంలో కెప్టెన్ బ్రాత్‌వైట్ (9)ను కృనాల్ రిటర్న్ క్యాచ్ ద్వారా డగౌట్‌కు పంపాడు. ఒక ఎండ్‌లో పొలార్డ్ పోరాడుతున్నా మరో ఎండ్ నుంచి అతడికి సహకారం కరువైంది. నరైన్ (2), పాల్ (3) ప్రభావం చూపలేకపోయారు. ఆఖర్లో బ్యాట్‌కు పనిచెప్పిన పొలార్డ్ జట్టుకు ఆ మాత్రం స్కోరైనా అందించగలిగాడు. చివరి ఓవర్‌లో మరోసారి మాయ చేసిన సైనీ ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా పొలార్డ్‌ను ఔట్ చేయడంతో విండీస్ సెంచరీ మార్క్‌ను కూడా దాటలేకపోయింది.

### స్కోరు బోర్డు

**వెస్టిండీస్:** క్యాంప్‌బెల్ (సి) కృనాల్ (బి) సుందర్ 0, లూయిస్ (బి) భువనేశ్వర్ 0, పూరన్ (సి) పంత్ (బి) సైనీ 20, పొలార్డ్ (ఎల్బీ) సైనీ 49, హెట్‌మైర్ (బి) సైనీ 0, పావెల్ (సి) పంత్ (బి) ఖలీల్ 4, బ్రాత్‌వైట్ (సి అండ్ బి) కృనాల్ 9, నరైన్ (సి) ఖలీల్ (బి) జడేజా 2, పాల్ (సి) కోహ్లీ (బి) భువనేశ్వర్ 3, కాట్రెల్ (నాటౌట్) 0, థామస్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు:** 8, **మొత్తం: 20 ఓవర్లలో 95/9. వికెట్ల పతనం:** 1-0, 2-8, 3-28, 4-28, 5-33, 6-67, 7-70, 8-88, 9-95, **బౌలింగ్:** సుందర్ 2-0-18-1, భువనేశ్వర్ 4-0-19-2, సైనీ 4-1-17-3, ఖలీల్ 2-0-8-1, కృనాల్ 4-1-20-1, జడేజా 4-1-13-1.

**భారత్:** రోహిత్ శర్మ (సి) పొలార్డ్ (బి) నరైన్ 24, శిఖర్ ధవన్ (ఎల్బీ) కాట్రెల్ 1, విరాట్ కోహ్లీ (సి) పొలార్డ్ (బి) కాట్రెల్ 19, పంత్ (సి) కాట్రెల్ (బి) నరైన్ 0, మనీశ్ (బి) పాల్ 19, కృనాల్ (బి) పాల్ 12, జడేజా (నాటౌట్) 10, సుందర్ (నాటౌట్) 8, **ఎక్స్‌ట్రాలు:** 5, **మొత్తం: 17.2 ఓవర్లలో 98/6. వికెట్ల పతనం:** 1-4, 2-32, 3-32, 4-64, 5-69, 6-88, **బౌలింగ్:** థామస్ 4-0-29-0, కాట్రెల్ 4-0-20-2, నరైన్ 4-0-14-2, పాల్ 3.2-0-23-2, బ్రాత్‌వైట్ 2-0-12-0.



## బ్యాటింగ్ కోచ్ రేసులో రాథోడ్

**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ జట్టు బ్యాటింగ్ కోచ్ రేసులోకి మాజీ క్రికెటర్ విక్రమ్ రాథోడ్ అనూహ్యంగా దూసుకొచ్చాడు. పరస్పర విరుద్ధ ప్రయోజనాల కారణంగా భారత అండర్-19 జట్టుతో పాటు జాతీయ క్రికెట్ అకాడమీ(ఎన్‌సీఏ) కోచింగ్ పదవికి దూరమైన రాథోడ్ తాజాగా టీమ్ఇండియా బ్యాటింగ్ కోచ్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో ఇప్పటికే రేసులో ఉన్న ప్రవీణ్ ఆమ్రే, విక్రమ్ రాథోడ్ మధ్య ఆసక్తికరమైన పోటీ ఏర్పడింది. 'జూనియర్ సెలెక్షన్ ప్యానెల్ చీఫ్‌గా ఉన్న అశిష్ కపూర్‌తో సంబంధం ఉండటంతో పరస్పర విరుద్ధ ప్రయోజనాలతో అండర్-19, ఎన్‌సీఏ బ్యాటింగ్ కోచ్ పదవికి రాథోడ్ దూరం కావాల్సి వచ్చింది. కానీ ప్రస్తుతం సీనియర్ బ్యాటింగ్ కోచ్ కోసం దరఖాస్తు చేసుకోవడం విరుద్ధ ప్రయోజనాల కిందికి రాదు' అని సీనియర్ బీసీసీఐ అధికారి ఒకరు శనివారం పేర్కొన్నారు. ఇదిలా ఉంటే న్యూజిలాండ్‌తో ప్రపంచకప్ సెమీఫైనల్లో ధోనీని ఏడో స్థానంలో పంపడంపై ప్రస్తుత బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్‌పై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్న సంగతి తెలిసిందే.

# ఆ రోజులు భారంగా గడిచాయి

ప్రపంచకప్ సెమీస్ ఓటమిపై కోహ్లీ వ్యాఖ్య



**లౌడర్‌హిల్:** వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్ ఓటమిపై టీమ్ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ స్పందించాడు. వెస్టిండీస్‌తో తొలి టీ20కి ముందు శనివారం కోహ్లీ మాట్లాడుతూ.. 'న్యూజిలాండ్ చేతిలో పరాజయం తర్వాత కొన్ని రోజులు చాలా భారంగా గడిచాయి. ఆ ఓటమిని జీర్ణించుకోవడం కష్టమైంది. టోర్నీ ముగిసేవరకు నిద్ర లేచిన ప్రతీ సారి ఆ పరాభవమే గుర్తొచ్చేది. ఎంతో బాధగా ఉండేది. ఆ తర్వాత కొద్దికొద్దిగా మర్చిపోవడానికి ప్రయత్నించాం. అంతర్జాతీయ స్థాయి ఆటగాళ్లు పరాజయాలను పక్కన పెట్టి ముందుకు సాగాల్సిందే. చాలా రోజుల తర్వాత జట్టుతో కలిసి ఫీల్డింగ్ సెషన్‌లో పాల్గొనడం ఆనందంగా అనిపించింది.' అని వివరించాడు.

**పంత్‌కు మంచి చాన్స్:**
మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ గైర్హాజరీలో రిషబ్ పంత్ అవకాశాలను అందిపుచ్చుకోవాలని విరాట్ అన్నాడు. 'యువ వికెట్ కీపర్ రిషబ్ పంత్‌లో చక్కటి నైపుణ్యం ఉంది. అతడి ప్రతిభ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. నిలకడైన ఆటతో విండీస్ పర్యటనను ఉపయోగించుకోవాలని మేము కోరుకుంటున్నాం. మిడిలార్డర్‌లో అతడు కీలకం కానున్నాడు. వచ్చిన చాన్స్‌లను సద్వినియోగం చేసుకోవడంపై దృష్టి పెట్టాలి. ధోనీ అనుభవం జట్టుకు ఎంతో అవసరం. కానీ అతడు అందుబాటులో లేని ఈ సమయంలో పంత్ సత్తాచాటుకోవాలి. హార్దిక్ పాండ్యా కూడా విశ్రాంతి తీసుకుంటుండటంతో యువ ఆటగాళ్లు నిరూపించుకోవడానికి ఇది చక్కటి అవకాశం' అని కోహ్లీ చెప్పుకొచ్చాడు.

**నీషమ్ ట్వీట్ దుమారం!**
నిరంతరం సోషల్‌మీడియాలో ట్వీట్లు చేయడంలో న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ జిమ్మి నీషమ్ ముందుంటాడు. తనదైన శైలిలో పరిస్థితులకు తగ్గట్లు ట్వీట్లు చేసే నీషమ్...టీమ్ ఇండియా కెప్టెన్ కోహ్లీని లక్ష్యంగా చేసుకోవడం సోషల్‌మీడియాలో దుమారం రేపింది. అవును మొత్తంగా యాషెస్ కెరీర్‌లో కోహ్లీ చేసిన పరుగుల కంటే రోరీ బర్న్స్ ఒక ఇన్నింగ్స్‌లో కొట్టిన రన్స్ అత్యధికమంటూ నీషమ్ ట్వీట్ చేశాడు. దీనిపై టీమ్ఇండియా ఫ్యాన్స్ తమదైన రీతిలో వ్యంగ్యాన్ని జోడిస్తూ ట్వీట్లు చేశారు. ఆసియా కప్‌లో న్యూజిలాండ్ బ్యాట్స్‌మెన్ చేసిన సెంచరీల కంటే కోహ్లీయే ఎక్కువ అని ఒకరంటే.. ప్రపంచకప్ ఫైనల్ టిక్కెట్ల గురించి భారతీయులను వేడుకున్నావు ఇప్పుడేమో బర్న్స్‌ను కోహ్లీతో పోలుస్తున్నావు అంటూ ఏకిపారేశారు.


లోవ్లీనా


నీరజ్

# లోవ్లీనా, నీరజ్‌కు స్వర్ణాలు

**న్యూఢిల్లీ:** రష్యా వేదికగా జరిగిన మాగోమెడ్ సలామ్ ఉమాఖనోవ్ బాక్సింగ్ టోర్నీలో లోవ్లీనా బోర్గోహెయిన్, నీరజ్ స్వర్ణ పతకాలతో మెరిశారు. శనివారంతో ముగిసిన టోర్నీలో భారత బాక్సర్లు రెండు స్వర్ణాలు సహా ఒక రజతం, మూడు కాంస్య పతకాలు దక్కించుకున్నారు. మహిళల 69కిలోల ఫైనల్లో లోవ్లీనా 3-2 తేడాతో అసుంతా కాన్‌ఫోరా(ఇటలీ)పై అద్భుత విజయం సాధించింది. ఇండియా ఓపెన్ ఫైనల్లో ఎదురైన పరాజయానికి ఈ అసోం బాక్సర్ తగు రీతిలో ప్రతీకారం తీర్చుకుంది. బౌట్ ఆసాంతం తనదైన రీతిలో చెలరేగిన లోవ్లీనా ప్రత్యర్థికి ఏ మాత్రం అవకాశమివ్వకుండా పంచ్‌లతో విరుచుకుపడి ఈ యేడాది తొలి అంతర్జాతీయ పతకాన్ని తన ఖాతాలో వేసుకుంది. 57కిలోల తుది పోరులో నీరజ్ 3-0తో మలికా షకీదోవా(రష్యా)పై విజయంతో పసిడి దక్కించుకుంది. గౌరవ్ సోలంకి 0-5తో అబ్దుల్‌కయ్ షరఖ్మతోవ్(ఉజ్బెకిస్థాన్) చేతిలో ఓడి రజతంతో సరిపెట్టుకున్నాడు. పూజ రాణి, గోవింద్ సహానీ(49కి), జానీ(60కి) కాంస్య పతకాలు దక్కించుకున్నారు.



# జైపూర్ జైత్రయాత్ర

పాట్నా పైరెట్స్‌ను చిత్తుచేసిన పాంథర్స్

**పాట్నా:** ప్రొ కబడ్డీ లీగ్ ఏడో సీజన్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ జైత్రయాత్ర కొనసాగుతున్నది. ఇప్పటికే ఆడిన మూడు మ్యాచ్‌ల్లో నెగ్గిన పాంథర్స్ తాజాగా సొంతగడ్డపై తొలి మ్యాచ్ ఆడిన పాట్నా పైరెట్స్‌ను చిత్తుచేసింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో జైపూర్ 34-21తో పట్నాపై గెలుపొందింది. రైడింగ్‌లో ఇరు జట్లు సమాన పాయింట్లు సాధించినా.. ట్యాక్లింగ్‌లో విజృంభించిన జైపూర్ పింక్ పాంథర్స్ లీగ్‌లో వరుసగా నాలుగో విజయాన్ని ఖాతాలో వేసుకొని 20 పాయింట్లతో పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతున్నది. జైపూర్ తరఫున దీపక్ నర్వాల్ 9, సందీప్ ధుల్ 8 పాయింట్లు సాధించగా.. పాట్నా తరఫున డుబ్కీ కింగ్ పర్దీప్ నర్వాల్ (9 పాయింట్లు) ఒంటరి పోరాటం చేశాడు. మిగిలిన ఆటగాళ్ల నుంచి కనీస సహకారం అందకపోవడంతో పైరెట్స్‌కు ఓటమి తప్పలేదు. మరో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 43-42తో బెంగాల్ వారియర్స్‌పై గెలుపొందింది.

# మెస్సీపై మూడు నెలల నిషేధం



**అసున్‌కియాన్:** అర్జెంటీనా స్టార్ ఫుట్‌బాల్ ఆటగాడు లియోనల్ మెస్సీపై మూడు నెలల నిషేధం పడింది. నిబంధనలను అతిక్రమించి దక్షిణ అమెరికా ఫుట్‌బాల్ సమాఖ్యపై అవినీతి ఆరోపణలు చేయడమే ఈ బ్యాన్‌కు ప్రధాన కారణం. నిషేధంతో పాటు సమాఖ్య అతడికి 50 వేల డాలర్లు (రూ. 34.85 లక్షలు) జరిమానా కూడా విధించింది. గత నెలలో బ్రెజిల్ వేదికగా జరిగిన కోపా అమెరికా కప్ సెమీఫైనల్లో అర్జెంటీనా 0-2తో ఓటమి పాలైంది. అనంతరం మూడో స్థానం కోసం జరిగిన వర్గీకరణ మ్యాచ్‌లో అర్జెంటీనా 2-1తో చిలీని ఓడించింది. ఈ సందర్భంగా మెస్సీ దక్షిణ అమెరికా ఫుట్‌బాల్ కార్యవర్గంపై అవినీతి ఆరోపణలు చేశాడు. 'బ్రెజిల్‌ను గెలిపించేందుకు ఈ టోర్నీలో అవినీతి జరిగింది'అని 32 ఏండ్ల మెస్సీ పేర్కొన్నాడు. దీన్ని తీవ్రంగా పరిగణించిన సమాఖ్య క్రమశిక్షణ చర్యల్లో భాగంగా అతడిపై వేటు వేసింది.

# స్మిత్‌పైనే ఆశలు..

**బర్మింగ్‌హామ్:** ప్రతిష్ఠాత్మక యాషెస్ సిరీస్ తొలి టెస్టులో ఇంగ్లండ్ ఆధిక్యానికి ఆస్ట్రేలియా మాజీ సారథి స్టీవ్ స్మిత్ (46 బ్యాటింగ్) అడ్డుగా నిలిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో కష్టాల్లో పడ్డ జట్టును ఒంటరి పోరాటంతో పోటీలోకి తెచ్చిన స్మిత్ ప్రస్తుతం అలాంటి పరిస్థితుల్లోనే బ్యాటింగ్ చేస్తున్నాడు. మూడో రోజు శనివారం ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 31 ఓవర్లలో 124/3తో నిలిచింది. చేతిలో 7 వికెట్లు ఉన్న ఆసీస్ ప్రస్తుతం 34 పరుగుల ఆధిక్యంలో ఉంది. స్మిత్‌తో పాటు హెడ్ (21 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. ఈ పిచ్‌పై నాలుగో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేయడం కష్టతరంగా కనిపిస్తున్న నేపథ్యంలో స్మిత్ ఎంతసేపు క్రీజులో ఉంటాడనేదానిపైనే ఈ మ్యాచ్‌లో ఆసీస్ విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి.

**తొమ్మిదో వికెట్‌కు 65 పరుగులు..**
అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 267/4తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ భారీ స్కోరు చేస్తుందనుకుంటే.. ఆసీస్ బౌలర్లు కట్టుదిట్టమైన బంతులతో కట్టిపడేయడంతో అది సాధ్యపడలేదు. సెంచరీ హీరో బర్న్స్ క్రితంరోజు స్కోరుకు మరో 8 పరుగులు జతచేసి వెనుదిరగ్గా.. అర్ధశతకం పూర్తి చేసుకోగానే స్టోక్స్ కూడా ఔటయ్యాడు. మొయిన్ అలీ (0), బెయిర్‌స్టో (8) విఫలమవడంతో ఇంగ్లండ్‌కు ఆధిక్యం లభించడం కష్టమే అనిపించినా.. ఆఖర్లో వోక్స్ (37 నాటౌట్), బ్రాడ్ (29) తొమ్మిదో వికెట్‌కు కీలకమైన 65 పరుగులు జోడించి 90 పరుగులు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని అందించారు.


స్మిత్ (46 నాటౌట్)

















# వరల్డ్ ఫొటోగ్రఫీ డే సందర్భంగా ఫొటో జర్నలిస్టులకు పోటీలు

- ఎంట్రీలకు గడువు తేదీ ఈ నెల 15
- తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు అనుమల్ల గంగాధర్

**హైదరాబాద్ సిటీ బ్యూరో, నమస్తే తెలంగాణ:** ఆగస్టు 19న నిర్వహించే ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం 'ఉత్తమ వార్తా ఛాయాచిత్రాల పోటీలు' నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం అధ్యక్షుడు అనుమల్ల గంగాధర్, ప్రధాన కార్యదర్శి కేపస్ హరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జర్నలిజం వృత్తిలో భాగంగా ఫొటోగ్రాఫర్లు 2018 ఆగస్టు నుంచి 2019 జూలై మధ్య తీసిన ఫొటోలలో మూడింటిని కలర్‌లో 8x10 సెం.మీ లేదా 10x12 సెం.మీ సైజులో ఈ నెల 15వ తేదీలోగా ఎంట్రీలను అందజేయాలని కోరారు. ఎంట్రీలను దేశోద్ధారకభవన్, టీయూడబ్ల్యూజే బిల్డింగ్, బషీర్‌బాగ్, హైదరాబాద్, తెలంగాణ చిరునామాలో ఉన్న రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘంకు పంపించాలని సూచించారు. పోటీల్లో ఎంపికైనవాటికి మొదటి బహుమతిగా రూ.10వేలు, రెండో బహుమతిగా రూ.8వేలు, మూడో బహుమతిగా రూ.5వేలు అందజేస్తామని, వీటితోపాటు మరో 15 ఉత్తమ ఫొటోలకు రూ.వెయ్యి చొప్పున ప్రోత్సాహక బహుమతి ఉంటుందని తెలిపారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఈ నెల 19న నిర్వహించే ఫొటో ఎగ్జిబిషన్‌లో ఎంపికైన ఫొటోల ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. ఆగస్టు 25న జరిగే ఒక కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేస్తామని, మరింత సమాచారం కోసం 8712320567, 9849987039 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

## 'మా పాలిట దేవుడు' సీడీ ఆవిష్కరించిన దేవులపల్లి ప్రభాకర్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బోయ మల్లేశ్, చుక్క గిరి రూపొందించిన 'మా పాలిట దేవుడు' పాటల సీడీని తెలంగాణ విద్యుత్ సంస్థల సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు శనివారం ఆవిష్కరించారు. విద్యుత్ సంస్థలో ప్రభాకర్‌రావు 50 వసంతాలు పూర్తిచేసుకొన్న సందర్భంగా ఈ సీడీని రూపొందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు కల్వల సత్యనారాయణరావు, రాష్ట్ర విద్యుత్ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ అంజయ్య, పాటల రచయిత మానుకోట ప్రసాద్, గాయకుడు సందీప్, శేఖర్‌రెడ్డి, ఉమామహేశ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పండిత పుత్ర లోకేశ్..

## వాస్తవాలు తెలుసుకొని మాట్లాడు..

బందరు పోర్టుపై అసత్య ప్రచారం తగదు.. ఏపీ మంత్రి పేర్ని నాని ఫైర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బందరు పోర్టును తెలంగాణకు ఇచ్చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టీడీపీ అసత్యప్రచారం చేస్తున్నదని ఆ రాష్ట్ర రవాణా, సమాచార శాఖ మంత్రి పేర్ని నాని మండిపడ్డారు. పోర్టు కోసం శంకుస్థాపన రాయివేయడం తప్ప మరేమీ చేయని మాజీ సీఎం చంద్రబాబుకు మాట్లాడే అర్హత ఉందా? అని ప్రశ్నించారు. విజయవాడలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రహస్య జీవోలు అంటూ.. జీవోలు డౌన్‌లోడ్ చేయడంరాని మాజీ మంత్రి లోకేశ్ మాట్లాడటం చిత్రంగా ఉందని ఎద్దేవా చేశారు. 'పండితపుత్ర లోకేశ్. వాస్తవాలు తెలుసుకొని మాట్లాడు. ఎవరో రాసిచ్చింది ట్విట్టర్లో పెట్టడం కాదు. ప్రజల ఆస్తులు తాకట్టు పెట్టేందుకు ఇది చంద్రబాబు ప్రభుత్వం కాదు. ఏపీకి ఉన్న హక్కులను తెలంగాణ సీఎం కేసీఆర్‌కు అమ్మేసి కేసుల భయంతో తండ్రి కొడుకులు హైదరాబాద్ నుంచి పారిపోయి వచ్చారు. బాబు, లోకేశ్‌ది పబ్లిసిటీ కోసం దిగజారిన ప్రవర్తన. మేం వాళ్ల వలే దిగజారి మాట్లాడలేం' అంటూ ఘాటుగా విమర్శించారు.

తెలంగాణ ప్రభుత్వం
కమిషనర్ కార్యాలయం, దేవాదాయ ధర్మాదాయ శాఖ, హైదరాబాద్
e - ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
NIT నం.EE/30 & 32/టెండరు ప్రకటన/2019, తేది: 16-07-2019
నిర్మల్, ఆదిలాబాద్ & జనగామ జిల్లాలలో రూ.58.00 లక్షలతో దేవాలయాల అభివృద్ధి చేపట్టుటకు దిగువ సంతకందారుచే e-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. బిడ్ డౌన్‌లోడింగ్ ప్రారంభ & ముగింపు తేది (దాఖలు): 13-08-2019 నుండి 27-08-2019. మరింత సమాచారానికి దర్శించండి https://tender.telangana.gov.in
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, హైదరాబాద్.
DIPR RO No. 808-DP/CL/Advt/1/2019-20, Dt: 03/08/2019

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు & భవనాల శాఖ
NIT No. 04/TS/ATO/EE/R&B/MLG/2019-20, ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన తేది: 31-07-2019
ములుగు జిల్లాలో 2 BHK ఇళ్లు (G+2) నమూనాలో నిర్మాణం చేపట్టుటకు దిగువ సంతకందారుచే ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. మొత్తం ECV: 503.94 లక్షలు. టెండరుదారులు టెండరు షెడ్యూళ్లను ఇ-మార్కెట్ ప్లేస్ అనగా https://tender.telangana.gov.inలో 05-08-2019న సా. 4.00 గం. నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. టెండర్ల స్వీకరణకు చివరి తేదీ మరియు సమయం: 13-08-2019న లేదా ఆలోగా మ. 3.30 గం. తదుపరి వివరాల కొరకు https://tender.telangana.gov.in దర్శించండి.
సం/- జిల్లా (R&B) అధికారి (ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్),
DIPR RO.No. 801-DP/CL/ADVT/1/2019-20, Dt: 03-08-2019 JS భూపాలపల్లి జిల్లా : ములుగు

JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY HYDERABAD
(Established by Govt. Act No. 30 of 2008)
Kukatpally, Hyderabad - 500 085, Telangana (India)
e-PROCUREMENT-TENDERS / OPEN TENDERS

| Sl. No | NIT No. & Date | Details | Approximate Value Rs. |
|---|---|---|---|
| 1 | JNTUH/ED/HBD/3679/2019-20 Dt: 04.08.2019 | Providing House Keeping Services for Buildings, Road Cleaning & Sweeping Services at JNTUH, Kukatpally Campus, JNTUH College of Engineering Hyderabad, SIT, IST and SMS for the year 2019-20. | Rs. 1,44,58,639/- per annum |
| 2 | JNTUH/ED/HBD/3680/2019-20 Dt: 04.08.2019 | Providing landscaping maintenance services at JNTUH, Kukatpally Campus & JNTUH College of Engineering Hyderabad for the year 2019-20. | Rs. 27,73,710/- per annum |

Further details available on https://tender.eprocurement.gov.in Sd/- REGISTRAR

తెలంగాణ ప్రభుత్వం
గిరిజన సంక్షేమ శాఖ, వరంగల్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
e-proc. Notice No. DB4/56/E-P-NIT/161 to 165/2019-20, తేది: 31-07-2019. NIT No. SE/TW/WGL/NIT/161 to 165/2019-20, తేది: 31-07-2019. ఆదిలాబాద్ జిల్లాలో BT రోడ్లు ఏర్పాటుచేయుట మరియు CD పనులు మొ॥వి చేపట్టుట కొరకు దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుతున్నవి. మొత్తం ECV: రూ. 1338.00 లక్షలు. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ & ముగింపు తేది (ఆన్‌లైన్): 06-08-2019న సా॥ 5.00 గం. నుండి 21-08-2019న మ॥ 3.00 గం. వరకు. సాంకేతిక బిడ్ తెరుచు తేది: 21-08-2019న సా॥ 5.30 గం. వాణిజ్య బిడ్ తెరుచు తేది: 23-08-2019న సా॥ 5.00 గం. ఫోన్ నెం. 0870-2567645, ఇ-మెయిల్: setwwgl7@gmail.com. తదుపరి వివరాల కొరకు www.eprocurement.gov.in దర్శించండి.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్,
DIPR RO.No. 802-DP/CL/ADVT/1/2019-20, Dt: 03-08-2019 గిరిజన సంక్షేమం, వరంగల్

THE SINGARENI COLLIERIES COMPANY LIMITED
(A Government Company)
Regd. Office: KOTHAGUDEM - 507101, Telangana.
e-Procurement TENDER NOTICE
Tenders have been published for the following Services / Material Procurement through e-procurement platform. For details, please visit https://tender.telangana.gov.in - or - http://www.scclmines.com
NIT/Enquiry No. - Description/Subject - Last date and time for Submission of bid(s)
E0319O0117 - Procurement of spares for DM-1000 model Drills on RC basis for 2 Years - 16/08/2019 - 17:00 hrs.
E0319O0124 - Procurement of KME 1000 model Drill spares on Rate Contract Basis for a period of two years - 16/08/2019 - 17:00 hrs.
E0719O0144 - Procurement of spare parts for GL7 and GL50 Mine Safety Lamps on rate contract for a period of 2 years. - 17/08/2019 - 17:00 hrs.
E0419O0135 - Procurement of RIEGL Austria make Scanner 3D Laser imaging system - 19/08/2019 - 17:00 hrs.
E1719O0141 - Comprehensive AMC for EPABX Systems at different areas in SCCL for 3 years from 17.10.2019. - 19/08/2019 - 17:00 hrs.
E1119O0142 - Drilling, Excavation, Loading, Transportation, Dumping, Spreading & Levelling etc., of 171.69 lbcm of OB (169.59 lbcm of OB and 2.1 lbcm of Coal) with hired conventional equipment and additional works viz., 1000 Dozer hours, 1000 shovel hours & 10000 rmt of drilling at RGOC-I Expansion Project, RG-III area during a period of 24 months. - 20/08/2019 - 15:00 hrs.
E0219O0115 - Repair and Replacement of wear Resistant plates to Dump Bodies of Komatsu Make 100T Dumpers at various OC Projects under RC for a period of 2years. - 21/08/2019 - 17:00 hrs.
E0519O0112 - Procurement of Graphite Electrodes for 3T arc furnace at Central workshop Kothagudem, SCCL - 23/08/2019 - 17:00 hrs.
E0119O0149 - Procurement of various types of Side Discharge Loaders (SDLs) - 23/08/2019 - 17:00 hrs.
E1919O0106 - Outsourcing of loading, unloading and stocking of various material at Central Stores for a period of 2 (Two) Years - 26/08/2019 - 17:00 hrs.
NIT No., Date – Name of the work – ECV- Last date & time for Submission of bids
CW/RD/e-30/2019-20 Dt. 01-08-2019 – Providing water supply lines to R and R centre at Cherukupalli village, Sathupalli, Kothagudem Area. – Rs. 37,98,240/- up to 4.30 pm on 16-08-2019.
PR/2019-20/MP/CVL/VLM/43 GM, (MP) – GM, KGM

# చెరువు మురిసింది

## గోదావరి బేసిన్‌లో 6,159..
## కృష్ణా బేసిన్‌లో 1,077 చెరువుల్లో జలకళ

- కృష్ణా, గోదావరి నీటితో నిండుతున్న చెరువులు
- మిషన్ కాకతీయతో సత్ఫలితాలు



కుమ్రంభీం జిల్లా చింతలమానేపల్లి మండలంలో అలుగు పోస్తున్న బాబాసాగర్ చెరువు

**తంగళ్లపల్లి సంపత్/ హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సమైక్య పాలనలో విధ్వంసానికి గురైన చారిత్రక చెరువుల పునరుద్ధరణ కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ కాకతీయ సత్ఫలితాలిస్తున్నది. వర్షం నీటిని ఒడిసిపట్టడంతోపాటు, గోదావరి, కృష్ణా జలాల తరలింపుతో రాష్ట్రంలో చెరువులు నిండుకుండలా మారాయి. ప్రస్తుతం కృష్ణా, గోదావరి నదులు ఉధృతిగా ప్రవహిస్తుండటం, రిజర్వాయర్లు, కాల్వల కింద ఉన్న చెరువులకు నదుల నీటిని మళ్లిస్తున్నారు. ఫలితంగా ఒకచెరువు నిండటంతో గొలుసుకట్టుగా దానికింద మరిన్ని చెరువుల్లోకి నీరు వచ్చి చేరుతున్నది. రాష్ట్రంలో కాల్వల వ్యవస్థ పూర్తయిన భారీ, మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టుల కమాండ్ ఏరియాలో 16,700 చెరువులు ఉన్నాయి. ప్రస్తుతం గోదావరి, కృష్ణా నదులతో అనుసంధానం ఉన్న చెరువులన్నీ జలకళను సంతరించుకున్నాయి. గోదావరి బేసిన్‌లో మొత్తం 20,231 చెరువులు ఉండగా... ఈ నెల 1 వరకు 13,460 చెరువులు 25 శాతం, 2,494 చెరువులు 50 శాతం, 2,434 చెరువులు 75 శాతం, 1,231 చెరువులు 100 శాతం నిండాయి. ఇందులో 612 చెరువులు మత్తడి దుంకుతూ దిగువకు పారుతున్నాయి. కృష్ణా బేసిన్‌లో మొత్తం 23,609 చెరువుల్లోకి జలాలు చేరాయి. 22,479 చెరువుల్లో 25 శాతం, 820 చెరువుల్లో 50 శాతం, 161 చెరువుల్లో 75 శాతం, 96 చెరువుల్లో 100 శాతం నీళ్లు చేరాయి. 53 చెరువుల నుంచి మత్తడి దుంకుతున్నాయి.

తెలంగాణలో 46,531 చెరువులు ఉండగా.. మిషన్ కాకతీయపథకం కింద ప్రభుత్వం నాలుగు దశల్లో 25,985 చెరువులను పునరుద్ధరించింది. ఇందుకోసం తెలంగాణ ప్రభుత్వం రూ.8,741.80 కోట్ల విలువైన పనులు చేపట్టింది. ఈ చెరువుల కింద ఉన్న మొత్తం 21.39 లక్షల ఎకరాల ఆయకట్టుకు రెండుపంటలకు సాగునీరు లభించడంతోపాటు భూగర్భ జలాలూ గణనీయంగా పెరుగుతున్నాయి.

### కరువు జిల్లాల్లో సంబురం

ఉమ్మడి మహబూబ్‌నగర్ పరిధిలో దాదాపు 8 వేల చెరువులు ఉండగా.. 6 వేలకుపైగా చెరువుల్లోకి కృష్ణా జలాలు చేరాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో దాదాపు 8 లక్షల ఎకరాలు చెరువుల కింద ఆధారపడిసాగవుతున్నాయి. జూరాల నుంచి సమాంతర కాల్వ, ఎడమ, కుడి కాల్వ, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ పరిధిలోని చెరువులకు నీటిని మళ్లించారు. ఎగువన వర్షాలతో కృష్ణమ్మ ఉరకలెత్తుతుండగా.. వచ్చే వరదను సద్వినియోగం చేసుకునే నేపథ్యంలో చెరువులకు తరలిస్తున్నారు. అదేవిధంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కూడా 2,702 చెరువులు జలకళను సంతరించుకున్నాయి.

### 14.6 అడుగులకు పాకాల నీటిమట్టం

**ఖానాపురం:** కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో వరంగల్ రూరల్ జిల్లాలోని పాకాల సరస్సు నీటిమట్టం క్రమంగా పెరుగుతున్నది. శనివారం సాయంత్రానికి 14.6 అడుగులకు చేరుకున్నది. ఎగువ నుంచి వస్తున్న వరదతో ఆదివారం ఉదయానికి 15 అడుగులకు పైగా చేరే అవకాశం ఉన్నది. సరస్సు గరిష్ఠ నీటి మట్టం 30.3 అడుగులు. మరో 7 అడుగుల నీరు చేరితే వానకాలం సాగుకు ఢోకా లేనట్లే.

**మిషన్ కాకతీయ వివరాలివి**

| వివరాలు | మొదటి దశ | రెండోదశ | మూడోదశ | నాలుగో దశ | మొత్తం |
|---|---|---|---|---|---|
| చెరువుల మంజూరు | 8000 | 8976 | 6068 | 4627 | 27671 |
| ఆయకట్టు (ఎకరాలు లక్షల్లో) | 6.97 | 6.87 | 4.23 | 3.32 | 21.39 |
| పనిపూర్తయిన చెరువులు | 7968 | 7796 | 3398 | 1030 | 20192 |
| ఆయకట్టు స్థిరీకరణ (ఎకరాలు లక్షల్లో) | 6.83 | 5.01 | 1.59 | 0.37 | 13.80 |
| పెరిగిన నీటినిల్వ సామర్థ్యం (టీఎంసీల్లో) | 3.50 | 3.38 | 0.85 | 0.31 | 8.04 |

## యూరియాకు పెరిగిన డిమాండ్

వెంటనే సరఫరాచేయాలని ఎరువుల కంపెనీలను ఆదేశించిన వ్యవసాయశాఖ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వానలు ఊపందుకోవడంతో రాష్ట్రంలో యూరియాకు డిమాండ్ భారీగా పెరిగింది. తెలంగాణలో ఇప్పటికే 42 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుండటం, మక్కజొన్న సాగు, వరినాట్లు కూడా జోరందుకోవడంతో యూరియా కోసం రైతులు పరుగులు తీస్తున్నారు. ఈ నేపథ్యంలో యూరియాను వెంటనే సరఫరా చేయాలని ప్రభుత్వం ఎరువుల కంపెనీలను ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి శనివారం పలు ఎరువుల కంపెనీలకు లేఖ రాశారు. ఈ నెల 15 నాటికి 81,250 టన్నుల యూరియాను సరఫరా చేయాలని ఎరువుల కంపెనీలను కోరిన పార్థసారథి.. జిల్లాలకు ముందస్తుగానే యూరియాను తరలించాలని అధికారులను ఆదేశించారు.

## జైపాల్‌రెడ్డి, ముఖేష్‌గౌడ్ కుటుంబాలకు చంద్రబాబు పరామర్శ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇటీవల కన్నుమూసిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎస్ జైపాల్‌రెడ్డి, ముఖేష్ గౌడ్ కుటుంబసభ్యులను టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు శనివారం పరామర్శించారు. పార్టీ నేతలతోకలిసి వారి నివాసాలకు వెళ్లిన చంద్రబాబు కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.



తన తల్లి తారకమ్మ జ్ఞాపకార్థం వనపర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మొక్క నాటుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి



శనివారం నిర్మల్ జిల్లా లక్ష్మణచాందలో హరితహారంలో భాగంగా మొక్క నాటుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



జీవీకే ఈఎంఆర్ఐ సెంటర్‌లో ఎమర్జెన్సీ కేర్ సిమ్యులేషన్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్. చిత్రంలో మంత్రులు ఈటల రాజేందర్, చామకూర మల్లారెడ్డి, ఎంపీ రేవంత్‌రెడ్డి, జీవీకే రెడ్డి

# వాన హోరు.. హరిత జోరు

- జూన్ నుంచి నాటిన మొక్కలు 11 కోట్లు
- ప్రతి గ్రామంలో ప్రజాప్రతినిధులకు శిక్షణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో కురుస్తున్న వానలతో తెలంగాణకు హరితహారం కార్యక్రమం జోరందుకున్నది. ఐదో విడుత హరితహారంలో భాగంగా వివిధశాఖలు ఈ ఏడాది జూన్ నుంచి జూలై నెలాఖరు వరకు అడవుల వెలుపల సామాజిక వనాల పెంపు కింద సుమారు 10 కోట్ల మొక్కలు నాటగా, అటవీశాఖ కోటి మొక్కలు నాటింది. ఈ ఏడాది ఐదోవిడుత హరితహారం కార్యక్రమంలో 83.3 కోట్ల మొక్కలు నాటాలన్న భారీ లక్ష్యం పెట్టుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వానలు ఇందుకు ఊపునిస్తున్నాయి. వరంగల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, సిద్దిపేట, నాగర్‌కర్నూలు తదితర జిల్లాల్లో పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో జోరుగా మొక్కలు నాటుతున్నారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో మొక్కలను నాటి, వాటి పెంపకాన్ని దత్తత తీసుకుంటున్నారు. ఇప్పటికే హెచ్‌ఎండీఏ.. ఔటర్ రింగ్‌రోడ్డు లోపల ఉన్న ప్రాంతాల్లో 26 లక్షలకుపైగా మొక్కలను నాటగా, మరో 18 లక్షలు పంపిణీ చేసింది.

### ప్రతి గ్రామంలో శిక్షణ

హరితహారంలో భాగంగా ప్రజాప్రతినిధులు, స్థానికులు మొక్కలు నాటే సమయంలో తీసుకోవాల్సిన శాస్త్రీయమైన జాగ్రత్తలపై ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటుచేయాలని అటవీశాఖ అధిపతి, ఇంచార్జి పీసీసీఎఫ్ ఆర్ శోభ.. అధికారులను ఆదేశించారు. మొక్కలు నాటడానికి ఎంత పరిమాణంలో గుంతలు తవ్వాలి, ఎంత ఎత్తులో నాటాలి అనే అంశాలపై ప్రతి ప్రజాప్రతినిధికి వివరించాలని సూచించారు. ప్రతి మూడు నుంచి ఐదు గ్రామాలకు ఒక అధికారిని ఇంచార్జీగా నియమించి హరితహారంను పర్యవేక్షించాలని నిర్ణయించారు.



రెండు చేతులు లేకున్నా 'నేను సైతం' అంటూ మొక్కలు నాటి హరిత స్ఫూర్తి చాటుతున్న పెద్దపల్లి జిల్లా ఓదెల గ్రామ పంచాయతీ కార్యాలయం తాత్కాలిక ఉద్యోగి ఆకుల నరేశ్

# ప్రభుత్వ ప్రాథమ్యాలు అభినందనీయం

- తెలంగాణలో సిమ్యులేషన్ ఏర్పాటు మైలురాయి
- ఆపన్నులకు మేమున్నామనే నమ్మకం కలిగించాలి
- ఎమర్జెన్సీ కేర్ సిమ్యులేషన్ కేంద్రం ప్రారంభోత్సవంలో గవర్నర్ నరసింహన్

**శామీర్‌పేట:** బంగారు తెలంగాణ లక్ష్యసాధనలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు అత్యద్భుతమైనవని గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ అన్నారు. మొదటి ప్రాధాన్యంగా విద్యుత్, సాగు, తాగునీరు వంటి వాటిని తీసుకోగా.. రెండో ప్రాధాన్యంగా వైద్య, విద్యారంగాలను చేపట్టడం అభినందనీయమని చెప్పారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలంలోని జీవీకే ఈఎంఆర్ఐ సెంటర్‌లో ఎమర్జెన్సీ కేర్ సిమ్యులేషన్ కాంప్లెక్స్‌ను శనివారం గవర్నర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ జీవీకే ఈఎంఆర్ఐ సెంటర్‌లో ఏర్పాటుచేసిన ఎమర్జెన్సీ కేర్ సిమ్యులేషన్.. తెలంగాణ వైద్యరంగంలో మైలురాయిగా నిలిచిపోనున్నదని పేర్కొన్నారు. సామాన్య ప్రజానీకానికి విద్య, వైద్యం అందుబాటులోకి తెచ్చేలా ప్రభుత్వం మరింత పకడ్బందీ చర్యలు తీసుకోవాల్సిన అవసరమున్నదన్నారు. హైదరాబాద్ బస్తీ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు బస్తీ దవాఖానలు ఏర్పాటుచేయడం శుభపరిణామం అని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపడం ద్వారా దవాఖానలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని తెలిపారు. రోగులు, వారి బంధువులకు మేమున్నాం అనే నమ్మకం కలిగించేలా వైద్యులు సేవలందించాలన్నారు.

### ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మనిషి జీవితం కేంద్రంగా అల్లుకొని సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని రాష్ట్ర ఆరోగ్యమంత్రి ఈటల రాజేందర్ చెప్పారు. అతి తక్కువ కాలంలో అనేక కార్యక్రమాలు చేపట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్నామన్నారు. ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేందుకు మిషన్ భగీరథ చేపట్టి దేశానికే మార్గదర్శకంగా నిలువడం సంతోషదాయకం అని చెప్పారు. 108, 104 సేవల్లో ఎదురవుతున్న చిన్న చిన్న సమస్యలను పరిష్కరించి ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేలా చర్యలు తీసుకొంటామని తెలిపారు. కార్మిక, మహిళా సంక్షేమశాఖల మంత్రి సీ మల్లారెడ్డి మాట్లాడుతూ.. పేద ప్రజల ఆరోగ్యమే పరమావధిగా తెలంగాణ ప్రభుత్వం ప్రైవేట్ దవాఖానలకు దీటుగా ప్రభుత్వ హాస్పిటళ్లను తయారుచేసిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి ఎంపీ రేవంత్‌రెడ్డి, కలెక్టర్ ఎంవీ రెడ్డి, జీవీకే ఈఎంఆర్ఐ చైర్మన్ డాక్టర్ జీవీకే రెడ్డి, టాటా ట్రస్ట్స్ ప్రతినిధి ఆర్ కృష్ణకుమార్, డాక్టర్ కాకర్ల సుబ్బారావు, కేర్ చైర్మన్ సోమరాజు, డాక్టర్ డీ నాగేశ్వర్‌రావు, ఆర్డీవో లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మోసపోతారా.. నోరు విప్పుతారా!

- వినియోగదారుల్లో ప్రశ్నించేతత్వాన్ని పెంపొందించే ప్రయత్నం
- రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన వీడియోకు మంచి స్పందన




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తినేటివి.. తాగేటివి.. కల్తీచేయడం నేరం! పెట్రోల్, డీజిల్ కల్తీచేయడం మోసం! గడువు తీరిన మందులు అమ్మటం ద్రోహం! తూకాలు, కొలతల్లో మోసంచేయడం అన్యాయం! 'మోసపోతారా.. నోరు విప్పుతారా' అంటూ హీరో శ్రీకాంత్ ద్వారా వినియోగదారుల్లో అవగాహన కల్పించడంతోపాటు ప్రశ్నించేతత్వాన్ని పెంపొందించేందుకు తెలంగాణ పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలశాఖ ఇటీవల ఓ వీడియోను ఆవిష్కరించింది. యూట్యూబ్‌లో విడుదల చేసిన ఈ వీడియో వినియోగదారుల హక్కులను తెలియజేసేలా ఉందంటూ నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. సోషల్‌మీడియా వేదికగా ఇలాంటి ప్రయత్నంచేయడం వల్ల మంచిఫలితం లభిస్తుందని అభిప్రాయపడుతున్నారు. ప్రతిఒక్కరు బాధ్యతాయుతంగా మెలగాలని, వినియోగదారులు మోసాలను సహించకుండా టోల్ ఫ్రీ నంబర్ 1800 425 00333 కు ఫిర్యాదుచేయాలని అధికారులు సూచిస్తున్నారు.

# వైవాహిక వివాదాల్లోనూ వీడియో సాక్ష్యం

- కీలక తీర్పు వెలువరించిన హైకోర్టు
- అమెరికాలో ఉన్న పిటిషనర్ వాంగ్మూలాన్ని వీడియోకాన్ఫరెన్స్ ద్వారా రికార్డు చేయాలని ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** క్రిమినల్ కేసుల్లో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా వాంగ్మూలాలను రికార్డు చేయడానికి అనుమతి ఉన్నప్పుడు వైవాహిక సంబంధ వివాదాల్లో ఎందుకు ఉండకూడదని హైకోర్టు వ్యాఖ్యానించింది. అమెరికాలో ఉన్న కక్షిదారు సాక్ష్యం లేదా ఆధారాలు ఇవ్వడానికి భారత్‌కు వస్తే ఉద్యోగాన్ని కోల్పోయే పరిస్థితిలో ప్రత్యక్షంగా హాజరుకావాలని చెప్పడం సరికాదని జస్టిస్ ఎమ్మెస్ రాంచందర్‌రావు నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం స్పష్టంచేసింది. 'స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర అండ్ పీసీ సింగ్ వర్సెస్ ప్రఫుల్ బీ దేశాయి అండ్ అదర్స్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలతోపాటు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడంతో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం అందుబాటులోకి వచ్చినందున నేరుగా మాట్లాడే అవకాశం ఉన్నది. ఈ విధంగా రికార్డుచేసిన ఆధారాలు సీఆర్పీసీలోని సెక్షన్ 273లో పేర్కొన్న ఆవశ్యకతలకు పూర్తిగా సరిపోతాయి' అని ధర్మాసనం పేర్కొన్నది. వీడియోకాన్ఫరెన్స్‌ను నిరాకరిస్తూ హైదరాబాద్ సిటీ సివిల్ ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు తోసిపుచ్చుతూ.. అమెరికాలో ఉన్న పిటిషనర్ వాంగ్మూలాన్ని వీడియోకాన్ఫరెన్స్ ద్వారా రికార్డుచేయాలని ఆదేశించింది.

# శాంతిస్థాపనే భారత్ యుద్ధనీతి

- ఆయుధ సంపత్తి బలోపేతానికి చర్యలు
- బీడీఎల్ గోల్డెన్‌జూబ్లీ ఉత్సవాల్లో కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్



శనివారం కంచన్‌బాగ్‌లోని బీడీఎల్ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా ఎమ్మార్-సామ్‌ను భారత వాయుసేనకు అందజేస్తున్న కేంద్ర రక్షణమంత్రి రాజనాథ్‌సింగ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** శాంతిస్థాపనే భారత యుద్ధనీతి అని, భారత సైన్యం ఎన్నడూ పక్క దేశంపై దాడి చేయాలన్న ఉద్దేశంతో ఉండదని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. దేశ రక్షణ విధానం.. సంయమనం, సంతులనం, అశాంతి నెలకొనే పరిస్థితి వస్తే సంహారం అన్న మూడు సూత్రాలపై నడుస్తున్నదని తెలిపారు. ప్రపంచశాంతి, స్థిరత్వం కోసమే మన సైన్యం సరిహద్దుల్లో పనిచేస్తున్నదని చెప్పారు. హైదరాబాద్ కంచన్‌బాగ్‌లో శనివారం నిర్వహించిన బీడీఎల్ (భారత్ డైనమిక్స్ లిమిటెడ్) గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలకు రాజ్‌నాథ్‌సింగ్ ముఖ్యఅతిథిగా హాజరై బీడీఎల్ ఆవరణలో నెలకొల్పిన భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఇజ్రాయెల్ సహకారంతో బీడీఎల్ తయారుచేసిన ఎమ్మార్-సామ్ (మీడియం రేంజ్ సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్)ను భారత వాయుసేనకు అందజేశారు. బీడీఎల్ గోల్డెన్‌జూబ్లీ పోస్టల్ స్టాంప్‌ను ఆవిష్కరించారు. బీడీఎల్ ఇబ్రహీంపట్నం క్యాంపస్‌లో 24 లక్షల లీటర్ల సామర్థ్యంతో జలనిధి పేరుతో ఏర్పాటుచేసిన ఇంకుడుగుంతను, కంచన్‌బాగ్‌లో 5 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటుచేసిన సోలార్ ప్లాంట్ల శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడుతూ.. శాంతిస్థాపనతోపాటు సాయుధ బలగాలను ఆధునీకరించడం, ఆయుధ సంపత్తి బలోపేతానికి కేంద్రం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నదని స్పష్టంచేశారు. ఆయుధాలన్నీ దేశంలోనే తయారుచేసేలా చర్యలు తీసుకుంటామని, దీనివల్ల యువతకు కూడా ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. 2025 వరకు రక్షణరంగ ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్టు తెలిపారు. పృథ్వీ, అకాశ్, అగ్ని, నాగ్, త్రిశూల్, బ్రహ్మోస్ ఇలా మిస్సైళ్ల పేర్లు చూస్తేనే మన రక్షణ విధానం అర్థమవుతున్నదని, అదే పాకిస్థాన్ మిస్సైళ్ల పేర్లను చూస్తే బాబర్, గోరి, గజినీ.. ఇలా దాడికి పురిగొల్పే తరహాలో ఉంటాయని వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్రమోదీ తీసుకొచ్చిన రక్షణ విధానాలు, ఆర్థిక సంస్కరణలతో ప్రపంచం మరోసారి మన వైపు చూస్తున్నదని రాజ్‌నాథ్‌సింగ్ పేర్కొన్నారు.

### ఎంతో ప్రగతి సాధించాం

సైన్యానికి అవసరమైన మిస్సైళ్ల తయారీలో బీడీఎల్ ఎంతో ప్రగతి సాధించినట్టు బీడీఎల్ సీఎండీ సిద్ధార్థ మిశ్రా అన్నారు. అత్యాధునిక మిస్సైళ్ల తయారీలో బీడీఎల్, డీఆర్డీవో సహ అనేక సంస్థలు కలిసి పనిచేస్తున్న తీరు సంతోషకరమైందని, ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని డీఆర్డీవో చైర్మన్ డాక్టర్ సతీశ్‌రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రక్షణశాఖ ఆర్థికకార్యదర్శి గార్గి కౌల్, వైస్ చీఫ్ ఎయిర్ మార్షల్ ఆర్కేఎస్ బదూరియా, రక్షణశాఖ సంయుక్త కార్యదర్శి డాక్టర్ అమిత్‌సహాయ్, బీడీఎల్ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# తనకి తోడుగా ఈ విషయంలో కూడా భాగస్వామి అవ్వండి.

## కలిసి సంతానలేమిపై పోరాడండి.

INDIRA IVF
FERTILITY & IVF CENTRE



## ఉచిత సంతానలేమి కన్సల్టేషన్ క్యాంప్

పిల్లలు లేని దంపతుల కోసం

ఇప్పుడు మీ నగరంలో

మొదటి వచ్చిన వారికి మొదట ప్రాతిపదికన పరిమిత సీట్లు

### భూపాలపల్లి (జయశంకర్ )

9 ఆగస్టు 2019

SMS IVF HB Send to 56677

ఉచిత కన్సల్టేషన్‌కి మీరు సీటు బుక్ చేసుకోవడానికి
SMS IVF<space>HB and send to 56677

### కొత్తగూడెం

10 ఆగస్టు 2019

SMS IVF HK Send to 56677

ఉచిత కన్సల్టేషన్‌కి మీరు సీటు బుక్ చేసుకోవడానికి
SMS IVF<space>HK and send to 56677

### మహబూబాబాద్

11 ఆగస్టు 2019

SMS IVF HM Send to 56677

ఉచిత కన్సల్టేషన్‌కి మీరు సీటు బుక్ చేసుకోవడానికి
SMS IVF<space>HM and send to 56677

అపాయింట్‌మెంట్ కోసం కాల్ చేయండి ✆ 741 2077 801

### కన్సల్టేషన్ పొందదగిన వ్యక్తులు

- మూసుకుపోయిన ఫాలోపియన్ నాళాలు
- అండం ఏర్పాటు సమస్య
- అసమగ్ర రుతుస్రావ చక్రం
- అండాల అకాల విడుదల

- తక్కువ వీర్యకణ సంఖ్య
- వీర్య కణాలు లేకపోవుట
- తక్కువ వీర్యకణ మోటిలిటీ
- తక్కువ నాణ్యత

### ఇందిర IVF హాస్పిటల్ ప్రైవేట్ లిమిటెడ్

మహేష్ బ్యాంక్ ఎదురుగా, రోడ్డు నెం.12, A' La లిబర్టీ హోటలు ప్రక్కన, బంజారాహిల్స్, హైదరాబాద్
**Helpline** 7412077804 | **Website** www.indiraivf.com | **Email** help@indiraivf.in

మీ విచారణల గురించి చర్చించుటకు మా సాఫల్యతా నిపుణులను సంప్రదించండి ✆ 7412077802
(2 PM to 5 PM)

అందుబాటులోని సేవలు: • ఫెర్టిలిటీ చెకప్ • IUI • IVF • ICSI • లేజర్ హ్యాచింగ్ • బ్లాస్టోసిస్ట్ • ల్యాపరోస్కోపి • హిస్టరోస్కోపి • డోనర్ సేవలు

- 71 Centres PAN India
- Treatment protocol as per individual need
- Patient friendly treatment options

Disclaimer : The models used in the creative is just for illustration purpose only.

Prenatal Sex Determination & Sex Selection is illegal and not done here.

నమస్తే తెలంగాణ
# జిందగీ
ఆదివారం 4 ఆగస్టు 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

కరీంనగర్



నటన, సినిమా ప్రపంచం గురించి పరిజ్ఞానం అవగాహన లేని ఓ సాధారణ యువతి ఆమె. ఎమ్‌బీఏ పూర్తి చేసి మార్కెటింగ్ జాబ్ చేయాలని కలలు కన్నది. కానీ అనూహ్యంగా వెండితెరపై అడుగుపెట్టింది. చక్కటి అభినయపటిమతో తెలుగుతో పాటు తమిళం, మలయాళం, హిందీ భాషల్లో అవకాశాల్ని దక్కించుకుంటూ ప్రతిభను చాటుకుంటున్నది. ఆమె ఎవరో కాదు తాప్సీ. తొలినాళ్లలో గ్లామర్ పాత్రలతో ప్రేక్షకుల్ని ఆకట్టుకున్న ఈ సొగసరి ప్రస్తుతం మహిళా ప్రధాన ఇతివృత్తాలకు, ప్రయోగాలకు చిరునామాగా మారింది. తొమ్మిదేళ్ల సినీ ప్రయాణంలో తనకు ఎదురైన ఎత్తుపల్లాలను గురించి తాప్సీ 'జిందగీ'తో పంచుకున్నది. ఆ ముచ్చట్లివి..

# స్టార్ హీరోల కోసం ఎదురుచూడను

**■ ప్రతిసారీ కొత్త కథలను వెతుక్కోవడం ఎలా సాధ్యమవుతున్నది?**

కథలతోపాటు పాత్రల పరంగా సవాళ్లను ఎదుర్కోవడానికి నేను ఎప్పుడూ సిద్ధంగా ఉంటాను. ఎలాంటి కష్టం లేకుండా సింపుల్, కంఫర్టబుల్‌గా షూటింగ్‌ను పూర్తిచేసి ఇంటికి వెళ్లిపోతే సంతోషం ఉండదు. ప్రతిరోజూ కొత్త కథ, పాత్రలో ఒదిగిపోతూ ఉత్సుకతతో ప్రయాణాన్ని కొనసాగించాలని కోరుకుంటాను. ఎలాంటి సినిమాలు చేయాలనే విషయంలో నాకంటూ కొన్ని నిర్దిష్టమైన ఆలోచనలు ఉన్నాయి. వాటికి అనుగుణంగానే ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాను.

**■ 'పింక్' సినిమా తర్వాత మీ కెరీర్‌లో చాలా మార్పులు కనిపిస్తున్నాయి. ఆ సినిమా మీ ఆలోచనా ధోరణిలో ఎలాంటి మార్పుల్ని తెచ్చింది.**

నాకు సరిపోయే కథాంశాలేమిటో, నా నుంచి ప్రేక్షకులు ఏం కోరుకుంటున్నారో 'పింక్' తర్వాతే అర్థమైంది. కథల విషయంలో సరైన జడ్జిమెంట్ వచ్చింది. మంచి దర్శకుల్ని ఎంచుకొనే అవగాహన సామర్థ్యాలు ఆ సినిమా తర్వాతే అలవడ్డాయి.

**■ మీ తొలి ప్రాధాన్యం స్టార్ హీరోలకా? మంచి కథలకా?**

కథతో పాటు ప్రతిభావంతులైన దర్శకులకే ప్రాముఖ్యం ఇస్తాను. సాధారణ కథను తన దర్శకత్వ ప్రతిభతో జనరంజకంగా తీర్చిదిద్దే సత్తా దర్శకులకు ఉండాలి. మంచి కథ సమర్థుడైన దర్శకుడి చేతిలో పడకపోయినా నష్టమే జరుగుతుంది. ఓ సినిమాను అంగీకరించే ముందు కథేమిటి, ఆ సినిమాకు దర్శకుడు ఎవరో చూసుకుంటాను. ప్రస్తుతం స్టార్ హీరోల కోసం ఎదురుచూడాల్సిన అవసరం నాకు లేదు. కెరీర్ తొలినాళ్లలో బిగ్‌స్టార్స్‌తో సినిమాలు చేయాలని కోరుకున్నాను. ఆశించిన మేర అవకాశాలు రాలేదు. ఆ తర్వాత వారి గురించి ఆలోచించడం మర్చిపోయి నా పంథాను మార్చుకున్నాను.

**■ మిమ్మల్ని దృష్టిలో పెట్టుకొని కథలు రాసే స్థాయికి ఎదుగుతానని ఊహించారా?**

స్టార్ హీరోలతో సినిమాలు చేసినంత మాత్రాన పెద్ద హీరోయిన్ అయిపోరు. విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకుల హృదయాల్లో నిలిస్తేనే అగ్రకథానాయికగా ఎదిగినట్లుగా నేను భావిస్తాను. అదే నా దృష్టిలో అసలైన విజయం. ఈ సక్సెస్‌ను నేను ప్రస్తుతం ఆస్వాదిస్తున్నాను. ఇదివరకు నేను చేసిన తప్పులు, పరాజయాలు, వాటి నుంచి నేర్చుకున్న అనుభవాలు, పడిన కష్టాలు అన్నింటికీ తగిన ప్రతిఫలం దక్కినట్లుగా అనిపిస్తున్నది. నన్ను స్ఫూర్తిగా తీసుకొని వైవిధ్యమైన కథలు రాస్తున్నామనే మాటలు దర్శకుల నోటి నుండి వింటున్నప్పుడు గర్వంగా ఉంటుంది.

**■ తొమ్మిదేళ్ల ప్రయాణంలో ఎన్నో అవరోధాలు, విమర్శలు ఎదుర్కొన్నారు. ఈ జర్నీలో ఏం నేర్చుకున్నారు?**

సినిమాలు, ఇండస్ట్రీ గురించి ఏమీ తెలియకుండానే నటినయ్యాను. సినిమాల్లోకి వస్తానని, హీరోయిన్‌ను అవుతానని అనుకోలేదు. ఎమ్‌బీఏ పూర్తి చేసి మార్కెటింగ్ జాబ్ చేయాలని కలలు కన్నాను. కానీ, యాదృచ్ఛికంగా సినిమాల్లోకి వచ్చాను. తొమ్మిదేళ్ల కెరీర్‌లో ఎన్నో ఎత్తుపల్లాలు ఎదుర్కొన్నాను. ప్రతి సినిమా నాకో అనుభవపాఠంగా నిలిచింది. గతంలో చేసిన పొరపాట్లు పునరావృతం కాకుండా ప్రస్తుతం జాగ్రత్త పడుతున్నాను. ప్లాన్ చేస్తూ సినిమాలు చేయడం ఇప్పటికీ అలవాటు లేదు. యథాలాపంగా వచ్చిన అవకాశాల్లో నుంచి మంచి వాటిని ఎంచుకుంటూ సినిమాలు చేస్తుంటాను.

**■ దర్శకుల పనిలో మీరు జోక్యం చేసుకుంటారని వింటున్నాం?**

పూర్వ నిర్మాణ పనులు జరుగుతున్నప్పుడే రచయిత, దర్శకులతో నా అభిప్రాయాలు పంచుకుంటాను. ఏది మంచి, ఏది కాదో వెల్లడిస్తాను. నాకు నచ్చనివి ఏమైనా ఉంటే చెబుతాను. అంతేగానీ నా ఆలోచనల్నీ బలవంతంగా ఇతరులపై రుద్దను.

**■ దక్షిణాది కంటే బాలీవుడ్ మీ ప్రతిభను బాగా గుర్తించి సరైన పాత్రల్ని ఇచ్చిందని అనుకుంటున్నారా?**

హిందీ నా మాతృభాష కావడంతో బాలీవుడ్‌లో ప్రయోగాలు చేయడానికి ఎక్కువ అవకాశం దొరికింది. దక్షిణాది భాషలపై పెద్దగా పట్టులేకపోవడంతో వైవిధ్యమైన సినిమాలు చేయలేకపోయాను. భాషపై పట్టులేకపోవడంతోనే ప్రతిభను నిరూపించుకునే అవకాశాలు ఇక్కడ పరిమితంగా లభించాయి.

**■ ఫిట్‌నెస్ పరంగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారు?**

ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడానికి ఎక్కువగా స్క్వాష్ ఆడుతాను. చాలా శారీరక శ్రమతో కూడుకున్న ఆట అయినా ఫిట్‌గా ఉండటానికి ఉపకరిస్తుంది. అదే నా గ్లామర్ సీక్రెట్.

**■ సినిమాల ఒత్తిడి నుంచి ఎలా సేదతీరుతుంటారు?**

ప్రపంచంలో నా గురించి ఎవరికీ తెలియని ప్రదేశానికి ఒంటరిగా వెళ్లిపోతాను. ఫోన్ స్విచాఫ్ చేస్తాను. కెరీర్, జీవితం, సినిమాలకు సంబంధించిన ఆలోచనలన్నీ పక్కనపెట్టి సరదాగా కొన్నాళ్లు ఆ ప్రదేశంలో విహరిస్తూ ఒత్తిడి నుంచి దూరం అవుతాను.

**■ కమర్షియల్ సినిమాలు చేశారు? నటనకు ప్రాముఖ్యం కలిగిన పాత్రల్లో నటించారు. ఎందులో ఎక్కువ సంతృప్తి దొరికింది?**

కమర్షియల్ చిత్రాలన్నీ పెద్ద సెటప్, కలర్‌ఫుల్ క్యాస్ట్యూమ్స్, భారీ నిర్మాణ విలువలతో కూడి ఉంటాయి. ఆ సినిమాల్లో ఆనందంగా నటించాను. అలాంటి పాత్రలే చేస్తూ పోవడంతో విసుగు చెంది వైవిధ్యమైన కథల్ని ఎంచుకోవడం మొదలుపెట్టాను. రోజుకో కొత్త కాన్సెప్ట్, పాత్రలు లభిస్తుండటంతో ప్రస్తుతం ఈ ప్రయాణం సంతోషంగా సాగిపోతున్నది. బోర్ కొట్టిన రోజు ఈ డిఫరెంట్ సినిమాల్ని వదిలివేసి మరో కొత్త మార్గాన్ని అన్వేషిస్తాను.

**■ తెలుగు సినిమాలకు దూరమయ్యే ఆలోచనల్లో ఉన్నారా? ప్రస్తుతం వస్తున్న తెలుగు సినిమాల్ని చూస్తుంటారా?**

తెలుగు సినిమాలకు ఎప్పటికీ దూరం కాను. ఏడాదికి ఓ సినిమాలో తప్పకుండా నటిస్తాను. విభిన్నమైన ఇతివృత్తాల కంటే కమర్షియల్ సినిమాల్లో తెలుగు ప్రేక్షకులు నన్ను ఎక్కువగా చూశారు. అందుకే నాలోని నటిని వారికి పరిచయం చేసే వినూత్నమైన కథల కోసం ఎదురుచూస్తున్నాను. తెలుగులో విడుదలవుతున్న అన్ని సినిమాలు కాకుండా బాగున్నాయని ప్రేక్షకులు తీర్పునిచ్చిన సినిమాలే చూస్తుంటాను.

**■ సెట్స్‌లో తాప్సీకి, ఇంట్లో తాప్సీకి ఎలాంటి తేడాలుంటాయి?**

సెట్‌లో యాక్టర్‌ను అయితే ఇంట్లో మాత్రం సాధారణ యువతినే. షూటింగ్‌కు ప్యాకప్ చెప్పి ఇంట్లో అడుగుపెట్టగానే సినిమా ప్రపంచాన్ని పూర్తిగా మర్చిపోయి అమ్మానాన్నలు, చెల్లితో కాలక్షేపం చేస్తాను. ఇండస్ట్రీకి సంబంధం లేని స్నేహితులే నాకు ఎక్కువగా ఉన్నారు. వారితో కలిసి సినిమాలకు, డిన్నర్స్‌కు వెళుతుంటాను.

**■ చెల్లితో మీ అనుబంధం ఎలా ఉంటుంది?**

సినిమాలకు సంబంధించి ఏదైనా అనుమానం వస్తే చెల్లితోనే చర్చించి నివృత్తి చేసుకుంటాను. తనే నా సినిమాలకు తొలి ప్రేక్షకురాలు. సినిమా బాగుంటే నచ్చిందని, బాగా లేకపోతే ఏం నచ్చలేదో నిర్మొహమాటంగా తన అభిప్రాయం చెబుతుంది.



**పెండ్లి గురించి ఆలోచిస్తుంటారా?**

ప్రేమ, పెండ్లి గురించి ఆలోచించే తీరిక నాకు లేదు. నాకు ఓ కుటుంబం ఉండాలి, పిల్లలు కావాలని అనిపించిన రోజు తప్పకుండా పెళ్లి చేసుకుంటాను.

...✍ నరేష్ నెల్కి
📷 సీఎం ప్రవీణ్‌కుమార్

# మిస్ ఇంగ్లాండ్‌గా.. ఇండియా యువతి

**ఇటీవల ఇంగ్లాండ్‌లో జరిగిన మిస్ ఇంగ్లాండ్ పోటీల్లో భాషా ముఖర్జీ కిరీటాన్ని దక్కించుకున్నది. ఆమె భారత సంతతికి చెందిన యువతి కావడం విశేషం.**



**భా**షా ముఖర్జీ డాక్టర్. కానీ మోడలింగ్ అంటే ఇష్టం. ఇండియాల్లో పుట్టిందామె. తొమ్మిదేండ్లప్పుడు తల్లిదండ్రులతో కలిసి ఇంగ్లాండ్ వెళ్లింది. అక్కడే ఉన్నత చదువులు చదివింది. 5 భాషలు అనర్గళంగా మాట్లాడగలుగుతుంది ముఖర్జీ. ఐక్యూ లెవల్ 146 ఉంది. అందుకే అనేక పోటీల్లో పాల్గొని జీనియస్ అనిపించుకున్నది. రెండు మెడికల్ డిగ్రీలు కలిగి ఉంది. మెడికల్ సైన్స్, నాటింగ్‌హమ్ వర్సిటీ నుంచి సర్జరీలో పట్టా పొందింది. మిస్ ఇంగ్లాండ్ ఫైనల్ రౌండ్ ముగిసిన కొన్ని గంటల తర్వాతే ఆమె డాక్టర్‌గా విధులు చేపట్టారు. బోస్టన్ హాస్పిటల్లో జూనియర్ డాక్టర్‌గా చేరారు. మిస్ వరల్డ్ పోటీల్లోనూ ఆమె పాల్గొననున్నారు. ముఖర్జీ చాలా హార్డ్ వర్కర్ అనీ, బహుళ సంస్కృతి దేశం ఇంగ్లాండ్ తరపున విజయం సాధించడం గర్వకారణం అని మిస్ ఇంగ్లాడ్ పోటీల డైరెక్టర్ ఏంజీబీస్లే కొనియాడారు. 'కిరీటం దక్కింది అనగానే మేం గాల్లో విహరిస్తాం అనుకుంటారు. ఎవరినీ లెక్కచేయమని అనుకుంటారు. కానీ ఏదైనా సందర్భం వస్తే అందరికీ అండగా నిలుస్తాం. మెడికల్ స్కూల్‌లో ఉన్నప్పుడు మోడలింగ్ ఎంచుకున్నా. చదువు, కెరీర్‌ని రెండింటినీ బ్యాలెన్స్ చేస్తా. ఆ ధైర్యంతోనే ముందడుగు వేశా. నేను భారత సంతతికి చెందిన దానిని అయినందుకు ఎంతో గర్విస్తున్నా' అంటున్నది భాషా ముఖర్జీ.

# వర్షాకాలం.. పాదాలు భద్రం

**వర్షాకాలంలో పాదాలు మురికి బారిన పడుతుంటాయి. మట్టి, దుమ్ము కారణంగా అంటువ్యాధులు సంతరించుకుంటాయి. శరీరంలో అత్యంత కీలకమైనవి పాదాలు కాబట్టి మరింత శ్రద్ధ కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ చిట్కాలతో పాదాలను శుభ్రంగా ఉంచుకోండి.**



- పసుపు యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్, యాంటీ వైరల్ లక్షణాలను కలిగి ఉంటుంది. పసుపును నీటితో కలుపాలి. ఈ మిశ్రమాన్ని పాదాలకు రాసుకోవాలి. ఆరిన తర్వాత నీటితో శుభ్రపరుచుకోవాలి.
- కొన్నిసార్లు పాదాల దగ్గర దురద పెడుతుంటుంది. అలాంటి సమయంలో నిమ్మరసం, వెనిగర్ రెండింటినీ కలుపాలి. ఈ మిశ్రమాన్ని పాదాలకు రాసుకోవాలి. 10 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడుగాలి.
- ఉల్లిరసం ఎక్కువగా షూస్ ధరించే వారికి చమట, మురికి కారణంగా పాదాల సమస్యలు ఎదురవుతుంటాయి. ఉల్లిగడ్డ రాసాన్ని కాలి వేళ్ళ మధ్య రాసి మర్దన చేయాలి. 15 నిమిషాల తర్వాత నీటితో శుభ్రపరుచుకుంటే దురద నుంచి ఉపశమనం కలుగుతుంది.
- వర్షాలకు ఎక్కువగా తడువడం వల్ల పాదాలు ఇన్ఫెక్షన్ బారిన పడుతుంటాయి. తులసితో తయారు చేసిన ఫుట్ ప్యాక్స్ వాడడం వల్ల పాదాలను కొంతమేరకు కాపాడుకోవచ్చు. ఈ సమస్యకు తులసి అద్భుతంగా పనిచేస్తుంది.
- పాదాల నుంచి దుర్వాసన వస్తుంటే.. వేపాకులు, పెప్పర్మింట్ ఆయిల్ వేసి బాగా కలుపాలి. ఈ మిశ్రమాన్ని పాదాలకు రాయాలి. 20 నిమిషాల తర్వాత నీటితో కడుగాలి. ఆ తర్వాత పొడిబట్టతో పాదాలను తుడిచి టాల్కం పౌడర్ వేసి విశ్రాంతినివ్వాలి. ఇలా చేయడం వల్ల దుర్వాసన తగ్గుతుంది.






II.
నమస్తే తెలంగాణ
# సింగిడి
[ కరీంనగర్ ]
ఆదివారం 4 ఆగస్టు 2019

## నిజమైన స్నేహితుడు

బాల్యం నుంచి స్కూల్, కాలేజీ, ఉద్యోగం, వ్యాపారం.. మనిషి జీవితంలోని అన్ని వయసుల్లో కచ్చితంగా ఓ ఫ్రెండ్ ఉంటాడు. మధుర జ్ఞాపకాలుంటాయి. గుండెను పిండేసే గాథలుంటాయి. ఒక్కసారి కళ్లుమూసుకుంటే ఆ నిజమైన స్నేహితులు మీ మదిలో విహరిస్తుంటారు. మీకోసం కష్టపడిన, మీ కోసం తన జీవితాన్ని త్యాగం చేసినా, మీ కోసం దెబ్బలు తిన్న, మీకోసం చిలిపి పనులు చేసిన.. మిమ్మల్ని సంతోషపెట్టిన ఆ స్నేహితులను మరలా మననం చేసుకోండి.

స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు



భాషకందని కమ్మటి భావన స్నేహం. జీవితంలో మరిచిపోలేని మధుర జ్ఞాపకం. జీవితం చుట్టూ ఒక గాఢాంధకారం అలుముకున్నప్పుడు, నిరాశా నిస్పృహలు చుట్టుముట్టినపుడు 'నీ కోసం నేనున్నానురా' అంటూ భుజం తట్టే ఆత్మీయమైన స్పర్శ స్నేహం. అదే విషాదాన్ని సగానికి సగం తగ్గిస్తుంది. మానవ సంబంధాలన్నీ ఆర్థిక బంధాలుగా మారిపోయిన వేళ.. మనిషి జీవితం స్మార్ట్‌ఫోన్ చుట్టూ తిరుగుతున్న వేళ.. మనిషన్నవాడు మాయమైపోతున్న తరుణంలో ఇంకా ఎక్కడో ఒకచోట ఆత్మీయమైన స్నేహాలు వెలుగురేఖలుగా దారి చూపుతూనే ఉన్నాయి. ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి ఒకచోట కలుస్తారు. మహా వృక్షంలా ఎదుగుతారు. జీవితంతో మమేకమవుతారు. కాలేజీలోనో, లైబ్రరీలోనో, కలిసి నడిచే కారిడార్‌లోనో, తరగతి గదిలోని ఒకే బెంచిపై, మాస్టారు బోధించే పాఠాల్లోని సందేహాల్లో ఊపిరి పోసుకొనే స్నేహం.. విడదీయరాని బంధమవుతుంది. అందుకే ఫ్రెండ్‌షిప్ ఎవర్‌గ్రీన్. ఈ స్నేహితుల దినోత్సవం రోజున మరొక్కసారి మీ స్నేహితులను పలుకరించండి. స్నేహితుల జ్ఞాపకాలు గుండె చప్పుడులో చేసే సందడే వేరు. ఆ మధురానుభూతులను తలుచుకుంటూ ఒక్కసారి రెప్పవేస్తూ విహరించండి. ప్రియమైన స్నేహితులు గుండెను గిలిగింతలు పెడతారు. పెదవిపై చిరునవ్వు తెప్పిస్తారు. ఒకరా, ఇద్దరా.. అంతా కళ్లలో మెదులుతుంటారు. మరెందుకాలస్యం మీ స్మార్ట్‌ఫోన్‌తో అందర్నీ ఏకం చేయండి. గ్రూప్‌కాలింగ్‌లో ఊసులు చెప్పుకోండి. స్నేహితుడి తప్పును క్షమించినవాడే నిజమైన స్నేహితుడు!



## వారి యవ్వన రహస్యం

ప్రపంచ దేశాల్లో జపాన్ మహిళలు ప్రత్యేకంగా కనిపిస్తారు. చక్కటి ఫిట్‌నెస్, బ్యూటీఫుల్ స్కిన్, మెరిసే హెయిర్. ఇలా అన్ని రకాలుగా అందంగా కనిపిస్తారు. ఇందుకు కారణాలేంటో ఇప్పుడు తెలిసిపోయాయి. జపాన్ మహిళలు చిన్నప్పటి నుంచే ఆరోగ్యకరమైన, మంచి ఆహారం తీసుకుంటుండడమే ఆందుకు కారణమట. వాళ్ల డైట్ విధానం పాటిస్తే.. ఎవరైనా సరే ఎక్కువ కాలం యవ్వనంగా కనిపిస్తారు. ప్రధానంగా వాళ్లు పోషకాలు ఎక్కువగా ఉండే ఆహారం తింటునట్లు తెలిసింది. జపాన్ ప్రజల డైట్‌లో ఎక్కువగా గింజలు, ధాన్యాలు, కాయగూరలు, సముద్ర చేపలు, పాలు, పండ్లు, హెర్బల్ టీ ఉంటున్నాయి. ఇవన్నీ అధిక బరువును తగ్గించేవే. జపాన్ ప్రజలు ఇష్టపడి తాగేది గ్రీన్ టీ. ఎందుకంటే దీనివల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు. ముఖ్యంగా పొట్ట పెరగకుండా ఉండేందుకు గ్రీన్ టీ బాగా ఉపయోగపడుతుంది. నిద్ర లేవగానే జపాన్ మహిళలు గ్లాస్ మంచినీళ్లు తాగుతారట. దీనివల్ల పొట్టలో మొత్తం క్లీన్ అవ్వడమే కాక చర్మం పొడిబారకుండా కోమలంగా ఉంటుంది. 'తక్కువ తిను.. ఎక్కువ సార్లు తిను' అనేది వారి హెల్త్ సీక్రెట్.



## ప్రియమైన తండ్రులారా వినండి..

రెండోసారి తల్లి అయిన బాలీవుడ్ నటి సమీరారెడ్డి తల్లిపాల వారోత్సవాల్ని జరుపుకుంటున్నది. ప్రెగ్నెన్సీ సమయంలో ఆమె సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉన్నది. ప్రత్యేక ఫొటోషూట్ కూడా చేసింది. బిడ్డ పుట్టాక ఆ శుభవార్తను ఫ్యాన్స్‌తో పంచుకుంటూ ఫొటోలు పెట్టింది. అవన్నీ వైరల్ కాగా.. తాజాగా ఆమె ఓ వీడియో పెట్టి దాంతోపాటూ ఓ స్ట్రాంగ్ మెసేజ్ కూడా పంపింది. ఆ వీడియోకి ప్రస్తుతం మంచి కామెంట్స్ వస్తున్నాయి. చాలామంది ఆమెకు సపోర్ట్‌గా నిలుస్తున్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా వీడియో పెట్టిన సమీరా అందుకు సంబంధించి తన అభిప్రాయాన్ని ఫ్యాన్స్‌తో మెసేజ్ రూపంలో చెప్పింది. ప్రపంచ బ్రెస్ట్ ఫీడింగ్ వీక్ సందర్భంగా తన కూతురి ఫొటోను కూడా షేర్ చేసింది సమీరా రెడ్డి. ఈ సందర్భంగా తల్లులతోపాటూ తండ్రులకూ ముఖ్యమైన మెసేజ్‌లను పోస్ట్ చేసింది. 'కొత్త తండ్రులు, పిల్లల్ని ప్రేమించేవాళ్లంతా వినండి. ప్రపంచ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా మీ పిల్లల తల్లికి మీరు ఎక్కువ సపోర్ట్ ఇవ్వాలి' అని కోరింది సమీరా. సమీరాతోపాటూ నేహా ధూపియా కూడా ప్రపంచ తల్లి పాల వారోత్సవాల క్యాంపెయిన్ నిర్వహిస్తున్నది. సమీరారెడ్డి పెట్టిన ఫొటో, వీడియోను మెచ్చుకుంటూ నెటిజన్లు షేర్ చేస్తున్నారు.



## వయసు 107.. ఫుల్ హుషార్!

ఈ కాలంలో 70-80 సంవత్సరాలకే జీవితకాలం ముగుస్తున్నది. 60 యేండ్లు వస్తే.. ఎవరో ఒకరి తోడు కావాలి. అలాంటిది న్యూయార్క్‌కి చెందిన లూయిస్ సిగ్నోర్ అనే ఈ బామ్మ వందేండ్లు నిండినా.. హాయిగా తన పనులు తాను చేసుకుంటూ సంతోషంగా గడుపుతున్నది. ఈ శతాధిక వృద్ధురాలు ఇటీవలే తన 107వ పుట్టిన రోజు జరుపుకున్నది. దీంతో ఆమె ఆరోగ్య రహస్యమేంటి? ఇంతకాలం జీవించగలగడానికి కారణాలేంటోనని ఆమెను అడుగుతున్నారట. న్యూయార్క్‌లోని కూప్ సిటీలో జాసా బార్టో సీనియర్ సెంటర్‌లో లూయిస్ 107వ పుట్టినరోజు వేడుకలను ఆమె బంధువులు ఘనంగా జరిపారు. ఆమె ఆరోగ్య రహస్యమేంటి? అన్నది చాలామందికి కలిగిన ప్రశ్న. అయితే ఈ బామ్మ పెళ్లి చేసుకోలేదు. అదే తన ఆరోగ్య రహస్యం కావచ్చని ఆమె చెబుతున్నది. రోజువారీ పనులు చేసుకుంటూనే.. ఆరోగ్యకరమైన ఆహారం తినడం తన దీర్ఘాయుష్షుకి మరో కారణమట. ఇప్పటికి కూడా చేతనైనన్ని ఎక్సర్‌సైజ్‌లు, డ్యాన్స్‌లు చేస్తుంది లూయిస్. లంచ్ తర్వాత ఆమె బింగో ఆడుతుంది. బీపీ ఉన్నా.. కంట్రోల్‌లో ఉండేందుకు మందులు వాడుతున్నది. అంత మాత్రాన ఆమె ఎప్పుడు దిగులు చెందలేదు. రోజూ హుషారుగానే ఉంటుంది.

# లోపాన్ని జయించి.. విజయం సాధించి



**ఆ ఇంట్లో నలుగురు సంతానం. వారిలో ముగ్గురూ దివ్యాంగులే. ఇద్దరికి చూపులేదు. ఒకరు కుర్చీకే పరిమితమయ్యారు. తల్లిదండ్రులు కూడా వృద్ధులవడంతో.. కుటుంబ భారం పెద్ద కొడుకుపై పడింది. బతుకు బండిని లాగేందుకు ఊరూరు తిరిగి బట్టలమ్మే తండ్రి వారసత్వాన్ని అందుకున్నాడు కొడుకు. అంధులైన తన తోబుట్టువులు ఏం చెయ్యలేని పరిస్థితి. శారీరకంగా 90 శాతం లోపం ఉన్నా.. మానసికంగా దృఢంగా ఉన్న ఆమె కూడా.. అన్నతో పాటు కుటుంబ భారాన్ని భుజాన వేసుకున్నది. అవమానాలు, అవహేళనలు ఎదురైనా భరించింది. పేరులో ఉన్న విజయాన్ని తన జీవితంలోకి తెచ్చుకునేందుకు ఇన్నేండ్లు శ్రమించి, విధిరాతను మార్చుకొని చివరికి విజేతగా నిలిచింది ఈ విజయలక్ష్మి.**

మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన ఈ వీల్‌చైర్ ఆర్టిస్ట్ విజయలక్ష్మిది గుండెను తొలిచేసే వ్య(క)థ. నలుగురిలో స్ఫూర్తిని నింపే విజయగాథ. ఇంట్లో ముగ్గురు దివ్యాంగ సంతానాన్ని పెంచుతూ ఆ తల్లిదండ్రులు ఎంత మానసిక సంఘర్షణ ఎదుర్కొన్నారో వారికే తెలియాలి. వారి కష్టాలు, తోబుట్టువుల బాధలన్నీ కళ్లారా చూసింది విజయ. తనకు నచ్చిన రంగంలో వీల్‌చైర్ నుంచే కష్టానికి అలవాటుపడింది. ఆమెకున్న లోపం కారణంగా ఊహ తెలిసినప్పుడే స్నేహితులు దూరమయ్యారు. ఖాళీగా ఉండలేక చిన్నప్పుడు పెన్సిల్‌తో బొమ్మలు గీసేది. పేపర్లలో వచ్చే బొమ్మలతో కుస్తీ పట్టింది. తనకు బాగా నచ్చిన చిత్రాలను పెయింటింగ్స్‌గా మలి కుంచెతో స్నేహం చేసింది. సమాజం పట్ల అవగాహన పెరుగుతున్న కొద్దీ తన కుంచెతో అన్ని కోణాలనూ స్పృశించింది. ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు తట్టుకునేందుకు పెండ్లిండ్లు, ఇతర శుభకార్యక్రమాలకు మెహందీ పెట్టేది. విద్యార్థులకు ట్యూషన్స్ చెప్పేది. తన యూట్యూబ్ చానెల్ ద్వారా పిల్లలకు డ్రాయింగ్ నేర్పింది. బొమ్మలతో పాఠాలు చెప్పింది. వీల్‌చైర్ నుంచే తనకు చేతనైన పనులు చేసేది. ఆమెలో చిన్నప్పటి నుంచే దైవచింతన ఎక్కువగా ఉండడంతో విష్ణు అవతారాలు, వినాయక, దుర్గమ్మ బొమ్మలు బాగా గీసేది. అలా సామాజికాంశాలపై కూడా తన కుంచెను సంధించింది విజయ. మహిళలపై పెరుగుతున్న అఘాయిత్యాలను దాడులు, వెలివేతలను చిత్రాలుగా గీసింది. వీటితో పాటుగా మన తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే బతుకమ్మ, బోనాలు, పల్లె అందాలు, ప్రకృతిపై వందలకొద్దీ పెయింటింగ్స్ వేసింది. ఇప్పటి వరకు దాదాపు 500లకు పైగా పెయింటింగ్స్ గీసింది విజయ.

### మీరే సాయం చేయాలి

పెయింటింగ్ వేయడమంటే చాలా ఖర్చుతో కూడుకున్నది. రంగులు, షీట్స్, లామినేషన్, ఫ్రేమ్స్ వంటివి సమకూర్చుకోవాలి. విజయ గీసేది కాన్వాస్ పెయింటింగ్. దీనికి ఖర్చు చాలా ఎక్కువ. అన్నికష్టాలకు ఓర్చి, తానేంటో నిరూపించుకోవాలని, నలుగురికి స్ఫూర్తి నింపాలనే ఉద్దేశంతో పెయింటింగ్స్ వేస్తున్నది. ఈ క్రమంలో తాను గీసిన పెయింటింగ్స్‌ను విక్రయించాలని అనుకుంటున్నది విజయలక్ష్మి. ఆమె కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడానికి, ఆమె గీసిన పెయింటింగ్స్ కొనుగోలు చేయడానికి 9849548190 నంబర్‌లో సంప్రదించొచ్చు.

### వారిలో స్ఫూర్తి నింపాలి

నేను ఈ స్థాయికి చేరుకోవడానికి ఎంతో కష్టపడ్డాను. నాలాగే ఎంతోమంది ఉన్నారు. వారిలో చైతన్యం తీసుకురావాలి. దివ్యాంగులను ఇంట్లో పెట్టుకొని తల్లిదండ్రులు చాలా బాధపడుతుంటారు. అయితే వారిని అలా ఇంటికే పరిమితం చేయకుండా నైపుణ్యం ఉన్న రంగంలో రాణించేందుకు సహాయపడాలి. అప్పుడే వారిలోని ప్రతిభ బయటి ప్రపంచానికి తెలుస్తుంది. పెయింటింగ్స్‌లో జాతీయస్థాయిలో అవార్డు తీసుకోవాలన్నదే నా లక్ష్యం. అదేవిధంగా నా కుటుంబానికి ఆర్థికంగా తోడ్పాటు అందించాలి. దానికోసమే శ్రమిస్తున్నా. నాకు ప్రోత్సాహం అందిస్తున్న వారికి, నా తల్లిదండ్రులు, మా అన్నయ్య-వదిన, నా కుటుంబ సభ్యులకు కొత్తా కృష్ణవేణి గారు, మామిడి హరికృష్ణగారు, మా సంఘం జాతీయ, రాష్ట్ర అధ్యక్షులకు పేరు పేరునా కృతజ్ఞలు.

**– విజయలక్ష్మి, చిత్రకారిణి**

### అవమానాలను ఎదుర్కొని..

'ఓ ప్రమీలమ్మా.. ఎందుకమ్మా పిల్లను ఇంట్లో ఉండనివ్వకుండా బడికి పంపుతున్నావ్? ఆమె ఈడ్చుకుంటా ఎల్లి చదువుకుని జాబ్ చేస్తదా?' అని విజయ లోపాన్ని చిన్నప్పటి నుంచే వెక్కిరించారు. అయినా తల్లి ప్రమీల, తండ్రి నర్సింహులు బయటవారి మాటలు వినలేదు. కూతురి ఇష్టానికే వదిలేశారు. ధైర్యం చెప్పి.. కష్టమైనా బడికి పంపారు. ముగ్గురు బిడ్డలను కంటికి రెప్పలా కాచుకున్నారు. విజయలక్ష్మిలో అంతకంతకూ ఆత్మస్థైర్యం రెట్టింపు అయింది. పనిపై పట్టుదల పెరిగింది. పది వరకు చదివి..



ఆ తర్వాత ఓపెన్‌లో డిగ్రీ చేసింది.

### ప్రతిభను మెచ్చిన అవార్డులు

తన పెయింటింగ్స్ ద్వారా ఎంతోమంది హృదయాలతో పాటు.. నాలుగు అవార్డులు కూడా గెలుచుకున్నది విజయలక్ష్మి. గతేడాది ఆగస్టులో రవీంద్రభారతిలో ఐపీఎస్ షిఖా గోయల్ చేతుల మీదుగా 'లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్' పురస్కారం అందుకున్నది. ఈ ఏడాది ఉమెన్స్ డే సందర్భంగా ప్రతిభావంతులైన దివ్యాంగుల తల్లిదండ్రులు ఇచ్చే 'మాతృశ్రీ' పురస్కారాన్ని తన తల్లితో కలిసి అందుకున్నది. మార్చిలో రవీంద్రభారతిలో తెలంగాణ సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ చేతుల మీదుగా 'స్ఫూర్తి' పురస్కారాన్ని అందుకున్నది. గత ఏప్రిల్‌లో త్యాగరాయ గాన సభలో 'ప్రతిభా పురస్కారం' వకుళాభరణం కృష్ణమోహన్ చేతుల మీదుగా అందుకున్నది.

### ఎగ్జిబిషన్‌కు సహకారం

రవీంద్రభారతిలో విజయ రెండోసారి అవార్డు తీసుకుంటున్నప్పుడు ఆమెను ప్రతిభను రాష్ట్ర సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ గుర్తించారు. ఆ వేదికపై ఆమెకు రవీంద్రభారతిలో 5 రోజులు ఎగ్జిబిషన్ పెట్టుకోవడానికి అనుమతి ఇస్తున్నట్లు మాట ఇచ్చారు. ఆ వెంటనే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆమె ఎగ్జిబిషన్‌కు అనుమతిచ్చారు. ఈ ఆర్ట్ ప్రదర్శనను మంత్రి శ్రీనివాసగౌడ్ ప్రాంభించారు. ఆ సమయంలో 31 జిల్లాల నుంచి ఆ ఎగ్జిబిషన్‌ను చూడ్డానికి వచ్చిన దివ్యాంగులు, ఆయా జిల్లాల దివ్యాంగ సంఘాల ప్రతినిధులకు ఉచితంగా భోజన సదుపాయాన్ని కల్పించారు మామిడి హరికృష్ణ. ఈ ఎగ్జిబిషన్‌లో వివిధ అంశాలపై గీసిన 80కి పైగా చిత్రాలను ప్రదర్శించింది విజయ. ఈ ప్రదర్శన చూడ్డానికి వచ్చిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రాంరెడ్డి తమ 'ఆర్షీ సొసైటీ' నుంచి బ్యాటరీ వీల్‌చైర్‌ను విజయకు అందించారు. దాని విలువ దాదాపు రూ.70వేలపైనే. ఎగ్జిబిషన్ చూడ్డానికి వచ్చిన 31 జిల్లాల దివ్యాంగ ప్రతినిధులు విజయను ఘనంగా సత్కరించారు.

### తెలంగాణ దివ్యాంగ కళాయాత్ర

వివిధ రంగాల్లో నిపుణులైన దివ్యాంగ కళాకారులతో కళాయాత్రను చేపట్టింది తెలంగాణ ప్రభుత్వం. చిన్న విషయాలకే కలత చెంది ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారిలో చైతన్యం, దివ్యాంగుల్లో స్ఫూర్తి నింపడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ఈ కళాజాతాలో పలు జిల్లాలకు చెందిన 16మంది దివ్యాంగ కళాకారులను ఎంపిక చేశారు. వారిలో విజయలక్ష్మి కూడా ఉన్నది. ఈ కళా బృందం పాత పది జిల్లాల్లో పర్యటిస్తూ.. ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నది. ఇటీవల భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రదర్శన ఇచ్చారు. త్వరలోనే సిరిసిల్లలో ప్రదర్శన ఉంది.

... డప్పు రవి



## వాడని పువ్వులే ఆభరణాలు!



క్రియేటివిటీకి హద్దులు లేవు. ఏదైనా కొత్తగా ఆలోచించాలి, క్రియేటివ్‌గా చెయ్యాలి అనుకున్న ఫ్లవర్ ఫ్యాషనీర్ సుశాన్ మెక్‌లియరీ పువ్వులనే ఆభరణాలుగా మార్చేశారు. వేళ్లకు రింగులు, మెడలో హారాలు, తలపై హెయిర్ బ్యాండ్.. ఇలా ప్రతీదీ పూలతోనే తయారుచేస్తారు సుశాన్ మెక్‌లియరీ. ఏది కావాలన్నా ముందుగా ఆమె మెటల్ బేస్ తీసుకుంటారు. దానిపై చిన్న చిన్న మొక్కలను పెంచుతారు. కొన్ని రోజులకు అవి చక్కగా పెరిగి పూలు కూడా పూస్తాయి. ఎంతో శ్రద్ధగా పెంచితే తప్ప అవి అంత చక్కగా పెరగవు. అవి ఏపుగా పెరిగిన తర్వాత వాటిని పెళ్లిళ్లు, ఇతర ఫంక్షన్లకు వెళ్లే వారు, ఫ్యాషన్ మోడల్స్ కొనుక్కుంటారు. వాటిని మరింత జాగ్రత్తగా చూసుకుంటే కొన్ని వారాలపాటూ పెరుగుతాయి. మెటల్ బ్యాండ్ నుంచీ మొక్కలను తొలగించి మట్టిలో పాతి మళ్లీ పెంచుకోవచ్చు కూడా. అందుకే సుశాన్ క్రియేటివిటీకి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించింది.

## వృద్ధులకు ఉచిత భోజనం!



కొస్త వయసు మీద పడగానే తల్లిదండ్రులను.. పిల్లలు భారంగా భావిస్తున్నారు. రాను రాను వృద్ధాశ్రమాలలో వయోవృద్ధుల సంఖ్య పెరిగిపోతున్నది. పిల్లలు ఉన్న తల్లిదండ్రుల పరిస్థితి ఇలా ఉంటే ఇక నిరుపేదలైన, అనాథ వయోవృద్ధుల పరిస్థితి అగమ్యగోచరమే. అయితే అలాంటి వారి కోసం 'నేనున్నాను' అంటూ ఓ వ్యక్తి ముందుకు వచ్చాడు. వారి కోసం ఓ హోటల్‌ను ఏర్పాటు చేశాడు. అది వారిని ఆప్యాయంగా పలుకరిస్తుంది. కడుపు నిండా భోజనం పెట్టి వారి ఆకలిని తీరుస్తున్నది. కేరళలోని కోజికోడ్ జిల్లాలో ఉన్న కుట్టియాడి గ్రామంలో 'కండతిల్' అనే హోటల్ ఉంది. దీన్ని బాబు అనే వ్యక్తి నిర్వహిస్తున్నాడు. 75 ఏళ్లు పైబడిన వృద్ధుల నుంచి పైసా కూడా తీసుకోకుండా వారికి ఉచితంగా భోజనం పెడుతున్నాడు. అలాగే వారికి ఇతర తినుబండారాలు కూడా ఉచితంగా అందిస్తున్నాడు. ఇలా వయోవృద్ధులకు కడుపు నింపడంలోనే తనకు ఆనందమని చెబుతున్నాడు. ఐదేండ్ల క్రితం హోటల్ ప్రారంభించాడు బాబు. నాటి నుంచి వృద్ధులకు ఉచితంగా భోజనం అందిస్తూ అందరి మన్ననలూ పొందుతున్నాడు బాబు.

## సుడోకు

డైలీ సుడోకు 111 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 2 | 1 | 6 | 8 | 7 | 4 | 9 | 3 | 5 |
| 8 | 5 | 4 | 9 | 3 | 1 | 7 | 6 | 2 |
| 7 | 9 | 3 | 6 | 2 | 5 | 1 | 8 | 4 |
| 6 | 4 | 2 | 3 | 8 | 9 | 5 | 1 | 7 |
| 3 | 7 | 9 | 1 | 5 | 6 | 4 | 2 | 8 |
| 5 | 8 | 1 | 7 | 4 | 2 | 3 | 9 | 6 |
| 9 | 3 | 8 | 5 | 6 | 7 | 2 | 4 | 1 |
| 1 | 2 | 5 | 4 | 9 | 8 | 6 | 7 | 3 |
| 4 | 6 | 7 | 2 | 1 | 3 | 8 | 5 | 9 |

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -112

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 4 | | | 9 | 3 | | | | 1 |
| | | 7 | 5 | | | | 3 | |
| | | | | | 6 | | | 4 |
| 8 | 5 | 9 | | | | | 4 | |
| | | | 4 | | 8 | | | |
| | 1 | | | | | 9 | 2 | 8 |
| 1 | | | 7 | | | | | |
| | 4 | | | | 5 | 3 | | |
| 5 | | | | 4 | 1 | | | 6 |

## ట్వీట్



వర్షానికి కృతజ్ఞతలు. వర్షపు చినుకుల శబ్దం ఎక్కువైనప్పుడు ఎంతో సంతోషంగా ఉంటుంది. ఎందుకంటే.. మరింత వర్షం పడుతుంది కదా! ప్రతి చుక్క వర్షం మనకు బహుమతిగానే భావిస్తున్నా.

ఇషా కొప్పికర్
@ishakonnects



ఇషా కొప్పికర్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
1,91,346

## కామన్‌మ్యాన్ వాయిస్

మనకు కావాల్సిందల్లా ఎప్పుడంటే అప్పుడు రాదు. దేన్నైనా సాధించేదాకా శోధించాల్సిందే. జీవితమంటే ఒడుదొడుకుల ప్రయాణం.
– Kiran Dasari

జీవం లేని మొబైల్ ఫోన్లే అప్డేట్ అడిగి మరీ కొత్తగా మారుతున్నయ్.. ప్రాణమున్న మనుషులు కొత్తగనో, చెత్తగనో మారరా?
– Ram Kishanji

కొన్ని బాధలని మౌనం నిశ్శబ్దంగా మింగేస్తుంది.
– Sandhya Reddy

శరీరం కుంటిదైనా, గుడ్డిదైనా పెద్ద సమస్య కాదు. ఆలోచనలు కుంటివో, గుడ్డివో అయితేనే సమస్య.
– Tirumandas Naresh Goud

## వైరల్ వీడియో



**సాహో సినిమాకి సంబంధించిన ఏ విషయమైనా సంచలనంగానే మారింది. ఈ సినిమాలో మరో పాటను విడుదల చేసింది చిత్ర బృందం. పాట ఇప్పుడు యూట్యూబ్ ట్రెండింగ్‌లో టాప్‌లో నిలిచింది.**

Saaho: Enni Soni Song | Prabhas, Shraddha Kapoor | Guru Randhawa, Tulsi Kumar
Total views : 1,62,71,972+
Published on 2 Aug 2019

III.
నమస్తే తెలంగాణ
# అల్లరి
[ కరీంనగర్ ]
ఆదివారం 4 ఆగస్టు 2019

## జత పరుచండి




## ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ తయారీ

నేడు స్నేహితుల దినోత్సవం. ప్రతిఒక్కరి జీవితంలో మర్చిపోలేని స్నేహితులుంటారు. కొంతమంది దగ్గరగా ఉంటారు. మరికొంత మంది దూరంగా ఉండడంతో పలుకరించడం కూడా కష్టమవుతుంది. అలాంటివారిని దగ్గర చేసేందుకే ఈ ఫ్రెండ్‌షిప్ బ్యాండ్. మరి దీని తయారీ ఎలానో తెలుసుకోండి.



- ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌కు కావాల్సిన రంగురంగుల ఊలు దారాలు, కత్తెర, టేపు తీసుకోవాలి.
- ఎవరికైతే కట్టాలనుకుంటున్నారో టేపు ద్వారా వారి చేతి మణికట్టు కొలతలు తీసుకోవాలి. ఆ కొలతలకు తగినట్లుగా, ముడి వేసేందుకు సరి పడా అదనంగా ఊలు దారాన్ని కత్తిరించుకోవాలి.
- ఏ డిజైన్ అయితే ఎంపిక చేసుకుంటారో దానికి కావాల్సిన దారాలను సిద్ధం చేసుకొని పెట్టుకోండి. ఒక రంగు దారం తర్వాత మరొక రంగు దారం వచ్చేలా చూసుకోవాలి. లేదంటే ఆకర్షణీయంగా ఉండదు.
- ముందుగా దారం విడిపోకుండా ఉండేందుకు ముడి వేసుకోవాలి. ఆ తర్వాత మూడు దారాలతో జడని అల్లినట్లు అల్లాలి. అలా మూడు అంగుళాల వరకు అల్లి మరొక ముడి వేసి వేరే డిజైన్ వచ్చేలా అల్లాలి.
- మధ్యలో వేరే డిజైన్ వచ్చి రెండు చివర్ల ఒకే అల్లిక ఉండి చివర్లో ముడి వేయాలి. అప్పుడే బ్యాండ్ చూడడానికి అందంగానూ, కలర్‌ఫుల్‌గానూ ఉంటుంది.
- ఫొటోలో చూపిన విధంగా రంగుల దారాలని ఎంచుకోవచ్చు. మీ చేతులతో తయారు చేసిన బ్యాండ్ ఫ్రెండ్‌కు కడితే వారి ఆనందమే వేరు.

## దేశం ఏదైనా మన జెండా ఎగురాల్సిందే!

ఏ క్రీడ అయినా పోటీ గట్టిగానే ఉంటుంది. అది అంతర్జాతీయ స్థాయిలో అంటే ఆ మజానే వేరు. అలాంటి ఉత్కంఠకు ఏమాత్రం తీసిపోని విధంగా బధిరుల (మూగ,చెవిటి) క్రీడలు జరుగుతుంటాయి తెలుసా? సాధారణ అంతర్జాతీయ క్రీడలకు ఏమాత్రం తీసిపోకుండా అంతే రసవత్తరంగా జరుగుతుంటాయి. ఇందుకు ఉదాహరణే తైపీలో జరిగిన 'వరల్డ్ యూత్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్'. ఈ పోటీల్లో మన దేశానికి చెందిన ఈ యువ క్రీడాకారిణి నాలుగు పతకాలు సాధించి.. తన పేరు చరిత్రలో లిఖించుకున్నది.




అక్కడ ఆడేదంతా బధిరులు. సాధారణ క్రీడల్లో మాదిరిగా అక్కడ అరుపులు, కేకలు వినిపించడం చాలా అరుదు. అయితే ఆటమాత్రం చాలా రసవత్తరంగానే సాగుతుంటుంది. కంటి చూపులే ఆటను రక్తి కట్టిస్తాయి. ఇలాంటి క్రీడలకు మన దగ్గర ప్రోత్సాహం చాలా తక్కువే అయినా క్రీడాకారులకు కొదువ లేదు. అలాంటి క్రీడా ఆణిముత్యాల్లో జెర్లిన్ అనికా ఒకరు. ఈ యువ క్రీడాకారిణి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో ఒక బంగారు, రెండు వెండి, ఒక కాంస్య పతకాలు సాధించి.. దేశ పతాకాన్ని రెపరెపలాడించింది. ఎలాంటి ప్రోత్సాహపు అరుపులు వినిపించని చోట.. స్టేడియం మొత్తం హోరెత్తేలా తన విజయఢంకా మోగించింది అనిక.



### పతకాల వేట..

మదురై జిల్లాలోని విల్లాపురానికి చెందిన 15 యేండ్ల జెర్లిన్ అనికా బధిర క్రీడాకారిణి. ప్రస్తుతం మదురైలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నది అనిక. చిన్నప్పటి నుంచి ఈమెకు క్రీడలంటే చాలా ఆసక్తి. తైపీలో జూలై 17 నుంచి 22 వరకు 'ప్రపంచ బధిర యూత్ బ్యాడ్మింటన్' పోటీలు జరిగాయి. వివిధ దేశాల నుంచి ఎంతోమంది బధిర క్రీడాకారిణులు పాల్గొన్నారు. వారిలో అనికా కూడా ఒకరు. ఆ పోటీల్లో పలు విభాగాల్లో నాలుగు పతకాలు సాధించింది అనిక. ఫైనల్లో జర్మనీకి చెందిన టాప్‌సీడ్ క్రీడాకారిణి ఫిన్జా రోసెందహల్‌ను 21–12, 21–13తో ఓడించి మువ్వన్నెల జెండాను రెపరెపలాడించింది అనిక. జూలై 28న బంగారు పతకం స్వీకరించి దేశ ప్రతిష్ఠను మరింత పెంచింది ఈ యువ క్రీడాకారిణి. ఈ విజయం ఆమెది మాత్రమే కాదు.. యావత్ భారతావనిది. గతంలో కూడా అంతర్జాతీయ స్థాయిలో పతకాల వేట కొనసాగించింది అనిక. మలేషియాలో జరిగిన 5వ 'ఆసియా పసిఫిక్ బధిర బ్యాడ్మింటన్‌షిప్'లో రెండు రజత పతకాలు, కాంస్యం సాధించింది అనిక.

### కోచ్ బాటలోనే..

అనికా ఈ ఏడాది ప్రారంభంలో టర్కీలో జరిగిన 'డెఫ్‌లింపిక్స్'లో పాల్గొన్నది. అందులో ఐదవ స్థానంలో నిలిచింది. ఇటీవలే భారతదేశానికి ప్రాతినిధ్యం వహించింది. ప్రపంచ జూనియ చాంపియన్‌షిప్‌లో అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చి.. చైనా క్రీడాకారిణిని ఓడించింది. అనికను ఉన్నత స్థాయిలో తీర్చిదిద్దుతానని ఆమె తల్లిదండ్రులకు భరోసా కల్పించాడు కోచ్. ఇలా మరిన్ని అథ్లెటిక్స్‌లో విజయం సాధించాలనే లక్ష్యంతో ఉన్నది అనిక.

### అనుకోకుండా ఒకరోజు..

అనికా తండ్రి జయ రాట్చగన్, తల్లి లీమా. జయ రాట్చగన్ ఫ్రెండ్స్‌తో కలిసి సరదాగా బ్యాడ్మింటన్ ఆడుతుండేవాడు. తనతోపాటు అనికాను కూడా తీసుకెళ్లేవాడు తండ్రి. 8 యేండ్ల వయసు వచ్చేనాటికి ఆమె బ్యాడ్మింటన్ క్రీడను ఎంతో శ్రద్ధగా చూసేది. అందరూ ఎలా ఆడుతున్నారు? కోర్టులో ఎలా వేగంగా కదులుతున్నారో గమనించేది. అలా ఒకరోజు తండ్రి బ్యాట్ ఆమె చేతికిచ్చి ఆడమని చెప్పాడు. కోర్టులో అడుగుపెట్టిన మొదటిసారే అనుభవం ఉన్న క్రీడాకారిణిలా ఆడింది. ఆమె ఆట చూసిన జయ అతని స్నేహితులు ఆశ్చర్యపోయారు. బ్యాడ్మింటన్‌లో శిక్షణలో చేర్పిస్తే గొప్ప క్రీడాకారిణి అవుతుందని స్నేహితులు సలహా ఇచ్చారు. 8 ఏండ్ల వయసులో కోచ్ టి.శరవణన్ దగ్గర ట్రైనింగ్ ఇప్పించాడు. కోచ్ ఆమెను అన్ని విధాలా పరిక్షించాడు. ఆమె బలం, బలహీనత తెలుసుకున్నాడు. బధిరులకు ఎలా చెబితే అర్థమవుతుందో తెలుసుకొని అదే విధంగా సున్నితంగా చెప్పేవాడు కోచ్. అన్ని విధాలా ఆమెను క్రీడాకారిణిగా తీర్చిదిద్దాడు. అలా జిల్లా, రాష్ట్రస్థాయిల్లో ప్రతిభ చూపించింది అనిక. చిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయికి ఎదిగింది. ఒకవైపు స్కూల్ మరొకవైపు బ్యాడ్మింటన్ రెండింటినీ బ్యాలెన్స్ చేసుకుంటున్నది. తనను నిత్యం ప్రోత్సహిస్తున్న పాఠశాల యాజమాన్యం, కోచ్‌లకు కృతజ్ఞతలు చెబుతున్నది అనిక.

.. వనజ వనిపెంట

## దారి కనుక్కోండి



## పదాలు కలుపండి!

1. అప్పట్లో అలారం ఇదే?
2. పల్లెటూళ్లలో బైక్‌ను ఇలా పిలుస్తారు?
3. పాఠశాలను ఇలా కూడా పిలుస్తారు?
4. సిల్వర్ మరోలా?
5. చెరువుకు అది పడితే ఊరికే ప్రమాదం?
6. ఆటలో అబద్ధం ఆడితే ఏమంటారు?




## చుక్కలు కలిపి రంగులు వేయండి



## చేపను కనిపెట్టండి



## బ్లడ్ రిలేషన్స్



1. అమ్మ అక్క కూతురు మీ మామకు ఏమవుతుంది?
2. అక్క వదిన మీ అన్న కూతురుకు ఏమవుతుంది?
3. పెద్దమ్మ నాన్న మీ నాన్నకు ఏమవుతాడు?
4. అన్నయ్య కోడలు మీ నాన్నకు ఏమవుతుంది?
5. అత్త మేనమామ మీ అన్నకు ఏమవుతాడు?

## పజిల్




## చిక్కుప్రశ్న



అన్నా తమ్ముళ్లిద్దరు మూడు అరటిపండ్లను కొని సమానంగా పంచుకున్నారు. అదెలా సాధ్యం?

## జవాబులు

పదాలు కలుపండి : 1. కోడి 2. బండి 10 3. బడి 4. వెండి 5. గండి 6. తొండి
బ్లడ్ రిలేషన్స్ : 1. కోడలు 2. పెద్దమ్మ 3. మామ 4. మనవరాలు 5. తాతయ్య
చిక్కుప్రశ్న : అన్న = 1, తమ్ముళ్లు = 2, మొత్తం = 3
జతపరుచండి : 1.C 2.E 3.A 4.B 5.D
పజిల్ : 915

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

## ఎన్ఐఆర్‌టీలో సైంటిస్టులు

చెన్నైలోని ఐసీఎంఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రిసెర్చ్ ట్యూబర్‌క్యులోసిస్ (ఎన్ఐఆర్‌టీ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- మొత్తం పోస్టులు: 14

**విభాగాలవారీగా ఖాళీలు:** సైంటిస్ట్ సీ (మెడికల్) –7, సైంటిస్ట్ సీ (కన్సల్టెంట్)–7

- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎంబీబీఎస్ లేదా పీజీ/ఎండీ లేదా సంబంధిత విభాగంలో మాస్టర్ డిగ్రీ లేదా పీహెచ్‌డీ ఉత్తీర్ణత.
- వయస్సు, ఎంపిక వివరాల కోసం ఎన్ఐఆర్‌టీ వెబ్‌సైట్ చూడవచ్చు.
- **చివరితేదీ:** ఆగస్టు 6
- **వెబ్‌సైట్:** www.nirt.res.in

## కోస్ట్‌గార్డ్‌లో యాంత్రిక్ పోస్టులు

భారత రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన ఇండియన్ కోస్ట్‌గార్డ్ ఖాళీగా ఉన్న యాంత్రిక్-01/2020 బ్యాచ్ (డిప్లొమా హోల్డర్స్) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



- **పోస్టు పేరు:** యాంత్రిక్ (డిప్లొమా)
- **అర్హతలు:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి మెకానికల్/ఎలక్ట్రానిక్స్ & టెలి కమ్యూనికేషన్ (రేడియో/పవర్), ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో కనీసం 60 శాతం మార్కులతో మూడేండ్ల డిప్లొమా ఉత్తీర్ణత.

**గమనిక:** ఇంటర్ స్టేట్ & జాతీయ స్థాయి క్రీడలలోని 1, 2 ,3వ స్థానం చాంపియన్‌షిప్ పొందిన ఎస్సీ/ఎస్టీలకు 5 శాతం ఉత్తీర్ణతలో సడలింపు ఉంటుంది.

- **వయస్సు:** 18 –22 ఏండ్ల మధ్య ఉండాలి. అనగా 1998, ఫిబ్రవరి 1 నుంచి 2002, జనవరి 31 మధ్య జన్మించి ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్ల వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **జీతభత్యాలు:** రూ. 29,200 + యాంత్రిక్ పే రూ.6,200/– వీటికి అదనంగా డీఏ, కిట్ మెయింటెనెన్స్ అలవెన్స్, ఇతర అలవెన్స్‌లు ఉంటాయి.
- **పదోన్నతులు:** యాంత్రిక్ టెక్నికల్ నుంచి ప్రధాన్ సహాయక్ ఇంజినీర్ హోదా వరకు వెళ్లవచ్చు.
- **శారీరక ప్రమాణాలు:** ఎత్తు :157 సెం.మీ ఉండాలి. ఛాతీ గాలి పీల్చినప్పుడు కనీసం 5 సెం.మీ. వ్యాకోచించాలి.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, పీఎఫ్‌టీ ద్వారా
- **రాతపరీక్ష:** ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. దీనిలో సంబంధిత డిప్లొమా ఇంజినీరింగ్ సబ్జెక్టులైన ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ & టెలి కమ్యూనికేషన్ అంశాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. జనరల్ నాలెడ్జ్, రీజనింగ్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్‌పై కూడా ప్రశ్నలు ఇస్తారు.
- రాతపరీక్షలో క్వాలిఫై అయిన వారికి ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్ (పీఎఫ్‌టీ), ప్రిలిమినరీ మెడికల్ ఎగ్జామినేషన్‌లను నిర్వహిస్తారు.
- **ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్:** 1.6 కి.మీ. దూరాన్ని 7 నిమిషాల్లో, 10 పుష్ అప్‌లు, 20 ఉతక్ బైటక్‌లు చేయాలి.
- **పరీక్ష కేంద్రాలు:** ముంబై, కోల్‌కతా, చెన్నై.
- **శిక్షణ:** ఎంపికైన అభ్యర్థులకు ఐఎన్ఎస్ చిల్కాలో 2020 ఫిబ్రవరి నుంచి ట్రెయినింగ్ ప్రారంభమవుతుంది.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో ఆగస్టు 11 నుంచి ప్రారంభం
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఆగస్టు 17
- **వెబ్‌సైట్:** www.joinindiancoastguard.gov.in

## ఏఏఎస్ఎల్‌లో సూపర్‌వైజర్లు

ఎయిర్ ఇండియా పరిధిలో పని చేస్తున్న ఎయిర్‌లైన్ అల్లైడ్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఏఎస్ఎల్) ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- **పోస్టు పేరు:** సూపర్‌వైజర్
- **మొత్తం పోస్టులు:** 52 (సూపర్‌వైజర్ (క్యాటరింగ్)–3, సీనియర్ సూపర్‌వైజర్–49)

Airline Allied Services Limited
(A wholly owned subsidiary of Air India Limited)

- **అర్హత:** ఏదైనా బ్యాచిలర్ డిగ్రీలో ఉత్తీర్ణతతో పాటు సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి. సూపర్‌వైజర్ పోస్టులకు ఇంటర్‌తో పాటు డిప్లొమా (హోటల్ మేనేజ్‌మెంట్) లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత.
- **వయస్సు:** సీనియర్ సూపర్‌వైజర్‌కు 40 ఏండ్లు, సూపర్‌వైజర్‌కు 35 ఏండ్లకు మించరాదు.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 1000/–ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు ఎలాంటి ఫీజు లేదు.
- **ఎంపిక:** టెక్నికల్ నాలెడ్జ్ టెస్ట్, స్కిల్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్ ద్వారా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఆగస్టు 9
- **వెబ్‌సైట్:** http://www.airindia.in

## ఎన్‌టీపీసీలో ఐటీఐ ట్రెయినీలు

ఛత్తీస్‌గఢ్ (రాయ్‌పూర్)లోని నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌టీపీసీ) ఖాళీగా ఉన్న ట్రెయినీ పోస్టుల భర్తీకి అర్హులైన ఐటీఐ ట్రేడ్, బీఎస్సీ (కెమిస్ట్రీ) అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



- **వెబ్‌సైట్:** www.ntpccareers.net
- **మొత్తం ఖాళీలు:** 79
- ఐటీఐ ట్రెయినీ (ఫిట్టర్)–30 , ఐటీఐ ట్రెయినీ (ఎలక్ట్రీషియన్)–16, ఐటీఐ ట్రెయినీ (ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్)–12, అసిస్టెంట్ (జనరల్) ట్రెయినీ–5,
- ల్యాబ్ అసిస్టెంట్ (కెమిస్ట్రీ) ట్రెయినీ–6, డిప్లొమా ట్రెయినీ (ఎలక్ట్రికల్)–5, డిప్లొమా ట్రెయినీ (మెకానికల్)–5,
- **అర్హతలు:** ఎన్‌సీవీటీ/ఎస్‌సీవీటీ బోర్డుచే గుర్తింపు పొందిన సంస్థ నుంచి సంబంధిత ఐటీఐ (ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్) ట్రేడ్‌లో ఉత్తీర్ణత.
- అసిస్టెంట్ (జనరల్)కు ఏదైనా బ్యాచిలర్ డిగ్రీతో పాటు ఇంగ్లిష్ టైపింగ్‌లో నిమిషానికి 30 పదాల వేగం ఉండాలి. డిప్లొమా ట్రెయినీలకు సంబంధిత బ్రాంచీలో మూడేండ్ల డిప్లొమా ఉత్తీర్ణత.
- ఐటీఐ ట్రెయనీలకు రూ. 21,500/–, డిప్లొమా ట్రెయినీలకు రూ. 24,000/–
- **ఎంపిక:** ఆబ్జెక్టివ్ రాతపరీక్ష, స్కిల్ టెస్ట్
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఆగస్టు 31

## ఎన్‌సీఈఆర్‌టీలో

న్యూఢిల్లీలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రెయినింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం పోస్టులు:** 19
- **విభాగాల వారీగా ఖాళీలు:** సీనియర్ కన్సల్టెంట్–2, కన్సల్టెంట్–2, జూనియర్ రిసెర్చ్ ఫెలో–10, అసిస్టెంట్ ఫైనాన్స్ మేనేజర్/అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్–2, ఆఫీస్ మేనేజర్/ఏవో–2, గ్రాఫిక్ డిజైనర్–1
- **అర్హత:** ఎంఏ (ఎడ్యుకేషన్), ఎంఈడీ, సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ, ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ, బీకాం/తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. సంబంధిత విభాగంలో నెట్/స్లెట్ లేదా సెట్‌లో ఉత్తీర్ణత
- **దరఖాస్తు:** ఈ మెయిల్ (ppmedncert@gmail.com) ద్వారా
- **ఇంటర్వ్యూ తేదీ:** ఆగస్టు 20, 21,22, 26.27
- **వెబ్‌సైట్:** www.ncert.nic.in

IV. నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
ఆదివారం 4 ఆగస్టు 2019



'సాహో' చిత్రంలో శ్రద్ధాకపూర్, ప్రభాస్

# ఆర్‌డిఎక్స్ ప్రేమకథ!



పాయల్‌రాజ్‌పుత్, తేజస్

పాయల్ రాజ్‌పుత్, తేజస్ కంచెర్ల ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఆర్‌డిఎక్స్ లవ్'. శంకర్ భాను దర్శకుడు. జి. రామ్ మునీష్ సమర్పణలో హ్యాపీ మూవీస్, సీకే సినిమాస్ పతాకంపై సి. కల్యాణ్ నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని శనివారం హీరో వెంకటేష్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 'ఫస్ట్‌లుక్ ఆసక్తికరంగా వుంది. సినిమా పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నాను' అన్నారు. 'ఓ విభిన్నమైన ప్రేమకథ నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. చిత్రీకరణ పూర్తయింది. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. రధన్ సంగీతం, సి.రామ్‌ప్రసాద్ ఫొటోగ్రఫీ, పాయల్ రాజ్‌పుత్ గ్లామర్ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి' అని నిర్మాత సి.కల్యాణ్ తెలిపారు. నరేష్, ఆమని, ముమైత్‌ఖాన్, విద్యుల్లేఖారామన్, నాగినీడు తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: రధన్, కెమెరా: సి. రామ్‌ప్రసాద్, మాటలు: పరశురామ్, ఫైట్స్: నందు, డ్యాన్స్: గణేష్ స్వామి, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: శంకర్‌భాను.



వెంకటేష్, శంకర్‌భాను, బాబీ, సి.కల్యాణ్

# సైకలాజికల్ థ్రిల్లర్ 'ఒకడు'



దీపికా, అఖిల్‌రెడ్డి, దీపాలి

అఖిల్‌రెడ్డి కథానాయకుడిగా అరుణ్-కల్యాణి సంస్థ రూపొందిస్తున్న 'ఒకడు' చిత్రం శనివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. కృష్ణచైతన్య దర్శకుడు. దీపికా వడ్డాని, దీపాలి శర్మ కథానాయికలు. ముత్తయ్య, సోమరాజు కల్యాణి నిర్మాతలు. ముహూర్తపు సన్నివేశానికి నృత్యదర్శకుడు శేఖర్ క్లాప్‌నివ్వగా, సత్య మాస్టర్ కెమెరా స్విఛాన్ చేశారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'దర్శకుడిగా నా తొలిచిత్రమిది. యథార్థ సంఘటన స్ఫూర్తితో థ్రిల్లర్ ఇతివృత్తంతో ఈ సినిమాను తెరకెక్కించబోతున్నాం. మంచి అనుభవమున్న టీమ్ కుదిరింది' అన్నారు. 'ఈ నెల 15 నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతాం. ఐదు షెడ్యూల్స్‌లో చిత్రాన్ని పూర్తి చేస్తాం. హైదరాబాద్, కాకినాడ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపుతాం' అని నిర్మాత చెప్పారు. సైకలాజికల్ థ్రిల్లర్ కథాంశమిదని, వైవిధ్యమైన స్క్రిప్ట్‌తో హీరోగా పరిచయం కావడం ఆనందంగా ఉందని అఖిల్‌రెడ్డి తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: ఎస్.మురళీమోహన్‌రెడ్డి, సంభాషణలు: పవన్ అత్సాల, ఎడిటర్: ఎస్.ఆర్.శేఖర్, సంగీతం: మణిశర్మ, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: కృష్ణచైతన్య.

# రామ్ మేనియా స్టార్ట్ అయింది!



పూరి జగన్నాథ్, ఛార్మి, రామ్, నిధి అగర్వాల్

'విడుదలకు ముందు సినిమా చూశాను. నాకే కిక్ ఇచ్చింది. ప్రేక్షకులందరూ అదే విధంగా ఫీల్ అవుతున్నారు. నా కెరీర్‌లో మరో పదేళ్లపాటు గుర్తుండిపోయే సినిమా అవుతుంది' అన్నారు రామ్. ఆయన కథానాయకుడిగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిన 'ఇస్మార్ట్‌శంకర్' చిత్రం ఇటీవలే ప్రేక్షకు ముందుకొచ్చింది. నభానటేష్, నిధి అగర్వాల్ కథానాయికలు. పూరి జగన్నాథ్, ఛార్మి నిర్మాతలు. శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రామ్ మాట్లాడుతూ 'సాఫ్ట్ క్యారెక్టర్స్‌తో సాగే సినిమాలు చూసి బోర్ కొడుతున్నది. వైల్డ్‌గా ఏమైనా చేస్తే బాగుంటుందని పూరితో అనేవాడిని. నాకోసం ఇస్మార్ట్‌శంకర్ వంటి హుషారైన పాత్రను సృష్టించారు పూరి జగన్నాథ్. జయాపజయాలతో సంబంధం లేకుండా నా విజయాల్ని ఆస్వాదించే విశ్వాసపాత్రులైన ఫ్యాన్స్‌కు ఈ సినిమాను అంకితమిస్తున్నాను' అన్నారు. 'రామ్ ఎనర్జీ, పర్‌ఫార్మెన్స్ ఈ సినిమాను మరో లెవల్‌కు తీసుకెళ్లాయి. ఇప్పుడు రామ్ మేనియా స్టార్ట్ అయింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈ మధ్య చేసిన టూర్‌కు అద్భుతమైన స్పందన లభించింది' అని పూరి జగన్నాథ్ చెప్పారు. ఛార్మి మాట్లాడుతూ 'ఇప్పటివరకు 75 కోట్ల వసూళ్లను సాధించింది. రాబోవు రోజుల్లో మరింతగా పెరుగుతాయని ఆశిస్తున్నాం. మేము మంచి ఆకలిమీద ఉన్నప్పుడు రామ్ అన్నం పెట్టాడు. పూరి జగన్నాథ్ మీద నమ్మకంతో రామ్ ఈ సినిమా చేశాడు. తన పాత్రలో జీవించాడు. పూరి, రామ్ అనుబంధం భవిష్యత్తులో కూడా కొనసాగాలని కోరుకుంటున్నాను' అని చెప్పింది. తన కెరీర్‌లో మైలురాయిలా నిలిచిన చిత్రమిదని కథానాయిక నిధి అగర్వాల్ ఆనందం వ్యక్తం చేసింది.

# దర్శకురాలి కథనం

అనసూయ భరద్వాజ్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'కథనం'. రాజేష్ నాదెండ్ల దర్శకుడు. బి.నరేంద్రరెడ్డి, శర్మచుక్కా నిర్మాతలు. ఈ నెల 9న విడుదలకానుంది. శనివారం ఈ సినిమా ట్రైలర్‌ను సీనియర్ జర్నలిస్ట్ పసుపులేటి రామారావు ఆవిష్కరించారు. అనసూయ భరద్వాజ్ మాట్లాడుతూ 'నాగార్జున నా ఫేవరేట్ హీరో. ఆయన నటించిన 'మన్మథుడు-2' పోస్టర్, నా సినిమా పోస్టర్‌ను ఒకే టైమ్‌లో చూస్తాననుకోలేదు. వినూత్న ఇతివృత్తంతో 'కథనం' చిత్రం సాగుతుంది' అని చెప్పింది. 'దర్శకురాలు కావాలనుకునే ఓ యువతి కథ ఇది. మర్డర్ మిస్టరీ చుట్టూ కథ నడుస్తుంది. అనసూయ భరద్వాజ్ పాత్ర కొత్తగా ఉంటుంది. నైజాంలో దిల్‌రాజుగారు విడుదల చేయడం ఆనందంగా ఉంది' అని దర్శకుడు చెప్పారు. అనసూయ నటన ప్రధానాకర్షణగా నిలుస్తుందని నిర్మాతలు చెప్పారు. అవసరాల శ్రీనివాస్, వెన్నెల కిషోర్, రణధీర్, ధన్‌రాజ్, పృథ్వి తదితరలు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సతీష్ ముత్యాల, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: ఎమ్.విజయచౌదరి, నిర్మాణ సంస్థ: ది గాయత్రి ఫిల్మ్ మరియు ది మంత్ర ఎంటర్‌టైన్‌మెంట్స్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: రాజేష్ నాదెండ్ల.



శర్మ, రోషన్, రాజేష్, నరేంద్రరెడ్డి



అనసూయ భరద్వాజ్








